thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 198 కరీంనగర్ గురువారం, 25 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## బెట్టింగ్ యాప్ కేసు..ఈడీ ఎదుట హాజరైన సోనూసూద్

ప్రముఖ నటుడు సోనూ సూద్ తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు విచారణకు హాజరయ్యారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ కేసులో ఆయనను ప్రశ్నించారు. 52 ఏళ్ల సోనూ సూద్ ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కేసు డబ్బు ఆర్జన, పన్ను ఎగవేత వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఆరోపిస్తూ నమోదైంది. ఈ విచారణలో భాగంగా సోనూ సూద్‌ను మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అధికారులు ప్రశ్నించారు.సోనూ సూద్ ఈ కేసులో ఎలాంటి పాత్ర పోషించారనే దానిపై ఈడీ అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఆయన ఓ యాప్‌తో సంబంధం ఉన్న కొన్ని ఆర్థిక లావాదేవీల గురించి సమాచారం ఇవ్వడానికి హాజరయ్యారని తెలుస్తోంది. ఈ విచారణలో సోనూ సూద్ సహకరిస్తున్నట్లు సమాచారం. సోనూ సూద్ ఇటీవల కాలంలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో పేరు సంపాదించుకున్నారు. కరోనా సమయంలో ఆయన సహాయ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి.





# తుపాకీ ఎత్తింది పెద్దపల్లిలో.. నేలకొరిగింది అబూజ్మాడ్.!

## -బస్తర్ తొలి గోపన్న..మావో సీసీ అభయ్.!!
## -ఐటిఐ సత్తెన్న 45 ఏళ్ల విప్లవ పోరాటచరిత్ర
## -నేడు సిరిసిల్ల జిల్లాలో అంతిమ వీడ్కోలు యాత్ర

చురకలు ప్రతి నిధిజగిత్యాల, సెప్టెంబర్, 24

**ఈ ఊరికి నే భూస్వామినిరా .. ఈ ఊరుకు నే పట్వారినరా ..**

**నాపేరే వెంగళరావునురా** అంటూ జనాన్ని పీడించే పట్వారీ పాత్రలో విధి నాటకంలో నటించిన ఐటీఐ సత్యనారాయణ రెడ్డి గురించి పెద్దపల్లి పల్లెలు గుర్తు చేసుకుంటూన్నాయి.

**గ్యాంగోళ్ల మండిమేము బాబు,గరిబొల్ల మండి మేము బాబు..మీ రెక్క బొక్క నొయ్యకుండా చుక్కు చెమట ఓడవకుండా..** అంటూ విప్లవ రాడికల్స్ రగల్ జెండా పాటలందుకున్న కడారి సత్తన్న ఐటిఐ సత్యన్నను తల్చు కొని... రింగుల జుట్టు,అమాయకపు చూపు అని ఆయనతో కలిసి ఉన్న ఆ బంధం గురించి సీనియర్ జర్నలిస్ట్ కోల లక్ష్మణ్ వివరించారు.

**ఆయన పెద్దపల్లి తొలి పోరు పిడికిలి...** –కోటన్న దేవన్న పోరు స్ఫూర్తి అందుకున్నారు కుక్కల గూడూరు పోరు సై రన్ అందుకొని దొరల గడీల దాడిలో ముందడుగు వేసిన సందర్భాలను సీనియర్ జర్నలిస్ట్ కోల లక్ష్మణ్ పాటు మాజీ సహచరులు గుర్తు చేశారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోస గోపన్న సాధు మరో కేంద్ర కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా వికల్ప్ చతిస్గడ్ నారాయణపూర్ జిల్లా అంభూజ్ మాడ్ అడవుల్లో కేంద్ర మిల్ట్రీ బలగాలు చేసిన ఎన్కౌంటర్లో మృతి చెందిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం చర్చనీయంగా మారింది.. అయితే కడారి సత్యనారాయణరెడ్డి సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాల్ రావు పల్లిలో పుట్టారు. ఎల్లారెడ్డిపేటలో పదవ తరగతి వరకు చదివి పెద్ద చదువు కోసం సత్యనారాయణ రెడ్డి పెద్ద పల్లికి చేరారు 1974 చివర ఎమర్జెన్సీ లోనే పిడిఎస్యు విద్యార్థి సంఘం నుంచి రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడు అయ్యాడు.పశ్చిమ బెంగాల్లో ఎన్కౌంటర్లో మృతి చెందిన పెద్దపల్లి వాస్తవ్యులు మల్ల వజుల కోటేశ్వరరావు అలియాస్ ప్రహ్లాద్ పెద్దపల్లి తొలి సెంట్రల్ ఆర్గనైజర్ 1982లో ఖిలవనపర్తి ఎన్కౌంటర్లో చనిపోయిన బయ్యపు దేవేందర్ రెడ్డి కలసి ఉద్యమ బాట పట్టారు.ప్రస్తుతానికి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ లో ఉన్న నేతలంతా పెద్దపల్లి ప్రభుత్వ హైస్కూల్ ఐటిఐ వేదికలుగా 1975- 77 మధ్యకాలంలో రాడికల్ విద్యార్థి సంఘం( ఆర్ ఎస్ యు ) బ్యానర్ తో దున్నేవానికి భూమి నినాదంతో దొరల భూస్వాములకు వ్యతిరేకంగా పోరాట రూపాలను మల్లవజల కోటేశ్వరరావు ఇతర నేతలు ప్రజల్లోకి తెచ్చారు .మరోవైపు శాస్త్రీయ విద్యా విధానం నినాదంతో విద్యార్థులకు హాస్టల్లో వసతుల మెరుగు సౌకర్యాల కల్పన పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడు సౌకర్యాలు విద్యాబోధన స్కాలర్షిప్ పెంపు విద్యార్థి సమస్యలపై ఆర్ ఎస్ యు నాయకునిగా బాధ్యతలు చేపట్టి పెద్దపెల్లి ఐటిఐలో ఎలక్ట్రిషన్ గా చదువుతూనే సత్యనారాయణరెడ్డి ఆర్ ఎస్ యు నిర్మాణంలో రాడికల్స్ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు ఇదే సమయంలో జగిత్యాల జైత్రయాత్ర జనపోరు.. రాగినేడు.. పాలితం.. ఈసాల తక్కల్ల పెల్లి దొరల గడీలపై రాడికల్స్ రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో రాడికల్స్ వార్ నేతలు మల్ల వజుల కోటేశ్వరరావు ,బయ్యపు దేవేందర్ రెడ్డి సారథ్యంలో జరిగిన దాడులు దొరల దొరతనం మెడలు వంచిన పోరు పీపుల్స్ వార్ ఆవిర్భావం రైతు కూలీ రాడికల్ యువజన సంఘాల నిర్మాణ పునాదులు పడ్డాయి. ఈ పోరాటాలలో కడారి సత్యనారాయణరెడ్డి బాధ్యతల భాగస్వామిగా మారాడు. పెద్దపెల్లి ఐటిఐ పూర్తి అయిన వెంటనే ఆనాటి రామగుండం నేటి పాలకుర్తి మండలం కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం రావడం ఉద్యోగం చేస్తూనే రాడికల్స్ ఉద్యమాల పునాదులకు బలాన్ని చేకూర్చారు. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ ఐ ఎన్ టి యు సి లీడర్ పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షులు హషనోద్దీన్ ఫ్యాక్టరీ యజమాన్యానికి తొత్తుగా మారాడని కార్మికుల హక్కులను కాల రాయడంతో పాటు హక్కుల కోసం అడిగే కార్మికులను రాడికల్స్ ముద్ర వేసి పోలీసులచే చిత్రహింసల గురి చేస్తున్నాడని ఆరోపణలను అప్పటి వారు రాడికల్స్ ప్రకటించింది. హసనోద్దీన్ తన పద్ధతి మార్చుకోలేదని వార్ 1979 చివర బసంత నగర్ కేశోరాం ఫ్యాక్టరీ కాలనీ లో వార్ సాయుధ దళం హసనోద్దీన్ లీడర్ను తుపాకులతో కాల్చి చంపారు. ఈ హత్య కేసులో మల్లవజల కోటేశ్వరరావు బయ్యపు దేవేందర్ రెడ్డి మరికొందరి నేతలతో పాటు కడారి సత్యనారాయణ రెడ్డి పేరును సైతం పోలీసులు చేర్చడంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1979 డిసెంబర్ నెల చివరలో కుక్కల గూడూర్ గ్రామంలో ఎమర్జెన్సీలో ఆనాటి ప్రభుత్వం నక్సల్స్ ఉద్యమ నేతలుగా గుర్తించబడ్డ భూమయ్య, కృష్ణ గౌడ్ లను ఉరి తీయడం వారి జ్ఞాపకార్థం భూమయ్య కృష్ణ గౌడ్ లతోపాటు కంది లచ్చిరెడ్డి పోశెట్టి లక్ష్మీరాజ్యం కుమారస్వామి తదితర అమరుల పేరిట స్థూపాన్ని నిర్మించడం జరిగింది. ఆ స్థూపావిష్కరణ పదివేల మందితో నిర్వహించిన సభప్రస్తుత కేంద్ర రాష్ట్ర మావోయిస్టు నేతలు అక్కడే ఉండగా ఆనాటి సభకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నేతలను తీసుకొచ్చే బాధ్యతలను కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోస తీసుకొని ఆనాటి సభ విజయవంతం కోసం శ్రమించిన తీరు ఆ సందర్భంలో పనిచేసిన నేతలందరికీ ఎప్పుడూ మదిలో మెదులుతూనే ఉంటాయి. అనంతరం దొరలపై సాగుతున్న రైతు కూలీ పోరులో భాగంగా కుక్కల గూడూరు ముంజంపల్లి పుట్నూరు జయ్యారం వేమునూరు కూనారం మంగపేట రానాపూర్ కన్నాల తదితర గ్రామాలలో దొరల ఆధీనంలో ఉన్న బంచరాయి పరంబోగు సీలింగ్ పేదల నుంచి గుంజుకున్న భూములలో వందలాద ఎడ్ల నాగళ్లతో ఎర్రజెండాలు పాతి రైతులు ఉప్పెనలా కదిలిన దండులో ముందున్నాడు సత్యనారాయణ రెడ్డి రహస్య జీవితంలో ఉన్నప్పటికీ జనపోరు బిడ్డగా తిరిగారు కుక్కల గూడూర్ పుట్నూరు దొరలు పెత్తందారులపై సాగుతున్న పోరు అక్కడి దొరలు పెత్తందారులు సంఘం నాయకులపై తిరగబడటంతో రైతు కూలీ రాడికల్స్ వారి ఇండ్లపై దండుగా కదిలిన సమయంలో కడారి సత్యనారాయణ రెడ్డి భయ్యపు దేవేందర్ రెడ్డి కనుసనలలో చేతిలో బరిసె పట్టి రైతు కూలీల దండుకు ముందుండి పోరు పిడికిలి చూపించారు. అప్పటికే రైతు కూలి జనం భయ్యపుదేవేందర్ రెడ్డి నేతృత్వంలో రాడికల్స్ పోరాటాలలో రాటు తేలుతున్న సమయంలో యువకుడు సత్యనారాయణ రెడ్డి కుక్కల గూడూర్ కేంద్రంగా సాగిన ఆనాటిపోరులో అడుగులు కదపడం ఇక్కడి పోరాటాలకు సత్యనారాయణ రెడ్డికి మరువలేని మర్చిపోలేని అనుబంధ జ్ఞాపకాలు రగల్ జెండా పోరు లో మెదులుతూనే ఉంటాయి. విద్యార్థి దశ నుంచి రాడికల్ నేతగా రైతుకూలీ పోరాటాల భరిసెగా కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ లో కార్మికులను మేల్కొల్పే సైరన్ గా కడారి సత్యనారాయణరెడ్డి నాగేటి చాళ్లల్లో రగులుతున్న రగల్ జెండా పోరులో మిగిలి ఉంటాడు.. సత్యనారాయణ రెడ్డి ఎన్కౌంటర్లో మృతి చెందారనేవార్తలు మీడియాలో రావడంతో ఆనాడు ఆయనతో అనుబంధం ఉన్న ఉద్యమకారులు ప్రజలు రైతు కూలీలు టీవీలలో దినపత్రికలలో వస్తున్న ఫోటోలు చూసి.. ఆనాటి పోరాట అనుబంధం జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మనసులోనే అమరుడు సత్యనారాయణరెడ్డి అంటూ జోహార్లు పలికారు,బరువెక్కినగుండెలతో నివాళి పలుకుతున్నారు.బస్తర్ తొలి గోపన్న పార్టీలో చివరి అభయ్ గా ఆయన నిలిచారు




హైదరాబాద్, సెప్టెంబర్ 24: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరును మార్చాలని నిర్ణయించారు తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మారుస్తూ స్టాండింగ్ కమిట తీర్మానం చేసింది. మరోవైపు ఫ్లై ఓవర్ కోసం ఆర్చ్‌ను చేస్తోంది జీహెచ్ఎంసీ. బ్రిడ్జికి ఇరువైపులా ఆర్చ్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయం వద్ద తీవ్రమై ట్రాఫిక్ సమస్య ఉండేది. దీనిని నియంత్రించేందుకు 1997 లో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సచివాలయం నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వరకు నిర్మించిన ఈ బ్రిడ్జ్‌ని 2005లో ప్రారంభించారు. దీనికి తెలుగు తల్లి ఫ్లై ఓవర్ అని నామకరణం చేశారు. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌ను తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. ఇదిలాఉంటే.. మేయర్ విజయ లక్ష్మి అధ్యక్షత బుధవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 14 ఎజెండా అంశ్నా, 10 టేబుల్ ఐటమ్స్‌కు స్టాండింగ్ కమిటీ ఆమెదం తెలిపింది. ఈ అంశాల్లో తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరు మార్పు కూడా ఉంది.




హైదరాబాద్: గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారం లో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని విమర్శించారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు.




## తెలంగాణలో ఈ నెల 30 వరకు భారీ వర్ష సూచన

హైదరాబాద్: అల్ప పీడనాల ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 30వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం 12 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది.. గురువారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది ఈనెల 26 నాటికి వాయుగుండంగా మారనుందని వాతావరణకేంద్రం వెల్లడించింది. తదుపరి ఈ వాయుగుండం దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో ఈనెల 27న తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం భారి నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇవాళ మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.




తిరుమల : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీ సమేతం తిరుమలకు చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు ఆయనకు దివ్య ఆశీస్సులు అనుగ్రహించారు. తొలుత తిరుమలకు చేరుకున్న చంద్రబాబు కుటుంబానికి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సాదర స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు సతీమని భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేష్‌తో కలిసి బేడీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడ పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి వెళ్ళి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య సీట్లలో భారీ పెంపునకు ఇవాళ (బుధవారం) కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. 5,023 ఎంబీబీఎస్ సీట్లను పెంచడానికి, ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడ్ కోసం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ విస్తరణకు ఆమోదం తెలిపింది కేంద్ర కేబినెట్. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితంగా దేశంలో వైద్య విద్య సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేందుకు వీలవుతుంది. సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ 3వ దశ కింద ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడేషన్ ద్వారా 5,000 కొత్త పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు, 5,023 ఎంబీబీఎస్ సీట్లు పెంచేందుకు ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు 1,18,190కి, పీజీ సీట్లు 74,306కి చేరుకుంటాయి. మొత్తం రూ.15,034.50 కోట్ల బడ్జెట్ (2025–26 నుంచి 2028–29 వరకు)తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు కాగా.. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లు. ఈ విస్తరణ వైద్యులు, స్పెషలిస్టుల సంఖ్యను పెంచి గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థులకు మరిన్ని వైద్య వృత్తి అవకాశాలు, ఉద్యోగాలు (వైద్యులు, ఫ్యాకల్టీ, పారామెడికల్ సిబ్బంది) సృష్టించడంతోపాటు భారతదేశాన్ని సరసమైన ఆరోగ్య సేవల గ్లోబల్ హబ్‌గా మార్చుతుంది. ఇప్పటికే దేశంలో 808 మెడికల్ కళాశాలలో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నప్పటికీ, డిమాండ్‌కు తగ్గట్టు సామర్థ్యం పెంచడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మార్పుల అమలుకు మార్గదర్శకాలు వెంటనే జారీ చేస్తుంది. ఈ నిర్ణయం యూనివర్సల్ హెల్త్ కవరేజ్ లక్ష్యాన్ని సాకారం చేస్తూ, దేశ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందని నిపుణులు అంటున్నారు.




## గ్రూప్-1 అంశంలో టీజీపీఎస్సీకి ఊరట.. సింగిల్ బెంచ్ తీర్పుపై హైకోర్టు స్టే

హైదరాబాద్: గ్రూప్-1 అంశంలో టీజీపీఎస్సీ హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. గ్రూప్-1 నియామకాలు చేపట్టుకోవచ్చని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చేనెల 16కి వాయిదా వేసింది. గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించింది. మెయిన్స్ జవాబు పత్రాలను 8 నెలల్లో పునఃమూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. దీనిపై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. “తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. మెయిన్స్ పత్రాలను పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 8 నెలల్లోపు చేయకపోతే మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. 2011లో గ్రూప్-1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీంకోర్టు రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవు” అని కోర్టుకు ఏజీ తెలిపారు. దీనిపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ స్పందిస్తూ మాల్ ప్రాక్టీస్, పేపర్ లీక్‌లాంటి ఘటనలు ఏమైనా చోటుచేసుకున్నాయా? పక్షపాతం చూపించారనడానికి ఏమైనా ఆధారాలున్నాయా?అని ఏజీని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఏపీలో నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో తెలుగులో రాసిన అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారని చెప్పారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పురుషులకు వాష్‌రూమ్‌లు లేవని.. అందుకే ఆ రెండు కేంద్రాల్లో మహిళలకు మాత్రమే కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు సమీపంలోని కేంద్రాలు కేటాయించామన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడాన్ని సైతం తప్పుబట్టారని ఏజీ తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో టీజీపీఎస్సీకి అధికారం ఉంటుందని.. పరీక్ష కేంద్రాల కేటాయింపును తప్పుబట్టలేమని సీజే అన్నారు. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ డివిజన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని సీజే జస్టిస్ ఏకే సింగ్ స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ స్టే విధించడంతో గ్రూప్-1 ర్యాంకర్లకు ఊరట లభించింది.




ఖమ్మం (చర్ల): ఛత్తీస్‌గఢ్ లో బుధవారం 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ వద్ద లొంగిపోయిన మావోయిస్టులలో 50మంది పురుషులు, 21మంది మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 30 మందిపై రూ.64లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. మావోయిస్టుల ఏరివేతను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేస్తుండడంతో లొంగిపోవడం తప్ప వారికి మరో మార్గం లేదన్నారు. వీరంతా గతంలో అనేక విధ్వంసక సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు బస్తర్ ఐజీ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని స్థానిక అధికారులు పేర్కొన్నారు. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే తమ ఉద్దేశమని.. జనజీవన స్రవంతిలో కలిసే వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘ఆపరేషన్ కగార్’తో మావోయిస్టుల వైపు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 24: బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కేటాయిస్తూ ప్రభుత్వం తెస్తున్న జీవోపై హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సరికాదని పిల్ దాఖలవగా... ఈరోజు (బుధవారం) హైకోర్టులో విచారణ జరిగింది. ఈ క్రమంలో పిటిషనర్లపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో కథనాల ఆధారంగా పిల్ ఎలా వేస్తారని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పత్రికల్లో వచ్చిన వార్తలను పరిగణలోకి తీసుకోలేమని స్పష్టం చేస్తూ.. రిజర్వేషన్ల అంశంపై దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వుల జారీ చేసింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఆదేశాలు ఇవ్వాలని, 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకోవాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

రిజర్వేషన్లు 50 శాతానికి మించితే స్థానిక సంస్థల్లో ఇతర వర్గాలకు అన్యాయం జరుగుతుందని పిటిషనర్లు పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇస్తే 50 శాతం దాటుతుందని.. సుప్రీంకోర్టు తీర్పు, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 50 శాతం మించకూడదని పిటిషన్లు వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆ రెండు పిటిషన్లను కొట్టివేసింది.




హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు భాజపాకు పట్టంకట్టేలా నేతలు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కోరారు. గ్రామగ్రామానికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. “నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌ను వదిలి గ్రామాల్లోకి వెళ్లాలి. ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ తీసుకొచ్చిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలి. స్థానిక ఎన్నికల్లో భాజపా మెజారిటీ స్థానాలు సాధిస్తుందనే నమ్మకముంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించబోతున్నాం. ఎవరు అడ్డుపడినా.. ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో వచ్చేది భాజపా ప్రభుత్వమే. కాషాయ జెండా ఎగరవేయడం తథ్యం. పదవులు పొందడం కాదు.. వాటిని బాధ్యతగా నిర్వహించాలి. కార్యకర్తగా 40 ఏళ్లు భాజపాలో కొనసాగినందుకు సంతోషంగా ఉంది. భాజపా నిర్విరామ కృషి వల్లే తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. భారత రాష్ట్ర సమితి పాలనలో 10 ఏళ్లు కేసీఆర్ మాటలతో తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్‌లను అమలు చేసే పరిస్థితులు లేవు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయి. కేవలం 600 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో ఇచ్చి స్థానిక ఎన్నికలకు వెళ్లాలి. జీఎస్టీ తగ్గింపును దేశప్రజలు స్వాగతిస్తున్నారు.

దీని వల్ల అన్ని సామాజికవర్గాలు లబ్ధి పొందుతాయి. జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. ఖరీఫ్ సీజన్ పూర్తి అయ్యే లోపు రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందుతుంది. రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్ దందా జరుగుతోంది. దీన్ని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. తెలంగాణ ప్రజలు మార్పు కోరుతున్నారు.. డబుల్ ఇంజిన్ సర్కార్ కోసం ఎదురు చూస్తున్నారు” అని రామచందర్‌రావు అన్నారు.




## బెట్టింగ్ యాప్స్ కేసు.. మూడు రాష్ట్రాల్లో తెలంగాణ సీఐడీ సోదాలు

హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ కేసులో తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్ చేపట్టింది. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసింది. వీరంతా 6 బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తాజ్ 007, ఫెయిర్‌ప్లే లైవ్, ఆంధ్ర 365, వీఎల్ బుక్, తెలుగు 365, యస్ 365 బెట్టింగ్ యాప్‌లను ఈ ముఠా నిర్వహిస్తోంది.

## సామాజిక తెలంగాణ కోసం కలిసి పని చేద్దాం: కవిత



హైదరాబాద్: రాష్ట్ర సాధన కోసం అందరం కలిసి పనిచేసి విజయం సాధించామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తదుపరి లక్ష్యం సామాజిక తెలంగాణ కోసం పని చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. “ఆత్మ గౌరవంతో కూడిన తెలంగాణ కోసం పనిచేద్దాం. పునరేకీకరణ కోసం కలిసి పోరాటం చేయాలి. రాష్ట్రంలో పేదల వైపు ఉండి పోరాడుతాం. సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన వారిని ఆహ్వానిస్తున్నా. జాగృతిలో ఇప్పటికే ఉన్న నాయకత్వంతో పాటు.. చేరుతున్న కొత్త వారికి సముచిత స్థానం కల్పిస్తాం. కుత్బుల్లాపూర్‌లో హైడ్రా బాధితులైన పేదల పక్షాన పోరాటం చేస్తాం. భవిష్యత్తులోనూ పేద ప్రజల కోసం పోరాటాలు కొనసాగిస్తాం” అని కవిత తెలిపారు.

## బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదు: శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లు గురించి దిల్లీ పెద్దలను సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ అడగలేదని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు మొదట చట్ట సవరణ అన్నారని.. తర్వాత ఆర్డినెన్స్.. ఇప్పుడు జీవో అంటున్నారన్నారు. బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు అడగకపోయినా.. కాంగ్రెస్ పార్టీయే హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుపై ఆ పార్టీ మోసం చేస్తోందని దుయ్యబట్టారు. “ఈ అంశం విద్య, ఉద్యోగాల్లో లక్షల మంది జీవితాలతో ముడిపడి ఉంది.

జీవో ఇచ్చి కేవలం రాజకీయ పదవులకే సరిపెడితే ఊరుకునేది లేదు. రాజకీయ పదవుల్లోనూ బీసీలకు పూర్తి న్యాయం చేయలేదు. బిల్లు ఆమోదం కోసం దిల్లీలో ధర్నాలు చేశారు. కానీ.. ఎవరినీ అడగలేదు. విజయోత్సవ సభ పెడుతున్నామని ఎందుకు వెనక్కి తగ్గారు?” అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

## రేవంత్‌రెడ్డికి తెలంగాణ కంటే.. పొరుగు రాష్ట్ర ప్రయోజనాలే ఎక్కువా?: హరీశ్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ తీరు.. హంతకుడే సంతాపసభ పెట్టినట్లు ఉందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాల వాటాపై సీఎం రేవంత్‌రెడ్డిది ఒక మాట.. మంత్రి ఉత్తమ్‌ది మరో మాట అని ఎద్దేవా చేశారు. “అవగాహన లేని సీఎం, నీళ్ల మంత్రి ఉండటం మన దౌర్భాగ్యం. సమ్మక్క సాగర్ పూర్తి చేసింది భారత రాష్ట్ర సమితి.. ప్రచారం చేసుకుంటున్నది కాంగ్రెస్. ఏపీ సీఎం చంద్రబాబుకు భయపడి బనకచర్లపై మౌనం వహించారు. కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న ఆల్మట్టి ఎత్తు పెంపుపైనా మౌనం వహిస్తున్నారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రయోజనాల కంటే, పొరుగు రాష్ట్ర ప్రయోజనాలే ఎక్కువా?” అని హరీశ్‌రావు ప్రశ్నించారు.



## బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు.. తిరుమలలో వైభవంగా ధ్వజారోహణం

తిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. ఇవాళ సాయంత్రం మీనలగ్నంలో ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ నిర్వహించిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్దశేష వాహన సేవతో బ్రహ్మోత్సవాల వాహన సేవలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏర్పాటు చేసిన తొలి ధర్మకర్తల మండలి హయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు తితిదే సిద్ధమైంది.

# తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు ఉన్నవ

## - సెప్టెంబర్ 25... ఉన్నవ లక్ష్మీనారాయణ వర్ధంతి




గాంధేయ వాదిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కులవ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, మాలపల్లి అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, సహ పంక్తి భోజనాలు నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో 1877 డిసెంబరు 4వ తేదీన శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించి, ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగించాడు. 1897లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాడు. 1906లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో శిక్షణ పొందాడు. 1916లో బర్లాండ్, డబ్లిన్ ?లలో బారిష్టర్ చదువు సాధించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా విశేషమైన కీర్తి పొంది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. 1900 లో గుంటూరులో ‘‘యంగ్?మెన్స్ లిటరరీ అసోసియేషన్?’’ను స్థాపించాడు. 1902లో అక్కడే వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయాన్ని 1906 లోను, పూనాలోని కార్వే మహిళా విద్యాలయాన్ని, 1912 లోను సందర్శించి అనుభవాలను లక్ష్యానికి జోడించారు. 1913 లో జొన్నవిత్తుల గురునాథంతో కలసి విశాలాంధ్ర పటం తయారు చేశాడు. లక్ష్మీనారాయణ 1900లో గుంటూరులో ఉపాధ్యాయ వృత్తి, 1903లో అక్కడే న్యాయవాద వృత్తిని, 1908లో ర్యాలీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్శివిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే.1917 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. 1922లో గుంటూరులో శారదానికేతన్?ను స్థాపించి బాలికలకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించాడు. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావరణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాన్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్గ, వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్లకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించింది, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్యగ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలా చారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమగీతం, సమతాధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వరరావు పీఠిక వ్రాస్తూ, “ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమకూర్చాయి” అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. మాలపల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. ఇక 1923 లో కాంగ్రెసు స్వరాజ్య పార్టీలో చేరాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఎన్నికై, పల్నాడు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1931లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినందుకు జైలు శిక్ష అనుభవించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ 1958 సెప్టెంబరు 25 న మరణించాడు. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# బ్రిటిష్ ఇండియాలో తొలి తరం వైద్యురాలు రుక్మాబాయి రావత్

## సెప్టెంబర్ 25..రుక్మాబాయి రావత్ వర్ధంతి

రుక్మాబాయి రావత్ (నవంబర్ 22, 1864 – సెప్టెంబర్ 25, 1955) బ్రిటీష్ ఇండియాలో తొలి మహిళా వైద్యులలో ఒకరు. కాదంబినీ గంగూలీ, ఆనందీబాయి జోషిలు 1886లో వైద్యశాస్త్రంలో డిగ్రీ పొందిన తొలి భారతీయ మహిళలు కాగా కాదంబినీ గంగూలీ మాత్రం ప్రాక్టీసు చేపట్టింది. తద్వారా రుక్మాబాయి వైద్యవృత్తిని అవలంబించిన రెండవ మహిళగా పేరు పొందింది. చారిత్రాత్మకమైన “ఏజ్ ఆఫ్ కన్సెంట్ చట్టం 1891” ఏర్పడటానికి రుక్మాబాయి ముఖ్య కారణం. రుక్మాబాయి మహారాష్ట్రకు చెందిన ఒక వడ్రంగి కుటుంబంలో జనార్ధన్ పాండురంగ్, జయంతిబాయి దంపతులకు జన్మించింది. రుక్మా బాయికి ఎనిమిదేళ్ల వయసులో తండ్రి మరణించాడు. జయంతి బాయి తన ఆస్తినంతటిని రుక్మాబాయి పేరుమీదకు మార్పించింది. ఆమెకు 11 యేళ్ల వయసులో తల్లి ఆమెను 19 యేళ్ల దాదాజి భికాజీకి ఇచ్చి వివాహం జరిపించింది. జయంతి బాయి డా.సఖారాం అర్జున్ ను వివాహం చేసుకుంది. కానీ రుక్మాబాయి వారితో పాటు జీవిస్తూ ఫ్రీ మిషన్ చర్చ్ లైబ్రరీ పుస్తకాలను చదువుతూ విద్యను గడించింది. రుక్మాబాయి, ఆమె తల్లి ప్రార్థనా సమాజం, ఆర్య మహిళా సమాజం సభలకు వారం వారం హాజరయ్యే వారు. దాదాజి తల్లి మరణించిన తర్వాత అతడు తన మేనమామ వద్ద పెరిగాడు. అక్కడ వాతావరణం కారణంగా దాదాజీ సోమరి పోతుగా, దుర్మార్గుడిగా తయారయ్యాడు. రుక్మాబాయి తన 12వ యేట తన భర్త దాదాజీ వద్దకు వెళ్లడానికి తిరస్కరించింది. ఆమె పెంపుడు తండ్రి డా.సఖారాం అర్జున్ ఆమె నిర్ణయానికి మద్దతుగా నిలిచాడు. దానితో దాదాజీ కోర్టును ఆశ్రయించాడు. పేనీ, గిల్బర్ట్, సయానీ మొదలైన వకీళ్ల ద్వారా రుక్మాబాయి దాదాజీతో కలిసి జీవించక పోవడానికి కల కారణాలను కోర్టుకు తెలిపింది. “వివాహ హక్కుల పూర్వస్థితి” ని కోరుతూ కోర్టులో దాదాజీ భికాజీ వేసిన భికాజి వర్సస్ రుక్మాబాయి కేసుపై 1885లో రాబర్ట్ హిల్ పిన్హే అనే న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ వివాహ హక్కులపై పూర్వపు ఇంగ్లీషు తీర్పులు అక్కడ వర్తించవని, అవి పరిణతి చెందిన వయోజనులకు మాత్రమే ఉద్దేశించినవని, ప్రస్తుత కేసులో రుక్మాబాయికి నిస్సహాయ స్థితిలో బాల్యంలో వివాహం అయ్యిందనీ, ఇటువంటి కేసులపై ఇంతకు ముందు హిందూ చట్టాలలో తీర్పు వెలువడ లేదని పేర్కొంటూ కేసును కొట్టివేశాడు. 1886లో ఈ కేసు పునర్విచారణకు వచ్చినప్పుడు జె.డి.ఇన్వెరారిటి, తెలాంగ్ మొదలైన లాయర్లు రుక్మాబాయి పక్షాన వాదించారు. ఈ కేసుపై సమాజంలో రుక్మాబాయిని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ అనేక చర్చలు జరిగాయి. కొందరు హిందువులు చట్టం హిందూ ఆచార వ్యవహారాలను గౌరవించడం లేదని ఆందోళనకు దిగారు. పిన్హే తీర్పుపై నేటివ్ ఒపీనియన్, మరాఠా అనే పత్రికలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తపరుస్తూ దాదాజీ పక్షాన నిలిచాయి. ఈ సమయంలోనే టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఒక భారతీయ మహిళ అనే కలం పేరుతో వరుసగా రుక్మాబాయి వ్రాసిన వ్యాసాలు ప్రజలలో కదలికను తెచ్చింది. ఈ కేసులో 1887, మార్చి 4వ తేదీన జస్టీస్ ఫరాన్ తీర్పు చెబుతూ రుక్మా బాయిని భర్తతో కలిసి ఉండాలని లేదా 6 నెలలు కారాగారంలో ఉండాలని ఆదేశించాడు. రుక్మాబాయి ధైర్యంగా ఈ తీర్పును అంగీకరించే కంటే



గరిష్టంగా శిక్షను అనుభవించ డానికి సిద్ధంగా ఉన్నానని బదులు ఇచ్చింది. బాలగంగాధర్ తిలక్ తన “కేసరి” పత్రికలో రుక్మాబాయి తిరుగుబాటు ఇంగ్లీషు చదువుల ప్రభావమని పేర్కొన్నాడు. హిందూ మతం ప్రమాదంలో పడి పోయిందని వ్యాఖ్యానించాడు. మాక్స్ ముల్లర్ ఈ విషయంలో తన అభిప్రాయం చెప్తూ ఈ సమస్యకు న్యాయ పరమైన తీర్పులు సమాధానం కాజాలవని, రుక్మాబాయి విద్యాబుద్ధులే ఆమెను ఆమె కోరిన రీతిలో తీర్పు చెప్పే న్యాయాధి కారిగా మారుస్తుందని అభిప్రాయ పడ్డాడు. 1888లో దాదాజీతో 2000 రూపాయలు చెల్లించి తెగతెంపులు చేసుకునే విధంగా అంగీకారం కుదిరింది. ఆ తరువాత రుక్మాబాయి ఇంగ్లాండులో చదువు కోవడానికి బయలు దేరింది. కామా హాస్పెటల్‌కు చెందిన డా.ఎడిత్ పెచె రుక్మాబాయిని చదువు కోవడానికి ప్రోత్సహించాడు. కావలసిన ధనాన్ని సమకూర్చాడు. ఆమె 1889లో ఇంగ్లాండు వెళ్లి అక్కడి “లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమెన్”లో విద్యనభ్యసించింది. అక్కడ ఆమె చదువుకు పలువురు ఆర్థికంగా అండగా నిలిచారు.1918లో ఆమె వుమెన్స్ మెడికల్ సర్వీస్‌లో చేరే అవకాశాన్ని తిరస్కరించి రాజ్‌కోట్ లోని స్టేట్ హాస్పిటల్ ఫర్ వుమెన్‌లో చేరింది. ఆమె ముఖ్య వైద్య అధికారిణిగా 35 సంవత్సరాలు పని చేసి బొంబాయిలో 1930లో పదవీ విరమణ చేసింది. తరువాత కూడా ఆమె సంఘ సంస్కరణలను కొనసాగించింది. “పరదా, దాని నిషేధానికి ఆవశ్యకత” అనే కరపత్రాన్ని ప్రచురించింది. 2016లో ఆమె జీవితచరిత్ర ఆధారంగా “రుక్మాబాయి భీమరావ్ రావత్” అనే మరాఠీ సినిమా వెలువడింది. అనంత్ మహదేవన్ ఆ సినిమా దర్శకుడు కాగా తనిషా చటర్జీ ముఖ్య భూమికను నిర్వహించింది.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# ఏకాత్మతా మానవవాద సిద్ధాంత కర్త దీన్ దయాళ్

## సెప్టెంబర్ 25... దీన్ దయాళ్ ఉపాధ్యాయ జన్మదినం



కొందరు మరణించేవరకు జీవిస్తారు, కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారు. రెండవ కోవకు చెందిన వారు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ. అతి సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య వ్యక్తిగా ఎదిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తర ప్రదేశ్ లోని మధుర దగ్గర ‘నగ్ల చంద్రభాన్’ అనే గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి, తండ్రి మరణించిన దీనదయాళ్ జీ మేనమామ ఇంటిలో పెరిగారు. 1925 ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టిన దయాళ్ కాన్పూర్‌లో బి.ఎ, చదువు తున్నప్పుడు ఆర్ఎస్ఎస్‌తో పరిచయం ఏర్పడింది.1937లో మొదటి కొద్దిమంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారు. అప్పటి నుండి ఆయన జీవిత విధానం, గమ్యం మారిపోయింది. సంఘ్‌లో పనిచేస్తూనే బి.ఎ, డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ ఎం.ఎ, ప్రథమ సంవత్సరం పూర్తిచేశారు. సంఘ్ విస్తరణకు పూర్తి సమయం ఇచ్చేందుకు చదువుకు స్వస్తి పలికారు. ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ప్రాంతానికి ప్రచారకులుగా నియుక్తులైన కొద్ది సంవత్సరాల లోనే ఆ ప్రాంతంలో సంఘ్ కార్యక్రమాలను వికసింప జేశారు. అది గమనించిన సంఘ్ పెద్దలు వారిని ఉత్తరప్రదేశ్ ప్రాంత సహ ప్రచారకులుగా నియమించారు. ఆయన అసామాన్యమైన ప్రతిభా పాటవాలు అందరినీ ఆకట్టు కున్నాయి. సంఘ్ కార్యక్రమాలు చూస్తూనే పత్రికారంగంపై దృష్టి సారించి రాష్ట్ర ధర్మ ప్రకాశన్ అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఆ ప్రకాశన్ ద్వారా “రాష్ట్ర ధర్మ”, అనే ఒక మాస పత్రిక, “పాంచజన్య” అనే వారపత్రిక, “స్వదేశ్” అనే దిన పత్రిక ప్రారంభించారు. ఆ పత్రికలు దీనదయాళ్ జీ కార్యదీక్షకు ప్రతీకలుగా నిలిచాయి. 1952లో భారతీయ జన సంఘ్ లో చేరి ఉపాధ్యక్షులుగా నియమితుడైనారు. 1967లో జన సంఘ్ అధ్యక్ష పదవి చేపట్టేవరకు ఆ పదవిలో కొన సాగారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణించాక, పార్టీ బాధ్యతలు భుజాన వేసుకొని విజయ పథంలో నడిపించారు. అలాగే ఆర్.ఎస్.ఎస్ వారపత్రిక పాంచజన్య, లక్నో దినపత్రిక ‘స్వదేశ్’లకు సంపాదకులుగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతానికి పునాదిగా చెప్పబడే ఏకాత్మతా మానవతా వాదం, శంకరాచార్య జీవిత చరిత్ర వంటి పుస్తకాలు, హిందీలో ‘చంద్రగుప్త మౌర్య’ నాటకం, మరాఠీ నుండి ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులు డా. హెడ్గేవార్ జీవిత చరిత్ర అనువాదం వంటి పలు రచనలు చేశారు. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు ఉన్నాయని వివరించే క్రమంలో “ఏకాత్మతా మానవతా వాదం” అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించారు. గాంధీజీని కాల్చి చంపిన నేరాన్ని హిందూ మహాసభతో పాటు ఆర్ఎస్ఎస్ పై కూడా మోపిన నేపథ్యంలో, ఆనాటి ప్రధాని నెహ్రూజీ సంఘ్‌ను నిషేధించారు. ఆ నిషేధాన్ని తొలగించాలంటూ జరిగిన ఉద్యమానికి ఉత్తర ప్రదేశ్‌లో దీనదయాళ్ జీ నిర్వహించిన పాత్ర గణనీయమైంది. ఈ హత్యానేరంలో సంఘ్ పాత్ర లేదని దీనదయాళ్ జీ పాంచజన్యలో స్పష్టం చేస్తూ ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా రాసిన రాతలకు ఆనాటి ప్రభుత్వం పాంచజన్యను నిషేధించింది. దానికి బదులుగా “హిమాలయ” అనే మరో వార పత్రికను ప్రారంభించి తన కలంతో నాటి ప్రభుత్వానికి కలవరం పుట్టించారు. ఈలోగా గాంధీజీ హత్యా నేరంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జాతి, జాతీయత, భారతీయ సంస్కృతి, ధర్మం మొదలైన విషయాలపై ఆయనలోని అభిప్రాయాలు, మౌలిక సిద్ధాంతాలు తదితరాలపై ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలు, భారతీయ తత్వజ్ఞాన సారాన్ని దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి సామ్రాట్, చంద్రగుప్త, జగద్గురు శంకరాచార్య అనే చారిత్రక నవలలను కూడా దయాళ్‌జీ రాశారు. 1951లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రధాని నెహ్రూ విధానాలకు నిరసనగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి వచ్చారు. ఆనాడు దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి నెహ్రూ అనుసరిస్తున్న, ముస్లిం సంతుష్టీ కరణ, హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడానికి, భారతీయ సంస్కృతి సభ్యులతో, జాతీయ భావాలతో కూడుకున్న రాజకీయ పార్టీని స్థాపించాలనే ఉద్దేశంతో ఆనాటి ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ గురూజీ సహాయాన్ని అర్థించారు. ఆయన కోరిక ప్రకారంగా పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ జీ, జగన్నాథరావు జీ, సుందర్ సింగ్ భాండారి లాంటి మరి కొందరు యువకులను అప్పగించారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబరు 21న ఏర్పాటు చేసిన జనసంఘ్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా దీనదయాళ్ జీ ఎన్నికైనారు. పార్టీ స్థాపించిన మూడు మాసాలకే 1952లో జరిగిన జనరల్ ఎన్నికలలో పోటీ చేసిన నాలుగు జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటిగా జనసంఘ్ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందింది. తన ఉనికిని సాధారణ ఎన్నికలలో రుజువు చేసుకో గలిగింది. దీనికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నాయకత్వంతో పాటు దీనదయాళ్ జీ సమన్వయ కౌశలం కూడా తోడైంది. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మరణం తర్వాత జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ పార్టీని దేశ వ్యాప్తంగా పటిష్ఠ పరచిన ఘనత దీనదయాళ్‌జీకి ఆయన సహచరులకు దక్కుతుంది. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్నవారికి సవాలు విసురుతూ, ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించాడు. భారతీయ జనసంఘ్ అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం పనిచేసిన దీనదయాళ్‌జీ కార్యకర్తల హృదయాలను మలిచి వారి మనస్సులలో అతి స్థిర స్థానాన్ని చూరగొన్నారు. సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవిచూస్తూ దేశ సేవ నిమగ్నమై దానినే జీవన కార్యంగా స్వీకరించాడు. జనసంఘ్‌లో చేరినప్పటి నుంచి మహారథియై పార్టీకి సారథ్యం వహించి, దేశ రాజకీయాలలో జనసంఘ్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంలో కృతకృత్యులై 1967లో పార్టీ అఖిల భారత అధ్యక్షుడు కాగలిగారు. కాలికట్‌లో జరిగిన అఖిల భారత జనసంఘ్ మహాసభలో భారత దర్శనాన్ని ప్రదర్శింపచేసి విశేష కీర్తి నార్జించారు. ఆ కీర్తియే జనసంఘ్ సిద్ధాంత వ్యతిరేకుల కినుకకు కారణమైంది. రాజకీయాలకు చిత్త శుద్ధి గల నేత బలి అయినారు. ఉత్తర ప్రదేశ్‌లోని మొగల్ సరాయి రైల్వే స్టేషన్‌లో 1968 ఫిబ్రవరి 11న రైలు పట్టాల వద్ద శవమై కనిపించారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం మాదిరిగానే దీనదయాళ్‌జీ మరణం కూడా పలు అనుమానాలకు దారితీసింది. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# మాడ్ ఎన్కౌంటర్ ఓ కట్టుకథ

### మా సీసీ మెంబర్లను అరెస్ట్ చేసి హింసించారు - ముందే ద్రోహిపై అనుమానించాము

### డీఆర్జీ ఇన్ఫార్మర్ వల్లనే ఇద్దర్నీ కోల్పోయాం - దండకారణ్య కమిటీ ప్రతినిధి వికల్ప్

చురకలు ప్రత్యేక ప్రతినిధి మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, కట్టా రామచంద్ర రెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డి ఇద్దరూ అరెస్టు చేయబడి తరువాత హత్య చేయబడ్డారని దండాకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ హత్యలను తిరస్కరించాలనిసెప్టెంబర్ 22న నారాయణపూర్ జిల్లాలోని మాడ్ ప్రాంతంలో జరిగిన నకిలీ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలను త్యాగం చేసిన మా ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, కామ్రేడ్ కట్టా రామచంద్ర రెడ్డీ అలియాస్ రాజు దాదా, కామ్రేడ్ కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోసా దాదాలకు డి. కె, ఎస్ జడ్, సి నివాళులు అర్పిస్తుందని, సభ్యులు, మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ దాదా, సహదేవ్ సోరెన్, ఎస్, జడ్, సి సభ్యుడు కామ్రేడ్ పాండు, కామ్రేడ్ విజయ్, డి, వి, సి -స్థాయి కామ్రేడ్స్ లోకేష్, సుమిత్ర మరియు విమల మరియు ఈలోగా అమరులైన ఇతర సహచరులందరికీ ఎస్ జడ్ సి నివాళులు అర్పిస్తుందని పేర్కొన్నారు.ఈ ఎన్‌కౌంటర్ నకిలీదని, పోలీసు అధికారులు చెబుతున్న కథ కల్పితమని,నిజం వేరే ఉందని, ఈ ఇద్దరు సహచరులకు సి, సి వేర్వేరు బాధ్యతలు అప్పగించిందని, పది నెలల క్రితం, వారు తమ కొత్త బాధ్యతలను స్వీకరించడానికి వెళ్లిపోయారని, కామ్రేడ్స్ రాజు దాదా మరియు కోసా దాదాలను రాయ్పూర్ నగరంలో లేదా మరెక్కడైనా, ఒకే ప్రదేశం నుండి లేదా వేర్వేరు ప్రదేశాల నుండి నిరాయుధులుగా అరెస్టు చేశారని, సెప్టెంబర్ 11 మరియు 20 మధ్య వారి అరెస్టులు జరుగుతాయని భావిస్తున్నామని, వారు 10వ తేదీ వరకు సురక్షితంగా ఉన్నారని మాకు వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. మా సి, సి సహచరులకు వారి నుండి ఒక లేఖ అందిందని,వారి అరెస్టు తర్వాత, రహస్య పార్టీ సమాచారం కోసం వారిని హింసించి ఉండాలని చివరకు, వారిని 22వ తేదీన మాడ్ ప్రాంతానికి తీసుకువచ్చి హత్య చేశారని, ఈ హత్యలపై దర్యాప్తు చేయడానికి 21వ తేదీన మాడ్‌లో ఒక పెద్ద ఆపరేషన్ ప్రారంభించబడిందని, అది ఇప్పటికీ కొనసాగుతోందని పేర్కొన్నారు.ఈ సహచరులను అరెస్టు చేసిన తర్వాత, చట్టపరమైన చర్య తీసుకోవాలని, ఈ నకిలీ ఎన్‌కౌంటర్‌ను అందరూ వ్యతిరేకించాలని కోరారు. కామ్రేడ్ రాజు దాదా మరియు కామ్రేడ్ కోసా దాదా కుటుంబ సభ్యులు మరియు స్నేహితులకు మా ఎస్, జడ్, సి తన ప్రగాఢ సంతాపాన్ని మరియు విచారాన్ని తెలియజేస్తుందని, వివిధ రంగాలలో అపార అనుభవం ఉన్న ఈ సహచరులను కోల్పోవడం నిస్సందేహంగా భారతదేశ విప్లవ ఉద్యమానికి పూడ్చలేని నష్టం అని, కొనసాగుతున్న నష్టాల పట్ల మొత్తం విప్లవాత్మక శిబిరం తీవ్ర ఆందోళన చెందుతోందని, సహచరులు తమ ప్రాణాలను త్యాగం చేస్తున్న ఆశ మరియు నిరీక్షణను మనమందరం గుర్తుంచుకోవాలని మరియు వారి ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు.నిఘా విభాగం ఈ వ్యక్తులను ఎలా చేరుకుంది? మా వద్ద ఉన్న సమాచారం ఆధారంగా అవకాశాలను చర్చిస్తామని, మీడియాలో వ్యాపించే వివిధ నివేదికలను బట్టి, ఈ సమాచారం బలవంతంగా ఉందని,మొదట, కామ్రేడ్స్ రాజు దాదా మరియు కోసా దాదా కొంతకాలంగా గెరిల్లా దళాలతో అడవుల్లో లేరని,దీని గురించి తెలిసిన చాలా మంది పోలీసులకు లొంగిపోయి పోలీసు అధికారులకు సమాచారం అందించారని,లొంగిపోయిన వారిలో సాధారణ స్థాయి నుండి ఎస్, జడ్, సి సభ్యులు కూడా ఉన్నారని, రెండవది, ఈ వ్యక్తులను లోపలి నుండి సమన్వయం చేయడానికి ఎవరు బాధ్యత వహిస్తారో కూడా పోలీసు శాఖ తెలుసుకుందని, మూడవదిగా, ఈ వ్యక్తులు వెళ్లిపోయినప్పుడు భద్రతా బృందంలో భాగమైన ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు కూడా లొంగిపోయారని, ప్రస్తుతం డి, ఆర్, జి లో చురుకుగా పనిచేస్తున్నారని, లొంగిపోయిన డి ఆర్ జి అధికారి కామ్రేడ్ కోసా దాదాతో పాటు వచ్చిన కొరియర్ గురించి కూడా అధికారులకు చెప్పారని,ఇంకా, వారు పోలీసు బలగాలతో వచ్చి ఆగస్టు 13న అతని ఇంటి నుండి తీసుకెళ్లారని, (అతను రెండు లేదా మూడు నెలలు పనిచేశాడు, తరువాత ఇంట్లోనే ఉండాలని నిర్ణయించుకున్నాడుని) అతన్ని హింసించారని నివేదికలు ఉన్నాయని, అతన్ని ఎక్కడికి తీసుకెళ్లారో, ఎవరు అక్కడకు తీసుకెళ్లారో అతను వారికి చెప్పి ఉండవచ్చు అని దీని వల్ల ప్రధాన కొరియర్ పేరు బయటపడి ఉండవచ్చు అని నిఘా ఏజెంట్లు ఆ వైర్‌ను అడ్డగించి కొరియర్‌కు చేరుకుని ఉండవచ్చు అని ఇది ఖచ్చితంగా చెప్పలేమని పేర్కొన్నారు. ఆ కొరియర్‌ను పర్యవేక్షించడం ద్వారా, కామ్రేడ్‌రాజు దాదాను చేరుకోవడం సులభం అని నాల్గవది, ఈ వ్యక్తులు ఆధారపడే కొరియర్ బలహీనంగా మారి అతని కుటుంబం మరియు స్నేహితుల బంధువుల వద్దకు వెళ్లి ఉండవచ్చు అనే మరో అవకాశం ఉందని,కామ్రేడ్ రాజు దాదా సెప్టెంబర్ 9న రాసిన తన చివరి లేఖలో ఈ కొరియర్ యొక్క కొన్ని బలహీనతల గురించి రాశారని, సమస్యల సంభావ్యత గురించి స్థానిక సి సి కామ్రేడ్‌లకు కూడా ఆయన తెలియజేశారని, ఈ లొంగుబాటులు మరియు ద్రోహాలు ప్రమాదం సమీపిస్తోందని కామ్రేడ్‌లకు హెచ్చరికగా ఉన్నాయి మరియు వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారని పేర్కొన్నారు. చివరి లేఖలో ఇది మరింత స్పష్టంగా వివరించబడింది, కానీ నేను దానిని చదివే అవకాశం ఉందా అని నేను చెప్పలేనని ఇంకా, కామ్రేడ్ రాజు దాదా తన లేఖలో వారు స్థిరపడిన ప్రాంతంలో అంతా బాగా లేదని రాశారని ప్రతి నష్టానికి నిరంతర లొంగుబాటు ప్రధాన కారణంగా మారుతోందని వికల్ప్ పేర్కొన్నారు.

## చురకలు

### సంపాదకీయం

# మోడీ స్వదేశీ మంత్రం...

# గ్లోబలైజేషన్ నుంచి భారత్ దూరం ?

ఈ ప్రపంచం అంతా ఉన్నది భూగోళం మీదనే. ఇక్కడ ఎవరికి ఎవరూ ఏమీ కారు అని అనుకోవచ్చు. కానీ ప్రతీ ఒక్కరికీ ఇంటర్ లింక్ ఉంది. అలాగే ఒక దేశంతో మరో దేశానికి ప్రాణావ సరాలే ఉన్నాయి. విశ్వం అంతా ఒక్కటి అని భారత్ విశ్వ గురువు అని చెప్పుకునే బీజేపీ పెద్దలకు ఇవ్వన్నీ తెలియనివి కావు. కానీ వేగంగా మారిన అంతర్జాతీయ పరిణామాల నేపధ్యంలో తక్షణ పరిష్కారం అనుకున్నారో లేక సెంటిమెంట్ తో సాధించాలనుకు న్నారో తెలియదు కానీ ఇపుడు స్వదేశీ మంత్రాన్ని పఠిస్తున్నారు. మన దేశం మన ఉత్పత్తులు మన వాడకం, మన వనరులు మన సంపద అంతా బాగానే ఉంది కానీ ఎక్కడో ఏదో తెలియని ఇబ్బంది పొంచి ఉదని కూడా అనిపిస్తోంది.

**గొలుసు కట్టు నుంచి విడివడి :** ఈ రోజున ప్రపంచం అంతా ఒక కుగ్రామంగా మారిపోయింది. ఒక ఇంట్లో సామానులు జాబితా చూస్తే చాలు ప్రపంచం ఎక్కడో లేదు అక్కడే ఉంది అనిపిస్తుంది. తెల్లారి లేస్తే వాడే టూత్ పేస్టు నుంచి పోపుల డబ్బాల్లో ఇంగువ దాకా చూస్తే ఎక్కడో ఏదో దేశం నుంచి దిగుమతి చేసుకున్న సరు కులే దేశంలో కొని ఇంట్లో పెట్టుకున్నవి. అవన్నీ నిత్యావసరాలు అయిపోయాయి. ఒక విధంగా గ్లోబలైజేషన్ గొలుసుకట్టుతో ప్రపంచ దేశాలు ముడి వేసుకుని ఉన్నాయి.

దాని నుంచి విడిపోవడం అంటే ఒంటరిగా ఉంటూ కష్టాలను కోరి తెచ్చుకోవడమే అవుతుంది అని అంటున్నారు.

**మూడున్నర దశాబ్దాల క్రితం :** ప్రపంచీకరణ మంత్రం అన్నది 1990 నాటిది. ఆనాటి నుంచి దేశాలు అన్నీ ఒక్కటి అయ్యాయి. ఒక దేశం సరకుని మరో దేశం తలుపులు బార్లా తెరచి ఆహ్వానించింది. అలాగే తమ దేశంలోకి విదేశీ వస్తువులకు చోటు ఇచ్చింది. అలా ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ ఎగుమతి చేసుకుంటూ తమకు అవసరమైనది దిగుమతి చేసుకుంటూ అన్ని దేశాలు ఒక్కటిగా ఉంటూ వస్తున్నాయి, ఒక ప్రపంచీకరణ మంత్రం దేశల మధ్య ఎడం తగ్గించి. అనుబంధం పెంచింది.

అంతే కాదు వ్యాపార వాణిజ్యాలు కూడా బాగా పెరిగి ఆర్ధికంగా అంతా బాగున్న నేపథ్యం ఉంది. భారత్ లో అయితే ఆర్థిక మేధావిగా పేరు గడించిన పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నపుడు గ్లోబలైజేషన్ కి భారత్ ద్వారాలు తెరచి ఉంచారు. దాంతో దేశం ఆర్ధికంగా పరుగులు పెట్టింది. అంతే కాదు ఈ ఆర్థిక సంస్కరణల వల్ల భారత్ లో ఎన్నో దేశాల వస్తువులు వచ్చిపడ్డాయి. అలా ఏ వస్తువు స్వదేశీ ఏ వస్తువు విదేశీ అన్న తేడా లేకుండా అంతా వినియోగిస్తున్న పరిస్థితి ఉండిపుడు.

**బంధం పెరిగింది :** తినే తిండి కట్టే బట్ట ఇలా ఎన్నో విలాస వస్తువులు వినోద వస్తువులు అన్నీ కూడా ఎక్కడో దేశాల తయారీవే. వాటిని చాలా మంది మన ఉత్పత్తులే అనుకునే ప్రమాదం ఉంది. అంతలా కలిసిపోయాయి అన్న మాట. మనం వాడే టూత్ పేస్టులో సైతం అనేకం అమెరికా సహా ఎన్నో దేశాల నుంచి వచ్చినవే. అంతే కాదు ఇంట్లో బంగాళా దుంపలు ఇవన్నీ పాక్ నుంచి ఇతర అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూంటాం. అంతే కాదు దక్షిణాఫ్రికా నుంచి ఉల్లి గడ్డలు ఎక్కువగా భారత్ లోకి దిగుమతిగా వస్తాయి. మనకు ఘుమఘుమలాడే వంటింటి పదార్ధం ఇంగువ మన దేశం ఉత్పత్తి కాదని కూడా ఎవరికీ తెలియదని అంటారు. అది పూర్తిగా విదేశీ అని చెబుతున్నారు.

**అటు అమెరికా ఇటు చైనా :** ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం అమెరికా విషయంలో పరిష్కారాలు చూస్తోంది. అధిక సుంకాలు విధించి భారత్ ని ఇబ్బంది పెడుతోంది అని భావించి స్వదేశీ మంత్రాన్ని అందుకుంది అని అంటు న్నారు. అలాగే వీసాల విషయంలో అధిక ఫీజులను పెట్టి కొల్లగొడుతున్న తీరు మీద కేంద్ర పెద్దలు ఫైర్ అవుతున్నారు. అందుకే ఇతర దేశాలలో పని చేస్తే వృత్తి నిపుణులను కూడా భారత్ కి రమ్మని కోరుతున్నారు. చైనా విషయం తీసుకుంటే భారత్ ని తన పెద్ద మార్కెట్ గా చేసుకుంది. దానికి సైతం ముకుతాడు వేయాలని భావించి స్వదేశీ నినాదం వినిపిస్తున్నారు అని అంటున్నారు.

**భవిష్యత్తులో ప్రభావమా :** అయితే ఈ నినాదాలు అన్నీ బాగానే ఉంటాయి. కానీ నా కోడి నా ఇల్లు అన్నట్లుగా ఒంటెద్దు పోకడలు పోయే కాలం దాటి ముందుకు వచ్చేశామని అంతా గ్రహించడం లేదు. ఈ రోజున మన వస్తువులు స్వదేశీ అని ఇతర దేశాల వస్తువులను దేశంలో వద్దని అనుకుంటే వారు మాత్రం తమ దేశంలో మన వస్తువుల అమ్మకాలను ఎలా స్వాగతిస్తారు అన్న ప్రశ్న వస్తోంది. అంతే కాదు మన ఉత్పత్తులు అన్నీ మన కోసమే కాదు కదా మిగులు అంతా ఇతర దేశాలకు ఎగుమతి చేయాల్సిందే. అపుడే మన ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది. డిమాండ్ అండ్ సప్లై చైన్ కూడా సక్రమంగా ఉంటుంది. కానీ ఇతర దేశాలతో బంధాలు తెంపుకుంటే మనకు అవసరం అయినపుడు వారు రానిస్తారా అన్నది కూడా పెద్ద ప్రశ్న. అపుడు అది కాస్తా అంతర్జాతీయ వివాదాలకే దారి తీసే ప్రమాదం ఉంది. మన ఆర్థిక వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఉంది అని అంటున్నారు ఇది ఆర్థిక నిపుణులు అంటున్న మాట.

అందువల్ల స్వదేశీ మంచి నినాదమే. అతి చేస్తే ముంచే నినాదం కూడా. మరి అది తెలుసుకుని ముందుకు సాగాల్సి ఉంటుంది అని అంటున్నారు.

# గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం - సెప్టెంబర్ 25... ఎస్పీ బాలు వర్ధంతి



తెలుగు నేపధ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, తెలుగువారు అభిమానముగా బాలు అని పిలుచుకునే శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం దశాబ్దాల పాటు సినీ సంగీత సామ్రాట్టుగా నిలిచారు. పద్మశ్రీ డాక్టర్. ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం (శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం) 1946 జూన్ 4 న నాటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లోని కోనేటమ్మపేట గ్రామంలో (ప్రస్తుతము ఈ గ్రామం తమిళ నాడు రాష్ట్రములో ఉన్నది) జన్మించారు. ఒక సాంప్రదాయ శైవ బ్రాహ్మణ కుటుంబములో, ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు కల పెద్ద కుటుంబములో బాల సుబ్రహ్మణ్యం రెండవ కుమారుడుగా పుట్టారు. ఆయన తండ్రి సాంబమూర్తి పేరొందిన హరికథా పండితులు. బాల్యము నుండే బాలుకు పాటలు పాడటము ఒక హాబీగా ఉండేది. బాల్యం నుంచే బాలుకు సంగీతంపై ఇష్టం ఏర్పడింది. హార్మోనియం, పిల్లనగ్రోవి వంటి వాద్యాలు వాయించేవారు. తండ్రి వాయిస్తున్నప్పుడు చూసి తను నేర్చుకునేవారు. తండ్రి కోరిక మేరకు ఇంజనీరు కావాలనే ఆశయముతో మద్రాసులో ఏఎంఐఈ కోర్సులో చేరారు. ఆ కాలము లోనే వివిధ పాటల పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకొన్నారు బాలు. 1964లో మద్రాస్ తెలుగు కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన పోటీలో బాలు ప్రథమ బహుమతి గెలుచు కున్నారు. ఇది ఆయన జీవితంలో టర్నింగ్ పాయింట్ అయింది. ఎ.ఎం.ఐ.ఇ చదువు పూర్తి కాకుండానే బాలసుబ్రహ్మణ్యం చలనచిత్ర రంగ ప్రవేశం చేసారు. సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి ఆయనకు అవకాశం ఇచ్చారు. 1966లో నటుడు, నిర్మాత అయిన పద్మనాభం నిర్మించిన ఎస్.పి.కోదండపాణి సంగీత దర్శకత్వం వహించిన, శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న చిత్రంతో సినీ గాయకునిగా చలన చిత్ర గాయక జీవితం ప్రారంభించారు. ఈ చిత్రానికి తనకు సినీ గాయకుడిగా జీవితాన్ని ప్రసాదించిన కోదండ పాణిపై భక్తితో, అభిమానంతో తాను నిర్మించిన ఆడియో ల్యాబ్ కు "కోదండపాణి ఆడియో ల్యాబ్స్" అని ఆయన పేరే పెట్టుకున్నారు బాలు. తరువాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం సినిమాల నుంచి ఆయనకు ఆఫర్లు వచ్చాయి. సినిమాలో పాటలు పాడే ముందు బాలు.. మ్యూజిక్ బ్యాండ్‌కు లీడర్‌గా ఉండేవారు. బ్యాండ్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా గిటార్ వాయించేవారు. పాటలోనే మాటలని, గళంలో అభినయ ముద్రలని నింపి తెలుగుదనం ఒలికించగల విలక్షణత బాలు ప్రత్యేకత. గళం విప్పినా... స్వరం కూర్చినా... ఆ పాటలోని కవి భావాన్ని సూటిగా ప్రేక్షకుల వద్దకు తీసుకువెళ్ళగలిగే సత్తా బాలు గళానికి ఉంది. గురు ముఖంగా శాస్త్రీయ సంగీతం ప్రత్యేకంగా నేర్చుకొన్న నేపథ్యం లేకపోయినా, స్వర రచయిత ఇచ్చిన బాణీని శృతి పక్వంగా, లయ బద్ధంగా గానం చేయగలిగిన సహజ సిద్ధమైన ప్రతిభ బాలూకు రాణింపు తెచ్చింది. తరాలు మారినా ఎందరో నటులకు వారి హావ భావలకు, నటనా శైలులకు అనుగుణంగా ఆయన పాటలు పాడి ప్రాణం పోశారు. అందుకే అమర గాయకుడు ఘంటసాల తరువాత తెలుగు సినీ పాటకు సిసలయిన వారసుడిగా నిలిచారు. పదాల మాదుర్యాన్ని గమనించి ఆయన చేసే ఉచ్చారణ, పాటను పండిత పామరులకి చేరువ చేసింది. శంకరాభరణం, సాగర సంగమం లాంటి తెలుగు చిత్రాలే కాకుండా "ఏక్ దుజే కేలియే," లాంటి హిందీ చిత్రాలకు అతను పాడిన పాటలు దేశమంతా ఉర్రూత లూగించాయి. 40 ఏళ్ళ సినీ ప్రస్తానంలో 40 వేల పాటలు 11 భాషలలో పాడి, 40 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించి ప్రపంచం లోనే ఒక అరుదయిన రికార్డు సృష్టించారు. తెలుగు, తమిళమే కాకుండా కన్నడంలో కూడా అతను పాడిన పాటలకి జాతీయ పురస్కారాలు లభించాయి. 2001 పద్మశ్రీ భారత ప్రభుత్వం తరఫున, 1999 డాక్టరేట్ శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 2011 పద్మభూషణ్, 2016 శత వసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారం తదితరాలను ఆయన అందుకున్నారు. గాయకుడి గానే కాకుండా గాత్రదాన కళాకారుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా ఆయా విభాగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారాన్ని 29 సార్లు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి గాన గంధర్వుడు. 2016 నవంబరులో గోవాలో జరిగిన 47 వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో ఆయనకు శత వసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారాన్ని (సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2016) ప్రదానం చేసారు. బాలు...1981 – తమిళనాడు ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు గౌరవ డాక్టరేట్ తెలుగు విశ్వ విద్యాలయం1999బీ కర్నాటక ప్రభుత్వం కర్నాటక రాష్ట్ర అవార్డు – 2008బీ సత్యబామా విశ్వ విద్యాలయం, చెన్నై డాక్టరేట్ – 2009బీ ఆంధ్ర విశ్వ విద్యాలయం కళా ప్రపూర్ణ – 2009బీ గౌరవ డాక్టరేట్ జెఎన్‌టియు అనంతపురం – 2010బీ ఘంటసాల పురస్కార్ ఘంటసాల కుటుంబం కళా ప్రదర్శిని, చెన్నై – 2017బీ గౌరవ డాక్టరేట్ ది ఇంటర్నేషనల్ తమిళ విశ్వ విద్యాలయం, యునైటెడ్ స్టేట్స్ – 2017 తదితర అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. నటుడిగా బాల సుబ్రహ్మణ్యం అనేక సినిమాల్లో నటించాడు. ఈటీవీలో "పాడుతా తీయగా" అనే కార్యక్రమంతో బాల సుబ్రహ్మణ్యం బుల్లితెర ప్రవేశం చేసారు. అనేక మంది కొత్త గాయనీ గాయకులను ఈ కార్యక్రమం ద్వారా పరిచయం చేసారు. 1996 లో మొదలైన ఆ కార్యక్రమం 2020 లో ఇంకా కొన సాగుతూనే ఉంది. ఘంటసాల గానం చేయ వలసిన పాటలకు ట్రాక్ పాడే సందర్భముగా ఇద్దరు అమ్మాయిలు చిత్రంలో "నా హృదయపు కోవెలలో, ఈ బంగారు లోగిలిలో, ఆనందం నిండాలి, అనురాగం పండాలి" అనే దాశరధి గీతాన్ని ( మహదేవన్ సంగీతం) అక్కినేని కోసం పాడిన పాటనూ, అలాగే దీక్ష సినిమాలో నారాయణ రెడ్డి రాసిన పెండ్యాల స్వర రచనలో వచ్చిన "మెరిసే మేఘ మాలిక, ఉరుములు చాలు చాలిక" అనే ఎన్టీఆర్ కోసం పాడిన పాటనూ ఘంటసాల విని బాలు చేత రికార్డు చేయించిన పాటలనే సినిమాలో ఉంచాలని తాను కొత్తగా పాడాల్సిన పని లేదని అన్నారంటే బాల సుబ్రహ్మణ్యం ప్రతిభ చెప్పకనే చెబుతోంది. శాస్త్రీయ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, బాలును ఉద్దేశించి "మేము సినిమాలో పాట పాడాలంటే ఓ రోజంతా రిహార్సిల్ చేసి పాడతాము. అలాంటిది బాలు వచ్చి రాగానే ఒక సారి విని వెంటనే సంగీత కారుడు చెక్కిన దానికి తనవైన సొబగులు అద్ది మరింత రంజకంగా గంట లోపులో పాట రికార్డు చేసేస్తాడు, వాడి ప్రతిభను నేనెలా చెప్పేది" అంటూ చేసిన వ్యాఖానికి మించిన కితాబు ఏముంటుంది. బాల సుబ్రహ్మణ్యం దక్షిణ భారత భాషలలో మరియు హిందీలో ఐదు దశాబ్దాలుగా తరాల నటీనటుల కోసం – ఎన్టీఆర్, అక్కినేని, కృష్ణ, శోభన్ బాబు, ఎంజిఆర్, శివాజీ గణేషన్, జెమిని గణేశన్ నుండి ప్రస్తుత తారల వరకు అత్యధిక పాటలు పాడిన గాయకునిగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కు ఎక్కిన బాలు భార్య సావిత్రి కాగా, పాటతో పెనవేసుకున్న బంధం, అనుబంధం మరిచి పోకుండా పిల్లలకు చరణ్, పల్లవి పేర్లు పెట్టు కున్నారు. గత సంవత్సరం కరోనా కారణంగా చెన్నైలో ఎంజీఎం ఆసుపత్రిలో 2020 ఆగస్టు 5న చేరి, నిష్క్రియాత్మక ఫిజియోథెరపీ, వెంటి లేటర్, చివరకు ఎక్మో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న శుక్రవారం మధ్యాహ్నం అంతిమ శ్వాస వదిలారు. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# వైద్యులకు రోగులకు వారధులు ఫార్మసిస్టులు - సెప్టెంబర్ 25... ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం


ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ధ ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ నానా పాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా, వెంటనే మందులు తీసుకుంటున్నారు. ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగు పరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా? ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స, ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగు పరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం. అందువల్ల, ఫార్మసిస్ట్ యొక్క ప్రాముఖ్యత, పాత్ర గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25 న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవంను సెప్టెంబర్ 25 న ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (ఎఫ్ఐపి) ప్రకటించింది. ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు మానవాళి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఎలాంటి పాత్ర పోషిస్తారో, వైద్య ప్రపంచంలో ఫార్మాసిస్టుల పాత్ర ఏమిటో తెలుసు కోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించ బడతాడు. రోగులకు కావాల్సిన మందులను, ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గ నిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగు పరచడానికి మందులు వాటి వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు. ప్రపంచం లోని ప్రతి ఒక్క రోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్ లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మాసిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు




వారి విస్తృత జ్ఞానం మరియు నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగిని హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పని చేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా చాలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు. కానీ జ్ఞానం, అనుభవరం పరంగా వారు డాక్టర్ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యుల వద్దకు వెళ్లలేని, వైద్యం చేయించు కోలేని నిరు పేదలకు, ఔషధాలను అందించడం లోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు. ఫార్మాసిస్టును కూడా ఒకరకంగా వైద్యుడి లాగే తెల్లటి కోటు ధరించి, మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షక నిపుణుడిలా భావించ వచ్చు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవయవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఔషధ లోపం, వాటిని నివారించడంలో ఫార్మాసిస్టుల వల్ల కలిగే పరిణామాలను చూసిన ఈరోజును ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో గుర్తించింది. కానీ అంతకు ముందే 1912 సంవత్సరం లోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు డే జరుపు కోవడానికి ఎంపిక చేయ బడింది. అప్పటి నుండి ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రారంభించ బడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్య కరమైన జీవనానికి సలహా ఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునేలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగు పరచడం, సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు మరియు వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, వలసిన వారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన, అమూల్య సేవలు అందిస్తున్న, వారి ప్రతిభావంత మైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితులలో కరోనా వైరస్ యొక్క వ్యాప్తిని ఆపడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్టులు అవిశ్రాంతంగా కృషి వెల కట్టలేనిది. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, పంపిణీ చేయడం, కుటుంబ సభ్యులకు దూరంగా, స్వార్థం మరిచి, మానవ సేవే పరమార్థంగా, ఈ క్లిష్ట సమయంలో ఫార్మాసిస్టులు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి, కృతజ్ఞతలు ప్రకటించాల్సిన సమయం ఇది.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# అంతరిక్ష వాస్తుశిల్పి సతీష్ ధావన్ - సెప్టెంబర్ 25... సతీష్ ధావన్ జయంతి



భారత దేశం గర్వించదగిన అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ ధావన్. ఆయన్ను భారత ఎక్స్పెరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగాత్మక (ద్రవ డైనమిక్స్ పరిశోధన) కు పితామహుడిగా పరిగణిస్తారు. అల్లకల్లోలం మరియు సరిహద్దు పొరల రంగంలో అత్యంత ప్రసిద్ధ పరిశోధకులలో అగ్రగణ్యుడుగా భావిస్తారు. గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి సాధించి, ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్ఎస్, పిఎస్ఎల్‌విలు రూపొందాయి. స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. భారత దేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత దేశపు అత్యున్నత పురస్కారాలు పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పొందాడు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, విశిష్ట పూర్వ విద్యార్థి కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 1969 అవార్డు పొందాడు. సతీష్ ధావన్ (1920 సెప్టెంబరు 25 %-% 2002 జనవరి 3) శ్రీనగర్ లో జన్మించిన ధావన్, భారత దేశం, అమెరికాలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయనను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఆయా రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్ష కార్యక్రమ అభివృద్ధికి దోహద పడింది. 1972 లో ఎమ్.జి.కె. మీనన్ తరువాత, ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ప్రొఫెసర్ సతీష్ ధావన్ సమాజాన్ని మార్చే మార్గంగా టెక్నాలజీని, ముఖ్యంగా హై టెక్నాలజీని చూసిన మానవతా వాది. భారతదేశం యొక్క అత్యంత విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమానికి వాస్తుశిల్పి సతీష్ ధావన్. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి.హెచ్.డి పొందాడు. డా. ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా (1972–1984) భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా పని చేశాడు. స్పేస్ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో తోడ్పడింది. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు. 1975 లో ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్ఎల్‌వి అభివృద్ధి జరుగగా, దాని మొదటి ప్రయోగం విఫలమైంది. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆనాటి పత్రికా సమావేశంలో పాల్గొని ఆ వైఫల్యాన్ని తానే స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంత మైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు. 1951 లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దానికి డైరెక్టరుగా నియమితుడై, 1962–1981 వరకు ఐఐఎస్‌సి ఛైర్మన్ గా పని చేశాడు. ఆయన ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు నియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను హెర్మన్ ష్లిక్టింగ్, తాను రాసిన బౌండరీ లేయర్ థియరీ పుస్తకంలో వివరించాడు. ధావన్ ఐఐఎస్‌సి లో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. అయన గ్రామీణ విద్య, రిమోట్ సెన్సింగ్ మరియు ఉపగ్రహ సమాచార మార్పిడిలో మార్గదర్శక ప్రయోగాలు చేశారు. ధావన్ ప్రయత్నాలు %×చీూాు%- ఒక టెలి కమ్యూనికేషన్ ఉపగ్రహం, IRS – ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం మరియు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (%ూూాం%) వంటి కార్యాచరణ వ్యవస్థలకు దారితీశాయి, ఇవి భారతదేశాన్ని అంతరిక్ష వ్యవసాయ దేశాల లీగ్‌లో ఉంచాయి. 2002 లో ధావన్ మరణించాక, నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఆయన పేరుతో "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం"గా పేరు పెట్టారు. లూధియానా లోని ప్రభుత్వ కళాశాలను ఆయన పేరిట మార్చారు. పద్మ విభూషణ్, 1981, పద్మ భూషణ్, 1971, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1999 స్వీకరించాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు సీనియర్ సైంటిఫిక్ ఆఫీసరు, 1951బీ ప్రొఫెసర్ అండ్ హెడ్ అఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏరొనాటికల్ ఇంజనీరింగ్, 1955 డైరెక్టరు, 1962 –1981బీ కాలి ఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా విజిటింగ్ ప్రొఫెసరు, 1971%–72 నేషనల్ ఏరోస్పేస్ లాబరేటరీస్, బెంగళూరు రీసెర్చి కౌన్సిల్ ఛైర్మను, 1984%–%93బీ ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ప్రె ప్రెసిడెంట్ 1977 –1979బీ ఇస్రో ఛైర్మన్, 1972%–%1984బీ ఇండియన్ స్పేస్ కమిషను ఛైర్మన్, 1972%–%2002 గా విధులు నిర్వర్తించాడు. 2002 జనవరి 3న 81ఏళ్ళ వయసులో మరణించాడు.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# నత్తనడకన పనులు.. పర్యవేక్షణ కరవు

ధర్మపురి : ధర్మపురిలోని బోయవాడలో ఓ ఇంటి ముందు పాత నల్లా కనెక్షన్ తొలగించి అమృత్ 2.0 పథకంలో భాగంగా పైపులైన్ కోసం నెలరోజుల క్రితం కందకాన్ని తవ్వారు. ఇప్పటికి పనులు చేపట్టకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత గుత్తేదారుకు చెప్పినా పట్టించుకోవటం లేదని ఇంటి యజమానురాలు వాపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి గుంతలో నీరు చేరి అసౌకర్యానికి గురయ్యామంది.

జిల్లాలోని అయిదు పురపాలికల్లో తాగునీటి సౌకర్యం మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ 2.0 కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ వరకు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటికీ 50 శాతానికి కూడా చేరువ కాలేదు. పైపులైన్‌ల కోసం కందకాలు తీసి అలాగే వదిలేశారు. మిషన్ భగీరథ, అమృత్ పథకం గోతులతో రోడ్లు నాశనం అవుతున్నాయి. పాత నల్లాల తొలగింపు.. అమృత్ 2.0 నత్తనడక పనులతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కరవైంది. గుత్తేదారుల వైఖరితో పురపాలకల కమిషనర్లకు తలనొప్పిగా మారింది. ఉదయం ఈ సమస్యలపై వారికి ఫిర్యాదులు వస్తున్నాయి.

**పురపాలికల వారీగా ఇలా**



జగిత్యాల : రూ.38 కోట్ల నిధులు మంజూరు. నాలుగు సంపులు కట్టాల్సి ఉండగా 3 ప్రారంభించారు. 30 కి.మీల పైపులైన్ పనులకు 7 కి.మీలు మాత్రమే పూర్తయింది

కోరుట్ల : 41కి.మీల పైపులైన్‌కు 5.20 కి.మీలు వేశారు. రూ.41 కోట్ల నిధులు మంజూరు చేశారు.

మెట్‌పల్లి : రూ.19 కోట్లు రాగా.. 29 కిమీల పైపులైన్‌కు 7 కి.మీల పనుల మాత్రమే జరిగాయి.

రాయికల్ : రూ.15 కోట్లు కేటాయించారు. నీటి సంపులతో పాటు 20 కి.మీల పైపులైన్ నిర్మించాల్సి ఉంది.

ధర్మపురి : రెండు బృహత్తర నీటి ట్యాంకుల నిర్మాణాలు ప్రారంభించారు. మార్కెట్, మిషన్ భగీరథ కార్యాలయం వద్ద నిర్మించాల్సి ఉండగా.. మార్కెట్ స్థలం వద్ద మాత్రమే పనులు నడుస్తున్నాయి. మిషన్ భగీరథ కార్యాలయం వద్ద వర్షపు నీరు చేరటంతో నిలిచి పోయాయి. 25 కి.మీల పైపులైన్ వేయాల్సి ఉండగా, 12 కి.మీలు మాత్రమే వేశారు. రూ.23 కోట్లతో పనులు చేస్తున్నారు.

**పనులు వేగవంతమయ్యేలా చర్యలు**


అమృత్ 2.0 పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సిబ్బందికి లక్ష్యాన్ని నిర్ణయిస్తున్నాం. ప్రజల నుంచి పనులపై ఫిర్యాదులు రాగానే స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్నాను. పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తమే.. వేగవంతమయ్యేలా చర్యలు చేపడతాం. శ్రీనివాస్‌రావు, ధర్మపురి, పుర కమిషనర్

# నాడి పట్టిన రైతుబిడ్డలు

జగిత్యాల : వెయ్యి మైళ్ల దూరమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది.. ఉన్నత స్థాయికి ఎదగాలన్న కోరిక అందరికీ ఉంటుంది.. ఇందులో మొదటి అడుగు వేసే వారు మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తారు.. అలా ఒకరిని చూసి మరొకరు పిల్లలను వైద్య విద్య చదివిస్తుండటంతో గ్రామంలో పది మందికి పైగా కాబోయే డాక్టర్లున్నారు.. జగిత్యాల గ్రామీణ మండలం లక్ష్మీపూర్ వ్యవసాయ పరంగా గణనీయ అభివృద్ధి సాధించింది. ఇక్కడి రైతులు ఆధునిక పద్ధతులతో సాగును లాభసాటిగా మార్చుకున్నారు. ఈ ఊరిలో ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 13 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు ఉన్నారు. ఆరేళ్ల కిందట ఈ సంఖ్య ఒకటి. ఒకరిని చూసి మరొరకు రైతు బిడ్డలు నాడి పట్టిన తీరు స్ఫూర్తిదాయకమే.

**ఒకరిని చూసి మరొకరు..**

గ్రామంలో గతంలో ఓ వైద్యురాలుండగా ఆరేళ్ల కిందట చదువు పూర్తి చేసిన మహేశ్‌రెడ్డి జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్‌లో వైద్యశాల ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. గ్రామస్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతు సంఘం నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి కూతురు శ్రేయ కరీంనగర్‌లోని ప్రైవేటు కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతూ పీజీకి సిద్ధమవుతున్నారు. గడ్డం తిరుపతిరెడ్డి కుమారుడు గోవర్ధన్‌రెడ్డి నిజామాబాద్‌లో వైద్య విద్య పూర్తి చేసి పీజీకి సిద్ధమవుతున్నారు. ఎర్రవల్లి జనార్దన్ కొడుకు శ్రీనాథ్, నేతి రమేశ్ కుమారుడు రాకేశ్, కొడిమ్యాల రమేశ్ కుమారుడు నవీన్ వైద్య విద్య అభ్యసిస్తున్నారు.



**ఆలోచింపజేసిన ఆ ఘటన**

లక్ష్మీపూర్ గ్రామ జనాభా 4 వేలకు పైగా ఉండగా రైతు కుటుంబాలే అధికం. అధిక దిగుబడులతో ఇక్కడి అన్నదాతలు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామానికి చెందిన కొప్పెర వెంకట్‌రెడ్డి కొడుకు మహేశ్‌రెడ్డి ఆరేళ్ల కిందట వైద్య పూర్తి చేయడంతో రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో సన్మానించారు. ఇది చూసిన చాలా మంది రైతులు ఆలోచనలో పడ్డారు. తమ పిల్లలను ఎందుకు వైద్య విద్య చదివించకూడదని భావించారు. అలా ఒకరిని చూసి మరొకరు పిల్లలను వైద్య విద్యలో చేర్చారు. పెద్దల కోరికకు తగ్గట్టుగా పిల్లలు కూడా కష్టపడి చదువుతున్నారు. ప్రస్తుతం ఈ ఊరిలో వైద్యులు, వైద్య విద్యార్థులు 13 మంది ఉండగా ఇందులో చాలా మంది ప్రతిభ ఆధారంగా ఉచిత సీటు పొందిన వారే కావడం విశేషం.

# చెరువులను చెరబట్టి మట్టిని మింగేసి



గంగాధర : పల్లెల్లో వ్యవసాయానికి, వృత్తి పనులకు ఆధారంగా ఉంటున్న నీటి వనరులు కొందరి నిర్వాకంతో కుచించుకుపోతున్నాయి. వర్షాలకు నీటితో కళకళలాడాల్సిన చెరువులు, కుంటలను ఆక్రమించి పంటలు సాగు చేయడంతో వాటి ఉనికికే ప్రమాదం వాటిల్లుతోంది.

**శిఖం భూమి కబ్జా**

గంగాధరలోని గర్శకుర్తిలో ఊర చెరువు 55 ఎకరాల్లో విస్తరించి ఉండగా దాదాపు 350 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుంది. ఊరంతటికీ మంచినీటిని అందించే బావి కూడా ఈ చెరువులోనే ఉంది. వర్షాలకు చెరువు నిండి భూగర్భజలాలు అందుబాటులో ఉంచుతున్న ఈ చెరువును కొందరు ఆక్రమించి పంటలు వేశారు. ఒకరు ఏకంగా చెరువు నీటిలో మోటారు పంపుసెట్ ఏర్పాటుచేసి నీటిని తోడేస్తున్నారు. ఇందుకోసం అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్నారు.

**10 ఎకరాల్లో..**

చెరువు శిఖం ఆక్రమణలపై గ్రామంలోని 110 మత్స్యకారుల కుటుంబాలు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. మోటారు పంపుసెట్ తొలగించి గ్రామ పంచాయతీలో అప్పగిస్తే తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆవేదన చెందారు. చెరువు శిఖం భూమి దాదాపు 10 ఎకరాల్లో కొందరు చెరువులోని మట్టి తవ్వి పోయడంతో చెరువు కుచించుకుపోయింది. పదెకరాలు ఆక్రమించిన చెరువు చుట్టూ శిఖం భూమిలో పలువురు పంటలు సాగు చేశారు. చెరువులో 2 లక్షల చేప పిల్లలు పెంపకానికి పోస్తే వాటి ఉనికే లేకుండా పోయిందని మత్సకార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు చుట్టూ ఉన్న గట్టు కాలువను కొందరు ఆక్రమించడంతో వర్షాలకు చెరువులోకి నీరు రావడం లేదన్నారు.

**ఇంకా ఎక్కడెక్కడంటే..**

గంగాధర పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాల పరిధిలో 14 పెద్ద చెరువులు, 74 చిన్న నీటి వనరులున్నాయి. వేసవికి ముందు ఎల్లంపల్లి ప్రాజెక్టుతో చెరువులు, కుంటలు నింపుతుండగా దానికంటే ముందుగానే ఆయా గ్రామాల్లోని చెరువుల శిఖం భూములను కొందరు చెరపట్టించారు. గంగాధర, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, ర్యాలపల్లి, గట్టుబూత్కూర్, సర్వారెడ్డిపల్లి గ్రామాల్లోని చెరువుల్లో విలువైన భూములను కబ్జా చేసి తమ పంట భూముల్లో కలిపేసుకున్నారు. వీరిని అధికారులు గానీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏళ్లుగా వారి కబంధ హస్తాల్లోనే ఈ భూములు ఉంటున్నాయి.

**సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం** గర్శకుర్తిలోని చెరువు శిఖం భూములపై వెంటనే సర్వే చేసి ఆక్రమణ జరిగినట్లు తేలితే స్వాధీనం చేసుకుంటాం. ఇంకా ఎక్కడైనా కబ్జాకు గురైతే సర్వేయర్, ఆర్ఐలు, సిబ్బందితో సర్వే జరిపిస్తాం. ఆక్రమణదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. రజిత, తహసీల్దారు, గంగాధర

# చిత్రం పెట్టు.. బిల్లు రాబట్టు



సిరిసిల్ల : ఇంటి నిర్మాణానికి సంబంధించిన చిత్రాలు పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నిక్షిప్తం చేసేవారు. ఆ తర్వాత ఏఈ, డీఈ, పీడీ, జిల్లా కలెక్టర్, ఆపైస్థాయి అధికారుల పరిశీలన పిదప ఏఐ సహకారంతో పక్షం రోజుల్లో బిల్లుల చెల్లింపులు జరిగేవి. బేస్‌మెంట్ దశలో రూ.లక్ష, గోడల దశలో రూ.లక్ష, శ్లాబు పూర్తయితే రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష ఇలా.. రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాలో జమయ్యేవి. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న సర్కారు ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్‌లో కొత్త ఐచ్ఛికాన్ని తీసుకొచ్చింది. బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపడంలో జాప్యాన్ని నివారించేందుకు సదరు యాప్‌లో చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశాన్ని లబ్ధిదారులకు ఇచ్చింది.ప్రతి పేద కుటుంబానికి సొంత గూడు అందించాలని సర్కారు నిర్ణయించింది. పారదర్శకంగా ఎంపికతోపాటు నిర్మాణంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందుకు సాగుతోంది. సాంకేతిక వినియోగంతో లబ్ధిదారులకు మేలు చేకూర్చేందుకు మరో అడుగు ముందుకేసింది. నిర్మాణానికి సంబంధించిన చిత్రాలను ఇందిరమ్మ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేసే అవకాశాన్ని లబ్ధిదారులకే కల్పించింది. ఫలితంగా త్వరితగతిన బిల్లుల చెల్లింపునకు మార్గం సుగమం అయ్యింది.

**వేగం పెంచేందుకే..**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. భవనానికి అవసరమైన ఇసుక, మట్టిని ఉచితంగా అందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆర్థిక, ఇతర కారణాలతో నిర్మాణాలు మందకొడిగా సాగింది. జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవతో ప్రస్తుతం జిల్లాలో యాభైశాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పురోగతి సాధించింది.

పేద, మధ్య తరగతి కుటుంబాలు కొత్తగా ఇంటిని ప్రారంభించేందుకు అవసరమైన మూలధనాన్ని సమకూరుస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులకు సెర్ప్ ఆధ్వర్యంలో రూ.లక్ష మూల ధనాన్ని రుణ రూపంలో అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఏడు వందల మంది పొదుపు సంఘాల సభ్యులకు రూ.7 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ డబ్బులను బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు, స్త్రీ నిధి ద్వారా ఖాతాల్లో జమచేశారు.

దరఖాస్తు సమయంలో ఇచ్చిన చరవాణి నంబర్, ఓటీపీ సాయంలో ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం దశలో నలుమూలల తీసిన చిత్రాలను అందులో నిక్షిప్తం చేయాలి. ఆ తర్వాత అక్కడ వచ్చిన ప్రశ్నలకు సమాధానం నమోదుతో ప్రక్రియ పూర్తవుతుంది. లబ్ధిదారుడు అప్‌లోడ్ చేసిన చిత్రాలు సరైనవో కావో మరోసారి అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. తప్పని తేలితే బిల్లులు చెల్లింపు జరగదు.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల స్వరూపం

మంజూరు 10234

మార్కింగ్ ఇచ్చినవి 5308

బేస్‌మెంట్ స్థాయి 2549

శ్లాబు స్థాయి 618

పూర్తయినవి 285

చెల్లించిన బిల్లులు రూ.40 కోట్లు

# అమలులోకి పంట ధరలు పెంపు



జగిత్యాల : ప్రభుత్వం పంట ఉత్పత్తులకు పెంచిన కనీస మద్దతు ధరలు(ఎంఎస్‌పీ) ఈ నెలలో అమల్లోకిరాగా.. ఈ ధరలు ఏడాదిపాటు వర్తించనున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 9.70 లక్షల ఎకరాల్లో వరి ప్రధాన పంటగా ఉండగా.. ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామనడంతో సన్నాలను 25-40 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. అక్టోబరు మొదటివారం నుంచి వరి కోతలు, ధాన్యం సేకరణ మొదలుకానున్నాయి. **మార్క్‌ఫెడ్ ద్వారా పరిమితమే..**

పత్తిని 1.60 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా సీసీఐ ద్వారా కేవలం 2-16 శాతం పంటనే కొనుగోలు చేస్తుండగా.. మిగిలిన పత్తిని రైతులు మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతు ధర దక్కడంలేదు. మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణనూ చేపట్టాల్సి ఉంటుంది.పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధరను ప్రకటించనందునా విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది.

# లాభాల వాటా.. దీపావళి బోనస్

గోదావరిఖని : కార్మికులకు లాభాల వాటాతో పాటు పీఎల్‌ఆర్ బోనస్ తేలే అవకాశం ఉంది. అదే విధంగా ఏటా దీపావళి ముందు చెల్లించే పీఎల్‌ఆర్ బోనస్‌పై కూడా దిల్లీలో జేబీసీసీఐ కమిటీ సమావేశం కానుంది. దీంతో రెండు ప్రయోజనాలు ఒకే రోజే తేలే అవకాశం ఉంది. ఏటా చెల్లించే లాభాల వాటాపై సింగరేణి కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఈసారి ఆలస్యమైందన్న అభిప్రాయం కార్మికుల్లో వెల్లడైంది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు కోల్‌బెల్టు ప్రాంత ఎమ్మెల్యేల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రకటించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇక పీఎల్‌ఆర్ బోనస్‌పై కోల్ ఇండియా యాజమాన్యంతో జేబీసీసీఐ సంఘాల ప్రతినిధులు దిల్లీలో సమావేశమై నిర్ణయించనున్నారు.

**35 శాతం చెల్లించాలని డిమాండ్**

గతేడాది కంటే కార్మికులకు వాటా శాతం పెరిగే అవకాశం ఉంది. గతేడాది 33 శాతం వాటాను పంపిణీ చేశారు. ఈసారి 35 శాతం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే గతేడాది కంటే 2024-25 ఆర్థిక సంవత్సరంలో లాభాలు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కార్మికులకు వాటా కూడా ఎక్కువగానే లభించే అవకాశం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.2,412 కోట్ల లాభాలు గడించింది. దీనిపై కార్మికులకు 33 శాతం వాటా కింద రూ.795 కోట్లు పంపిణీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో



69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా రూ.40 వేల కోట్లకు పైగానే వ్యాపారం చేసింది. దీంతో లాభాలు కూడా అధికంగానే వచ్చే అవకాశం ఉంది. ఎంత శాతం ప్రకటించాలన్న దానిపై ముఖ్యమంత్రి నిర్ణయించనున్నారు. సోమవారం ఉదయం సీఎం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు కోల్‌బెల్టు ఎమ్మెల్యేల సమక్షంలో వాటా శాతాన్ని ప్రకటించేందుకు సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో లాభాల వాటాపై ఉన్న సందేహాలు తొలగిపోయే అవకాశం ఉంది.

**రూ.లక్షకు పైగానే..**

ఈ ఏడాది ప్రతిభ ఆధారిత ప్రయోజనం(పీఎల్‌ఆర్) ప్రయోజనం కూడా పెరిగే అవకాశం ఉంది. కోల్ ఇండియా, జాతీయ కార్మిక సంఘాల జేబీసీసీఐ సమావేశం దిల్లీలో సోమవారం ఏర్పాటు చేశారు. కోల్ ఇండియాలో పనిచేసే కార్మికులకు దసరా ముందు, సింగరేణి కార్మికులకు దీపావళి పండగల ముందు చెల్లించే పీఎల్‌ఆర్ బోనస్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. గత సంవత్సరం రూ.93,750 చెల్లించారు. ఈసారి అంతకంటే ఎక్కువగానే పంపిణీ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది సుమారు రూ.లక్షకు పైనే పంపిణీ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం కొంత పెంచుకుంటూ వస్తున్న కోల్ ఇండియా యాజమాన్యం ఈసారి కూడా పెరుగుదల అంచనా ప్రకారం రూ.లక్ష వరకు చెల్లించే అవకాశం ఉంది.

# ఎరువు కొనరు.. తయారు చేస్తారు

మెట్‌పల్లి : వానాకాలం పంటల అవసరాలకు యూరియా కొరతతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బస్తా ఎరువు కోసం గంటల తరబడి బారులు తీరుతున్నారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన రాజారపు భూమేశ్వర్‌కు మాత్రం అలాంటి చింత లేదు. ఆయన కొన్నేళ్లుగా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. యూరియా అవసరం లేకుండా సహజ ఎరువులను వినియోగిస్తున్నారు. పంటలకు అవసరమైన కషాయాలు సొంతంగా తయారు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

**పంట ప్రయోగాలతో గుర్తింపు** భూమేశ్వర్ గతంలోనే పంటల సాగులో పలు ప్రయోగాలతో గుర్తింపు పొందారు. దాదాపు పదిహేనేళ్ల కిందటే



ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచుకున్నారు. ఆ తర్వాత సమీకృత వ్యవసాయం వైపు మళ్లారు. ఆవులు, గేదెలు పెంచడమే కాకుండా నాటుకోళ్ల ఫారం నిర్వహిస్తున్నా రు. ప్రస్తుతం నాలుగెకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి పండిస్తున్నారు. వానపాములతో వర్మి కంపోస్టు తయారు చేసి పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఆవు మూత్రం, పేడ, బెల్లంతో సొంతంగా జీవామృతం తయారు చేసి నీటితో పాటు పంటలకు అందేలా చూస్తున్నా రు. అంతేకాకుండా వరిలో యూరియాకు బదులు వర్మి కంపోస్టు చల్లడం ద్వారా ఖర్చు తగ్గించుకున్నారు. చీడపీడల నివారణకు నీమాస్త్రం వాడుతున్నారు. రెండెకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్నకు నానో యూరియా వినియోగిస్తున్నారు. కొన్నేళ్లుగా సొంతంగా వర్మి కంపోస్టు, జీవామృతం తయారు చేసి వినియోగిస్తుండటంతో తనకు యూరియా అవసరం రాలేదని భూమేశ్వర్ పేర్కొన్నారు. రైతులు సేంద్రియ విధానానికి మొగ్గు చూపితే పెట్టుబడి తగ్గి మంచి ఫలితాలు వస్తాయన్నారు.

చురకలు



## పేరు గొప్ప.. భద్రత డొల్ల

చర్లపల్లి : చర్లపల్లి రైల్వేస్టేషన్‌నురూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించినా.. కీలకమైన భద్రతా వ్యవస్థను మాత్రం విస్మరించారు. ఈ స్టేషన్ నేరగాళ్లకు నిలయంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ దృష్ట్యా ప్రస్తుతం రైళ్లన్నీ చర్లపల్లి నుంచే వెళ్తున్నాయి. రోజూ 60–70 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. 30–40వేల మంది తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు.

స్టేషన్‌కు 2 ప్రధాన ద్వారాలున్నాయి. ఒకటి దక్షిణం వైపు (కొత్తగా నిర్మించారు), మరొకటి ఉత్తరం వైపు. దక్షిణంవైపు ఎలాంటి తనిఖీలు లేవు. స్కానర్లున్నా.. కొందరు వాటిగుండా వెళ్లడం లేదు. స్కానర్ల అలారం మోగినా పట్టించుకునే వారే లేరు. ఉత్తరం వైపు తనిఖీలు లేకపోగా స్కానర్లు ఏర్పాటు చేయలేదు. ప్రవేశ ద్వారం నిర్మించలేదు. ఎవరైనా రావొచ్చు.. ఎవరైనా పోవచ్చన్నట్లుగా మారింది.

**సిబ్బంది కొరత..** టెర్మినల్‌లో 120 మంది ఆర్‌పీఎఫ్, జీఆర్‌ఎఫ్



సిబ్బంది అవసరం కాగా 20 మందే ఉన్నారు. వీరే చర్లపల్లితో పాటు మౌలాలి, ఘట్‌కేసర్ స్టేషన్లను పర్యవేక్షించాలి. గతేడాది దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ), ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ స్టేషన్ పరిశీలనకు రాగా సమస్యను వివరించారు. త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా.. కార్యరూపం దాల్చలేదు.

**నేరాలకు అడ్డా..**

చర్లపల్లిలో భద్రత లేకపోవడంతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. యూపీ, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి భారీగా గంజాయి నగరానికి సరఫరా అవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి బాల కార్మికులు సైతం పెద్దఎత్తున నగరంలోకి ప్రవేశిస్తున్నారు. గత నెలలో బిహార్ ముఠా తుపాకులు అమ్ముతూ రైల్వే స్టేషన్ పరిసరాల్లో పట్టుబడింది. తాజాగా ఒకరు మహిళను హత్యచేసి మృతదేహాన్ని చర్లపల్లి స్టేషన్‌కు తీసుకొచ్చాడు. 2గంటలు స్టేషన్ ఉత్తర ముఖద్వారం వద్ద తాపీగా కూర్చుని రైలెక్కి వెళ్లిపోయాడు.

టెర్మినల్ స్వరూపం

ప్రధాన ద్వారాలు: 02

ప్లాట్‌ఫాంలు: 09

స్కానర్లు: కేవలం 02

## అలసి'పోతున్న' వలస జీవులు

మేడిపల్లి : కోరుట్లకు చెందిన శ్రీరాముల శ్రీధర్(46) సౌదీ అరేబియా నుంచి ఇటీవల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పారు. అతడి కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విమానంలోనే గుండెపోటుతో కన్నుమూశారని తెలిసి భార్య, ఇద్దరు కూతుళ్లు కన్నీరుమున్నీరుగా రోదించారు.గల్ఫ్ దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతర్, ఇరాక్ దేశాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 3.50 లక్షల మంది ఉన్నారు. ఇందులో వివిధ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య 57 శాతానికి పైగా ఉంటుందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) సర్వేలో తేలింది. సంస్థకు చెందిన సహాయ అధ్యాపకుడు విజయ్ కొర్రా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు గ్రామాలు, యూఏఈలోని కంపెనీల్లో గల్ఫ్ కార్మికుల ఆరోగ్య స్థితిగతులపై సర్వే నిర్వహించారు. తాము అనారోగ్యంతో బాధ పడుతున్నామని జగిత్యాల జిల్లాకు చెందిన 11.4 శాతం మంది వెల్లడించారు. అదే స్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లా వలసజీవులుంటారని అంచనా.

**చికిత్స తీసుకోలేక.. ఇంటికి రాలేక!**

ఆర్థిక పరిస్థితులు అనుకూలించక గల్ఫ్ వెళ్తున్న కార్మికులు ఒంటరి జీవితంతో మానసికంగా కుంగిపోతున్నారు. కంపెనీ యాజమాన్యాలు ఆరోగ్య బీమా లాంటివి వర్తింపజేయక, ప్రైవేటు వైద్యానికి నోచుకోలేక, వ్యాధుల బారిన పడినా అక్కడే ఉండిపోతున్నారు. అనారోగ్య బాధితుల్లో 90 శాతానికి పైగా చికిత్సకు నోచుకోవడం లేదని సర్వేలు చెబుతున్నాయి. అక్కడే మందులు కొనుక్కోవడం, లేదంటే స్వదేశం నుంచి వచ్చేవారితో తెప్పించుకోవడం పరిపాటిగా మారింది.

బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన ఎదురుగట్ల నాగరాజు దుబాయిలో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ పక్షవాతానికి గురయ్యారు. కంపెనీ తరపున ఆసుపత్రిలో చేర్పించి శస్త్రచికిత్స చేయించారు. పక్షవాతానికి గురైన నాగరాజు కుటుంబ సభ్యుల సమక్షంలో త్వరగా కోలుకుంటారని కంపెనీ వారు స్వగ్రామానికి పంపారు. దుబాయిలోని ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వారు నాగరాజు కుటుంబానికి గత నెలలో రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. మల్లాపూర్ మండలానికి చెందిన పోపుల నరేశ్(23) ఉపాధి కోసం



బహ్రెయిన్ వెళ్లారు. మే నెలలో తీవ్ర అనారోగ్యంతో అక్కడే మృత్యువాత పడటం కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది.

**మృతుల్లో ఉమ్మడి జిల్లావాసులే అధికం**

గల్ఫ్ దేశాల్లో భవన నిర్మాణ రంగంలో 48 డిగ్రీలకు పైగా ఎండలో పని చేస్తూ కార్మికులు డీ హైడ్రేషన్‌కు గురవుతున్నారు.చర్మ, శ్వాస సంబంధిత, వెన్ను, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మూత్రపిండ వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతోంది.అధిక రక్తపోటుతో పక్షవాతం బారిన పడుతున్నారు. గతేడాది రాష్ట్రానికి చెందిన 20 మంది గల్ఫ్‌లో బ్రెయిన్ డెడ్ అయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.2023 డిసెంబరు 7 తర్వాత మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున అందిస్తోంది.ఈ ఏడాది మార్చి వరకు రాష్ట్రానికి చెందిన 169 మంది మృతి చెందినట్లు గుర్తించగా అందులో 70 మందికి పైగా ఉమ్మడి జిల్లావాసులే. మొత్తం మృతుల్లో 50 శాతం అనారోగ్య బాధితులేనని తెలుస్తోంది.

**ఆరోగ్యపరమైన జాగ్రత్తలతోనే క్షేమం**

గల్ఫ్ వెళ్లిన వారు మాంసాహారం ఎక్కువ తీసుకుంటారు. దాన్ని తగ్గించి క్రమబద్ధమైన ఆహారం తీసుకోవాలి. స్వదేశానికి వచ్చినప్పుడు, అక్కడ ఉన్నప్పుడు పరీక్షలు చేయించుకొని మందులు వాడాలి. గల్ఫ్ దేశాల్లో మధుమేహం, పక్షవాతం, డీహైడ్రేషన్ కేసులు పెరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి తగ్గించుకొని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందులుండవు.డాక్టర్ వేణుబాబు, ఫిజీషియన్, జగిత్యాల

## సకాలంలో సాఫీగా పూర్తయ్యేనా?



వేములవాడ : ఆగుతూ, సాగుతూ, కూలుతూ చివరికి అసంపూర్తిగా ఉన్న మూలవాగు వంతెన నిర్మాణం ఈసారైనా అందుబాటులోకి వచ్చేనా! అని రాజన్న భక్తుల్లో, పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల మిగులు పనులు తిరిగి మొదలయ్యాయి. ప్రభుత్వం కొత్త గుత్తేదారుకు పనులు అప్పగించింది. ఏడాది కాలంలో పూర్తి చేసేందుకు నిర్ణయించారు.**రూ.28 కోట్ల కేటాయింపుతో..**

వేములవాడకు భక్తుల రద్దీ ఏటేటా పెరుగుతుండటంతో మూలవాగు వంతెనపై ప్రస్తుతం ఉన్న పాత వంతెనకు ఇరువైపులా రెండు కొత్త వంతెనలు నిర్మాణం చేయాలనే లక్ష్యంతో 2015లో కోర్ నెట్ నిధులు రూ.28 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రెండు వంతెనల నిర్మాణాలకు రూ.12 కోట్లు కేటాయించారు. ఆధ్యాత్మికత ఉట్టి పడేలా డిజైన్ చేశారు.

పడమటి వైపు వంతెన నిర్మాణం పూర్తి చేసి 2019లో వినియోగంలోకి తీసుకువచ్చినప్పటికీ తూర్పు వైపు కొత్త వంతెన నిర్మాణంలో జాప్యం జరిగింది. గతంలో భారీ వర్షాలకు మూడుసార్లు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయాయి. ఓసారి పిల్లర్ల భీములు కూలిపోయి చివరికి పనులు నిలిచి పోయాయి.

కొత్త వంతెనలు 2018లోనే పూర్తి కావాల్సి ఉంది. ఏటా భారీ వర్షాలతో కారణంగా కష్ట నష్టాలు ఏర్పడటంతో గుత్తేదారు చేతులెత్తేశారు. దీంతో విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని మిగులు పనుల పూర్తికి రూ.6.50 కోట్ల నిధులను ఇటీవల మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారు.


వంతెన నిర్మాణంలో మొత్తం అయిదు స్టాండ్లలో ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. వర్షాలు తగ్గితే పనులు ఉపందుకోనున్నాయని అధికారులు చెబుతున్నా.. జాప్యం జరగకుండా పూర్తి చేయాలని భక్తులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**ఏడాదిలో పూర్తి**

అనిల్, ఏఈ, ఆర్అండ్‌బీ, వేములవాడ

మూలవాగులోని అసంపూర్తి వంతెన మిగులు పనులు ఏడాదిలో పూర్తి అవుతాయనే నమ్మకం ఉంది. గతంలో పనులు చేసిన గుత్తేదారును తొలగించి మిగులు పనులు కొత్త గుత్తేదారుకు అప్పగించాం. ఒప్పందం ప్రకారం ఏడాదిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

## సాఫీగా గమనం.. గమ్యం!



హైదరాబాద్: నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారుల విస్తరణ లేకపోవడం, నిబంధనల ఉలంఘనులతో ఏటా ప్రమాదాలు జరుగుతున్నాయి. మృతుల్లో 66 శాతం మంది 18–34 ఏళ్ల మధ్య వయసు వారు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలి వర్షాలకు బల్కంపేట్ వద్ద రైల్వే ఓవర్ వంతెన కింద వరదనీటికి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి.. సాఫీగా ప్రయాణం సాగేందుకు ట్రాఫిక్ యంత్రాంగం దిద్దుబాటు చర్యలకు సిద్ధమైంది. ఎప్పటికప్పుడు వాహనదారులను అప్రమత్తం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నారు. నగర పోలీసులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) నిర్వహించిన ట్రాఫిక్ సమ్మిట్ 2025లో పాల్గొన్న వివిధ రంగాల నిపుణుల సూచనలు, సలహాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

**ఉల్లంఘనులపై కొరడా**

రద్దీగా ఉండే 100కుపైగా మార్గాల్లో వాహనదారులు అపసవ్య దారిలో ప్రయాణిస్తున్నారు. యూటర్న్‌లు దూరంగా ఉండటం.. తిరిగి వచ్చేందుకు సమయం వెచ్చించాల్సి ఉంటుందనే ఉద్దేశంతో రాంగ్‌రూట్‌లో రాకపోకలు సాగిస్తున్నారు. అపసవ్యదశలో ప్రయాణించే వారిని కట్టడి చేసేందుకు ఆ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి చలానాలు విధించనున్నారు. కాలంచెల్లిన వాహనాలు తరచూ ఫ్లై ఓవర్లు, ప్రధాన మార్గాల్లో మొరాయిస్తున్నాయి. అప్పుడు వాటిని తొలగించేందుకు సమయం పడుతోంది. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. హైరైజ్ కెమెరాలతో వాటిని గుర్తించి తొలగిస్తున్నారు. మైనర్ల డ్రైవింగ్‌ను అదుపు చేసేందుకు వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 1000 మంది డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయించారు.

**క్షణాల్లో సమాచారం..**

హైదరాబాద్ ట్రాఫిక్ పల్స్ పేరిట కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నారు. మరో 10 రోజుల్లో ఇది వినియోగంలోకి రానుంది. 'తాన్లా' సహకారంతో రూపుదిద్దుకుంటున్న పోర్టల్‌లో ముందుగా వాహనదారులు తమ పేరు, ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తాము ప్రయాణించే మార్గాల వివరాలను జత చేయాలి. సభ్యులుగా చేరాక వారి వాట్సప్ నంబరుకు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమాచారం చేరుతుంది. వర్షం కురిసినా, వీఐపీ పర్యటనలు, ఊరేగింపులు, ఆందోళనలు చేపట్టిన సమయంలో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ పరిస్థితిపై ఫొటోలు, వీడియోల రూపంలో సమాచారం అందజేస్తారు. గమ్యం చేరేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తారు. అన్ని ప్రభుత్వ విభాగాల సహకారంతో నిర్ణయాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

నగరంలో వాహనాలు: 91 లక్షలు

రోజూ కొత్తగా రోడ్డెక్కెవి: 1600

ఇతర జిల్లాల నుంచి వచ్చేవి: 20–25 లక్షలు

## బాల్యంపై వ్యాధుల ముసురు


హైదరాబాద్: గ్రేటర్‌లో వరుస వానలతో చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం కన్పిస్తోంది. వరద నీరు నిల్వ...ఇళ్లు మునిగిపోవడం వంటి ప్రాంతాల్లో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సంస్థ హకీంపేట్, టోలిచౌకి, రాజేంద్రనగర్, కిషన్‌బాగ్, కాలాపత్తర్, ఎర్రకుంట, షహీన్‌నగర్, పహడిషరీఫ్, జల్‌పల్లి తదితర బస్తీల్లో రెండు నెలలుగా నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం తేలింది. మొత్తం 64,471 మంది చిన్నారులకు తమ క్లినిక్‌ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఓపీకి వచ్చిన వారిలో దాదాపు 40 శాతం మంది శ్వాసకోశ, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారు. బ్యాక్టీరియా, వైరస్ కారణంగా తలెత్తే న్యుమోనియా, బ్రాంకైటీస్‌తో ఎక్కువ మంది బాధపడుతున్నారు. చాలామంది దగ్గు, జ్వరం, ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా 300 మంది టైఫాయిడ్ బారిన పడినట్లు పరీక్షల్లో తేలింది. వానలతో నీరు, ఆహారం కలుషితమవడమే ఇందుకు కారణం. చాలా బస్తీల్లో వాన నీరు నిల్వతో దోమలు వృద్ధి చెంది డెంగీ బారిన పడుతున్నారు. చాలామంది చిన్నారులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చికిత్స అందించామని, పరిస్థితి తీవ్రతను బట్టి కొందరిని నిలోఫర్‌కు పంపినట్లు హెచ్‌హెచ్‌ఎఫ్ ప్రతినిధులు తెలిపారు.

ఏ వయస్సు వారు ఎంతమంది

5 ఏళ్లలోపు 40 శాతం

5–10 ఏళ్లు 24 శాతం

10–14 ఏళ్లలోపు 36 శాతం



పిల్లల్లో తీవ్రమైన వ్యాధుల శాతం ఇలా...

న్యూమోనియా, బ్రాంకైటీస్ 40 శాతం

కండ్లకలక 3.5 శాతం

దంతాల్లో ఇబ్బందులు 4 శాతం

చిన్న గాయాలు 11 శాతం

టైఫాయిడ్ 300 మంది

## వారసత్వ భూముల్లో వివాదం!

ఖమ్మం : తెలంగాణ భూభారతి చట్టం అమల్లోకి వచ్చినా వారసత్వ భూములపై పట్టా హక్కులు నిర్ధారించటంలో రెవెన్యూ అధికారులు తలపట్టుకుంటున్నారు. వ్యవసాయ భూముల పంపకాల్లో వారసుల మధ్య కుదరని ఏకాభిప్రాయం, విరాసత్ పత్రాలు రాసుకుని అంగీకారం తెలుపుతూ సంతకాలు చేయటంలో వెనకంజ వేయటంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. గత మే నెలలో జిల్లాలోని 21మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వారసత్వంగా సంక్రమించిన భూములకు పట్టాలు ఇప్పించాలని 6,106 దరఖాస్తులు అందగా వాటిలో 4047 పెండింగ్‌లో ఉన్నాయి.

**ఎందుకిలా?**

1. తాత, తండ్రి నుంచి కుమారులకు వారసత్వంగా భూమిపై హక్కులు సంక్రమిస్తాయి. చట్టంలో ఆడపిల్లలకు ఆస్తి హక్కు కల్పించిన దృష్ట్యా సోదరులు భూములు పంచుకున్నా ఆడపిల్లలు సైతం సంతకాలు చేయాలి. చాలా కుటుంబాల్లో ఇక్కడే సమస్య వస్తోంది. భూమిలో తమకూ వాటా వస్తుందని ఆడపిల్లలు అంటుండగా, పెళ్లి సమయంలో నగదు, బంగారం రూపంలో తమ తండ్రి అప్పగించారని, భూవాటా



సరికాదని సోదరులు వాదిస్తున్నారు. ఆడపిల్లలు సంతకం లేని పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయలేమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

2. కొన్ని కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. అన్న లేదా తమ్ముని చదువుకో, వ్యాపారానికో ఉమ్మడి ఆస్తిలో తండ్రి ఎక్కువగా డబ్బు వెచ్చించారని, అందువల్ల భూమిలో వాటా తక్కువగా వస్తుందని కొందరు వాదిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉన్నందున మినహాయించుకోవాలని మరికొందరు మెలిక పెడుతున్నారు.

3. వారసత్వంగా భూమి పొందాలంటే పట్టాదారుగా ఉన్న తల్లి లేదా తండ్రి లేదా తాత మరణ ధ్రువీకరణ పత్రం కచ్చితంగా సమర్పించాలి. చాలామంది దగ్గర ఇవి లేవు. ఆర్డీఓ స్థాయిలో వాటిని జారీ చేయాలి. దీని విచారణ, ధ్రువీకరణకు చాలా సమయం పడుతుంది. ఇవన్నీ అపరిష్కృత దరఖాస్తులకు కారణమవుతున్నాయు.

## నీటి వనరులకు ఊతం.. అమృత్ 2.0

నేరేడుచర్ల : పురపాలికల్లో చెరువుల ఆధునికీకరణ పనులకు అమృత్ 2.0 కింద పురపాలకశాఖ నిధులు కేటాయించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లో 20 చెరువుల అభివృద్ధికి రూ.54.73 కోట్లు వెచ్చించనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.22.39 కోట్లు, రాష్ట్రప్రభుత్వం రూ.27.36 కోట్లు, ఆయా పురపాలికలు రూ.4.98 కోట్లు వెచ్చిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్యాకేజీల్లో 142 చెరువుల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే టెండర్లు ఖరారుకాగా అగ్రిమెంట్లు సైతం పూర్తయ్యాయి.

**చేపట్టే పనులు...**

నీటి వనరుల వద్ద కట్టలను పటిష్ఠం చేస్తారు. భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చినప్పుడు గండ్లు పడకుండా నివారించేందుకు రాళ్లతో రివిట్‌మెంట్ ఏర్పాటు చేస్తారు. ఒకవైపు పూర్తిస్థాయిలో రెయిలింగ్, మరోవైపు ఫెన్సింగ్ ఏర్పాటు ఉంటుంది. పరిసర ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటి సంరక్షిస్తారు.

చేయాల్సిందేమిటి: పురపాలికల్లో పలు చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. నీటిపారుదలశాఖ రెవెన్యూశాఖ సహకారంతో తొలుత ఈ చెరువుల సర్వే చేపట్టాలి. పూర్తిస్థాయిలో హద్దులు గుర్తించి పనులు చేపడితే ఆక్రమణల బెడద ఉండదు. నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఆధునికీకరణ పనులతో చెరువులకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులు చేపడుతోంది.టెండర్లు ఖరారు కె.వెంకటేశ్వర్లు, ఎస్ఈ, ప్రజారోగ్యశాఖ, నల్గొండఅమృత్ 2.0 కింద పురపాలికల్లో చేపడుతున్న చెరువుల అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి. అగ్రిమెంట్లు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఈపనులన్నీ ఒకే ప్యాకేజీలో చేపడుతున్నాం.

## పండుగ ప్రయాణం..జాగ్రత్తలతో సురక్షితం

సూర్యాపేట: బతుకమ్మ, దసరా పండుగలు ఉత్సాహంగా జరుపుకొనే అతి పెద్ద వేడుకలు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు స్వగ్రామాలకు తరలి వెళుతుంటారు. ఊళ్లలో ఉన్నవారు నూతన దుస్తులు, ఇతర కొనుగోళ్లకు పట్టణాలకు వస్తుంటారు. దీంతో రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా కనిపిస్తున్నాయి. ఆనందక్షణాలు కోల్పోకుండా.. కుటుంబీకులు కంటతడి పెట్టకుండా ఉండేలా మీ ప్రయాణం సురక్షితంగా సాగాలి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రధాన రహదారులున్నాయి. హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–వరంగల్ నేషనల్ హైవేలతో పాటు పలు మార్గాల్లో రోడ్డు నిబంధనలు పాటించాలి. రహదారులు మరమ్మతులు జరుగుతున్న చోట్ల, బ్లాక్ స్పాట్ల వద్ద మరింత జాగ్రత్తగా వాహనాలు నడపాలి.

**సరిచూసుకోవాలి..**కార్లలో వచ్చే వారు ఇంటి నుంచి బయలుదేరే ముందు తమ వాహనాన్ని సరిచూసుకోవాలి. అవసరమైతే మెకానిక్ వద్దకు వెళ్లి చూపించాలి. చీకటి పడకముందే గమ్యాన్ని చేరేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.వాహన లైట్లు, ఇంజిన్ సామర్థ్యం, బ్రేకులు పనిచేస్తున్నాయా లేదా సరిచూసుకోవాలి. టైర్ల పరిస్థితిని పరిశీలించి, స్టెప్నీ, జాకీ, టూల్ కిట్ అందుబాటులో ఉంచుకోవాలి. కూలెంట్ సరిపడా ఉందా చూసుకుని, లీకేజీలు సరిచేసుకోవాలి.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి. మద్యం తాగి వాహనం నడపకూడదు. వేగ పరిమితి అతిక్రమించొద్దు. కారులో ప్రయాణం చేసేవారు సీట్‌బెల్టు, ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు శిరస్త్రాణం ధరించాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపొద్దు. ఆ సమయంలో గంటగంటకూ కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలి. వాహన పత్రాలు వెంట ఉండేలా చూసుకోవాలి.

హైదరాబాద్–విజయవాడ: ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం నుంచి కోదాడ వరకు దాదాపు 150 కి.మీ. ఎన్‌హెచ్ 65వ జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ దారి పొడవునా 22 వరకు బ్లాక్‌స్పాట్లు ఉన్నాయి. ప్రస్తుతం ధర్మోజిగూడెం, చౌటుప్పల్ పట్టణం, పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూర్ జంక్షన్(నల్గొండరోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, ఎస్వీ కళాశాల(జనగామ కూడలి), జమ్మిగడ్డ, దురాజ్‌పల్లి, ముకుందాపురం(యూటర్న్ మునగాల), కొమరబండ, కోదాడ, మేళ్లచెరువు పైవంతెన శ్రీరంగాపురం వద్ద(అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు పనులు) రహదారి పనులు జరుగుతున్నాయి. వీటి వద్ద నెమ్మదిగా ప్రయాణించాలి.హైదరాబాద్–భూపాలపట్నం: ఉమ్మడి జిల్లాలో బీబీనగర్ మండలం కొండమడుగుమెట్టు నుంచి ఆలేరు మండలం టంగుటూర్ శివారు 48 కి.మీ. పొడవునా 163వ జాతీయ రహదారి విస్తరించింది. ఈ మార్గమధ్యలో 11 చోట్ల బ్లాక్‌స్పాట్లను అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు సురక్షితంగా ప్రయాణం సాగించాలి.

## తొలగనున్న అంతరాయం.. ప్రయాణం వేగవంతం

తాండూరు: జిల్లాలోని తాండూరు, వికారాబాద్, ధారూర్, బషీరాబాద్, మంతటి, రుక్మాపూరు, గోధుమగూడ రైల్వే స్టేషన్ల నుంచి ఇక అంతరాయం లేకుండా రైలు ప్రయాణాలు సాగనున్నాయి. దీనికితోడు సరకు రవాణా రైళ్లు నిర్ణీత స్టాప్‌లో తప్ప ఎక్కడా ఆగవు. ప్రయాణికులు, సరకు రవాణాకు ప్రయోజనం కలిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కర్ణాటక, తెలంగాణ, బిహార్, అసోం రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్‌తోపాటు సుదూర ప్రాంతాన్ని అనుసంధానించే రైలుమార్గం నిర్మించడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం నిర్ణయం తీసుకొంది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్– వాడి మార్గంలో కొత్తగా 3, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

**సిమెంటు కర్మాగారాలకు ప్రయోజనం..:** కొత్తగా మరో రెండు రైల్వేలైన్ల నిర్మాణంతో తాండూరులోని సిమెంటు కర్మాగారాలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. తాండూరు సమీపంలో సీసీఐ, ఇండియా సిమెంట్స్, పెన్నా.. సమీపంలోని కర్ణాటక రాష్ట్రంలో వికాట్‌సాగర్, చెట్టినాడు సిమెంటు కర్మాగారాలున్నాయి. వీటికి సికింద్రాబాద్– వాడి మార్గం నుంచే గూడ్సు రైళ్ల ద్వారా బొగ్గు, క్లింకర్ తదితర ముడి



సరకు దిగుమతి అవుతుంటుంది. కర్మాగారాల్లో ఉత్పత్తి అయిన సిమెంటు గూడ్సురైళ్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు. లైన్లు పెరగనుండడంతో రవాణా వేగవంతం కానుంది. ప్రజల ప్రయాణాలకు ఆటంకాలు తొలగనున్నాయి.

**ప్రస్తుతం రెండే లైన్లు..:** సికింద్రాబాద్– వాడి మార్గంలో ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉన్నాయి. ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగించే వేళ గూడ్సు రైళ్లు గంటల తరబడి ఆగాల్సి వస్తోంది. కొన్నిసార్లు ప్రయాణికుల రైళ్లూ స్టేషన్‌లోనే నిలిచిపోతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి 1, 2వ లైన్లకు అదనంగా 3, 4 నిర్మించనున్నారు. రెండు లైన్లపై నుంచి ప్రయాణికులకు సంబంధించినవి, మరో రెండు లైన్లపై గూడ్సు రైళ్లు రాకపోకలు సాగిస్తాయని రైల్వేశాఖ ఇంజినీరు తెలిపారు.

## బియ్యమిస్తాం.. స్థలమేదీ?

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లు సిద్ధంగా ఉన్నా.. ఖాళీ స్థలాలు లేక సంబంధిత ఏజెన్సీలు తీసుకోని విచిత్రమైన పరిస్థితి నెలకొంది. 2024–25 వానాకాలంలో సేకరించిన ధాన్యానికి మే 15 వరకు సీఎంఆర్ ఇవ్వడానికి గడువు ఇచ్చారు. ఈ లోపు చాలా మంది చెల్లించలేదు. ఎఫ్‌సీఐ తిరిగి అనుమతి ఇవ్వకుండా మూడు నెలల పాటు జాప్యం చేసింది. మిల్లులు నడవలేదు. మూడు నెలల తదుపరి సెప్టెంబరు 12 వరకు పొడిగిస్తూ ఎఫ్‌సీఐ ఆగస్టు 12న ఉత్తర్వులు ఇచ్చింది. స్వల్పకాలంలో పూర్తయ్యేలా కనిపించడం లేదు.గత వానాకాలంలో జిల్లాలో 2.20 లక్షల ఎంటీల ధాన్యం ఇవ్వగా మిల్లర్లు 1.50 లక్షలు ఎంటీల సీఎంఆర్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. కానీ మే 15 వరకు 1.04 లక్షల ఎంటీలు చెలించారు. ఇంకా సుమారు 46 వేల టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కానీ సెప్టెంబరు 12 వరకు సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు.బియ్యం నిల్వ చేసేందుకు ఎఫ్‌సీఐ వద్ద స్థలం లేక ప్రక్రియ వేగంగా జరగడం లేదు. మిల్లులలోనే వేల బస్తాల బియ్యం పేరుకుపోయింది. ఒక్కో మిల్లులో సుమారు 150 నుంచి 200 టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు అంచనా.

భువనగిరి మండంలోని నాగిరెడ్డిపల్లి బఫర్ గోదాంలో ఎఫ్‌సీఐకి సుమారు 50 వేల ఎంటీల నిల్వ చేసే స్థలం మాత్రమే ఉంది. ఇప్పటికే



పూర్తిస్థాయిలో నిండిపోయింది. అక్కడికి వ్యాగన్లు వచ్చి నిల్వలు తరలిస్తే తిరిగి బియ్యం సేకరించే అవకాశం ఉంది.

ఇక రబీ సీజన్‌లో కూడా 3.70 లక్షల ఎంటీల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం 42 మిల్లులకు ఇచ్చారు. 2.58 లక్షల ఎంటీల బాయిల్డ్ రైస్‌ను మిల్లర్లు తిరిగి పెట్టాలి. ఇప్పటి వరకు సుమారుగా 87 వేల టన్నులు సీఎంఆర్‌ను సేకరించారు. దీనికి కూడా స్థలం లేక మిల్లర్లు సీఎంఆర్ పెట్టలేకపోతున్నారు. జిల్లాలోని మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం రోజుకు 4 నుంచి 12 ఎంటీల వరకు ఉంది. ఆ మేరకు ఎఫ్‌సీఐకి నిల్వ సామర్థ్యం లేదు. బియ్యం సేకరణ ఆలస్యమైతే పక్కదారి పట్టే అవకాశం ఉందని అధికారులు అందోళన చెందుతున్నారు. స్థలం కేటాయింపునకు ఎఫ్‌సీఐ అధికారులతో సంప్రదిస్తున్నామని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గోపిరెడ్డి వీరారెడ్డి తెలిపారు.

## అలలు ఎగిసే... మది మురిసే



నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద కొనసాగుతుండటంతో అధికారులు 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 3,18,791 క్యూసెక్కుల నీరు జలాశయానికి వస్తుంది. సాగర్ నుంచి 26 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 2,01,604, ప్రధాన విద్యుత్తు కేంద్రం ద్వారా 33,454, కుడి కాల్వ ద్వారా 9,019, ఎస్సెల్బీసీ ద్వారా 2,400, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం ప్రస్తుతం 586.70 అడుగుల వద్ద ఉంది. ఇది 303.9495 టీఎంసీలకు సమానం. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో వర్షాలు పడుతుండటంతో ఎడమ కాల్వకు నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

# ప్లా'స్టిక్' అయితే ప్రమాదమే



హైదరాబాద్: ప్లాస్టిక్ అనర్థాల వల్ల కలిగే నష్టాల్లో మహానగరం కూరుకుపోయింది. రోజువారీ ఉత్పత్తయ్యే ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం రోజుకు రోజుకు పెరుగుతోంది. అందులో సగానికిపైగా భూమిలోనే కలుస్తోంది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాలను ప్లాస్టిక్ మహమ్మారి ముంచేస్తోంది. నగర వాతావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ముంపు సమస్యకు ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రధాన కారణమని ఇంజినీరింగ్ విభాగం, పారిశుద్ధ్య విభాగాలు ఉమ్మడిగా చేపట్టిన సంయుక్త అధ్యయనంలో స్పష్టమైంది.

**చెరువులు, నాలాలు కలుషితం**

చెత్తలో పడుతోన్న ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే అధికారులు లెక్కగట్టారు. చెరువులు, నాలాల్లోకి చేరుతోన్న ప్లాస్టిక్ వ్యర్థాలు వాటికి అదనం. అవి పూడిక మట్టిలో కలిసిపోతున్నాయి. బల్దియా చేపట్టే పూడికతీత పనులతో కొంత ప్లాస్టిక్ డంపింగ్‌యార్డుకు చేరుతుండగా.. మెజారిటీ వ్యర్థాలు జలవనరుల్లో ఉండిపోతున్నాయి. నేలపై ఒక పొరలా ఏర్పడుతున్నాయి. కల్వర్టులను, పైపులైన్లను పూడ్చేస్తున్నాయని ఇంజినీరింగ్ విభాగం ఆందోళన వ్యక్తం చేసింది.

**స్వచ్ఛ ఆటోలతో ప్రయోజనం..**

ఇంటింటి చెత్త సేకరణలోని స్వచ్ఛ ఆటోలకు చెత్తను ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉంది. ఆటో కార్మికుల కోసం నగరంలో వేర్వేరు చోట్ల జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎసీ(డ్రై రిసోర్స్ సెంటర్స్)లను నిర్మించింది. ఆటోలోని వ్యర్థాలను అందులో పోసి.. ప్లాస్టిక్, గాజు, లోహం, కర్ర, కాగితం వంటి రీసైకింగ్‌కి పనికొచ్చే వ్యర్థాలను కార్మికులు వేరు చేస్తారు. తద్వారా రోజూ 30 టన్నుల రీసైక్లింగ్ వస్తువులు పునర్వినియోగానికి మళ్లుతున్నాయి.

**పెరుగుతున్న చెత్త..**నగరంలో 2019లో రోజువారీ ఉత్పత్తయ్యే చెత్త పరిమాణం 3,800 టన్నులు ఉండేది. అప్పట్లో సగటున ఒక వ్యక్తి ఉత్పత్తి చేసే వ్యర్థాలు 570 గ్రాములు. ప్రస్తుతం రోజూ 8 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో సగటు వ్యక్తి ఉత్పత్తి చేసే చెత్త 733 గ్రాములు. ఒక కుటుంబం 2.2 కేజీల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోంది. ఇప్పటికే జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డు కిక్కిరిసిపోయింది. వ్యర్థాలను నిల్వ చేసేందుకు స్థలం లేక అధికారులు నానా అవస్థలు పడుతున్నారు.**పరిష్కారం ఏంటంటే..** ఇటీవలి వరదలతో బల్దియా పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ విభాగాలు ప్లాస్టిక్ ముప్పుపై చేపట్టిన అధ్యయనం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ప్లాస్టిక్ నియంత్రణ, వరద నాలాల విస్తరణ, చెరువుల పునరుద్ధరణ, కొత్త వ్యర్థాల యాజమాన్య కేంద్రాలు ఏర్పాటు, చెత్త నుంచి విద్యుదుత్పత్తి కేంద్రాలను నగరం నలువైపులా నిర్మించే కార్యక్రమాలను కమిషనర్ వేగవంతం చేస్తున్నారని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

# మాఫ్ పేరుతో సాఫ్



హైదరాబాద్ : బల్దియాలో ఇంటి దొంగలున్నారని మరోసారి తేలింది. ఉన్నతాధికారుల కళ్లుగప్పి చందానగర్ సర్కిల్‌లోని పౌర సేవా కేంద్రం (సీఎస్‌సీ) ఉద్యోగిని రూ.56 లక్షలు కాజేసింది. ఆడిట్ అధికారులు గుర్తించడంతో ఒకరోజు వ్యవధిలోనే ఆమె మొత్తం డబ్బును తిరిగి చెల్లించింది. అయితే అంతా ఒకేసారి చెల్లించడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇక్కడే కాదు.. ఇతర సర్కిళ్లలోని పౌర సేవా కేంద్రాల్లోనూ ఈ తరహా దోపిడీ జరుగుతోంది. నోటరీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇవ్వడం, ఆస్తిపన్ను మొండి బకాయిలను మాఫీ చేసే పథకాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో భాగంగా పౌరులు చెల్లించే పన్నులు, రుసుములను సీఎస్‌సీ కేంద్రాల్లో ఉద్యోగులు మాయం చేస్తున్నారు. బల్దియా ఖజానాలో జమ కావాల్సిన నిధులతో జేబులో నింపుకొంటున్నారు.

**రూ.కోట్లలో దోపిడీ..**

సూపర్ స్ట్రక్చర్స్, వీఎల్‌టీ రూపంలో వచ్చే ఆదాయాన్ని కొందరు అధికారులు, సిబ్బంది మింగేస్తున్నారు. ఏటా రూ.10 కోట్లతో జేబు నింపుకొంటున్నారని అంచనా. ఆస్తిపన్ను బకాయిలో సగం చెల్లిస్తే మొత్తం మాఫీ చేస్తామంటూ కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. మరికొందరు.. వాస్తవ విస్తీర్ణాన్ని తగ్గించి పన్ను విలువను తక్కువ చేస్తున్నారు. అనుమతి లేకుండా కట్టే అదనపు అంతస్తులు, అపార్ట్‌మెంట్లకు నామమాత్రపు పన్ను వేస్తున్నారు. వ్యాపార భవనాలను ఇళ్లుగా చూపుతున్నారు. నోటరీ పత్రాలతో క్రయవిక్రయాలు జరిగే వందలాది కాలనీల్లో జారీ అవుతోన్న ఇంటి నంబర్లే నిదర్శనం. ఇటీవల మూసాపేట, అల్వాల్ సర్కిళ్లలోనూ నకిలీ ఇంటి నంబర్ల ఉదంతాలు వెలుగు చూశాయి. వాటన్నింటినీ నియంత్రిస్తే ఆదాయం పెరుగుతుంది.

**లావాదేవీలు తనిఖీ చేయడంతో..**

జీహెచ్‌ఎంసీ మూడేళ్ల కిందట ఆస్తిపన్ను చెల్లింపును నగదు రహితం చేసిందిగానీ.. జీవో 299 ద్వారా సూపర్ స్ట్రక్చర్స్ (నోటరీ స్థలాలు, అనుమతి లేని నిర్మాణాలు, అదనపు అంతస్తులు)కు ఆస్తిపన్ను మదించే ప్రక్రియను, ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) వసూళ్లను అందులో చేర్చలేదు. అదే అదనుగా.. బల్దియా సిబ్బంది, అవినీతి అధికారులు రెచ్చిపోతున్నారు. సర్వేల పేరుతో కనిపించిన ప్రతి ఇంటికి నోటీసు ఇవ్వడం, పన్ను కట్టలేదని, ఇంటి నంబర్లు లేవని యజమానులను బెదిరిస్తున్నారు. వారి నుంచి మూడేళ్ల కాలానికి పన్ను వసూలు చేస్తున్నారు. కొందరు నిబంధనల ప్రకారం పన్ను మదింపు చేస్తున్నారు. మరికొందరు పన్ను మదింపును వసూళ్లకు వాడుకుంటున్నారు. సీఎస్‌సీ కేంద్రాల్లో పన్ను చెల్లించినట్టు రసీదులు సృష్టించి, వాటితో పన్ను మదింపును పూర్తి చేస్తున్నారు. చందానగర్‌లో వెలుగు చూసిన ఉదంతం ఈ కోవలోనిదే. ఇటీవల సీఎస్‌సీ కేంద్రం లావాదేవీలను ఆడిట్ చేసిన అధికారి.. తన ఇంటికి సంబంధించిన లావాదేవీ కనిపించకపోవడంతో కంగుతిన్నారు. లోతుగా విచారణ చేయగా దాదాపు 250కిపైగా ఇంటి నంబర్లకు సంబంధించిన రూ.56 లక్షల పన్ను జీహెచ్‌ఎంసీ ఖాతాలో జమ కానట్లు తేలింది. గత ఉపకమిషనర్ హయాంలో నకిలీ ఇంటి నెంబర్ల జారీ పెద్దఎత్తున జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆయన బదిలీ అవడంతో అవకతవకలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని, ఇతర సర్కిళ్లలోని సీఎస్‌సీ కేంద్రంల్లోనూ ఆడిట్ చేసి, 2020 నుంచి జరిగిన లావాదేవీలను పరిశీలించాల్సి ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై సర్కిల్ ఉపకమిషనర్ శశిరేఖ స్పందిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని 15 ఏళ్లుగా పనిచేస్తోందని, ఏం జరిగిందో తెలుసుకునేందుకు విచారణ చేపట్టామని, నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# సంసార సాగరం.. గొడవలతో కల్లోలం





వికారాబాద్ : 'మా ఆయన రోజంతా బాగానే ఉంటాడు. సాయంత్రం కాగానే మద్యం తాగి అకారణంగా గొడవపడతాడు. పరుష పదజాలంతో దూషిస్తాడు. ఆ మాటలకు నలుగురిలో తలెత్తుకోలేని పరిస్థితి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా పరిస్థితిలో మార్పు లేదు. గత్యంతరం లేక మహిళా ఠాణాను ఆశ్రయించా."మాకు పెళ్లయి 20 ఏళ్లు దాటింది. ఇద్దరు సంతానం. నా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని నన్ను వేధింపులకు గురిచేస్తున్నాడు. పెద్దల సమక్షంలో సర్దిచెప్పినా ప్రవర్తనలో మార్పు లేదు. విసిగిపోయి ఠాణాను ఆశ్రయించా.'.. ఇదీ పలువురు మహిళల ఆవేదన.నిండు నూరేళ్లు కలిసిమెలిసి ఉంటామని ఒక్కటైన దంపతులు తగవులతో విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహిళా ఠాణాకు రోజుకు సగటున 2–3 ఫిర్యాదులు చొప్పున నెలకు 80 వరకు వస్తున్నాయి. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్నిసార్లు గత్యంతరం లేకపోవడంతో కేసులు నమోదు చేస్తున్నారు.

**ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక..**

ఉమ్మడి కుటుంబంలో ఇమడలేక వేరుగా జీవించాలని చాలామంది మహిళలు భావిస్తున్నారు. దీంతో భార్యాభర్తల సమస్యలు పరిష్కరించే వారు లేకపోవడంతో అంతరాలు పెరుగుతున్నాయి. అవి పెద్దవై కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ప్రేమ పెళ్లిల్లు చేసుకున్నవారు చిన్న విషయాలకే ఠాణాలను ఆశ్రయిస్తున్నారు. మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. జీవిత భాగస్వామిపై అనుమానంతో గొడవలు పెట్టుకుంటున్న వారూ ఎక్కువగానే ఉంటున్నారు. మద్యం చాలా కాపురాల్లో చిచ్చు రేపుతోంది. మహిళా ఠాణాకు వచ్చే 30 శాతం కేసుల్లో మద్యం కారణంగా సమస్యలు తలెత్తి విడిపోవాలనుకుంటున్నారు. జీవిత భాగస్వామి సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉంటున్నారని మరికొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. నిరక్షరాస్యత, పేదరికం వివాదాలకు కారణమవుతున్నాయి. ఇలాంటివన్నీ 20 శాతం వరకు ఉన్నాయి.

**చాలా విషయాల్లో నచ్చజెపుతున్నాం..**

– సరోజ, సీఐ, మహిళా ఠాణా, వికారాబాద్

భార్యాభర్తలకు నచ్చజెప్పే పద్ధతి అనుసరిస్తున్నాం. కుటుంబ పెద్దల తరహాలోనే మాట్లాడుతున్నాం. దంపతులిద్దరితో మొదట వేర్వేరుగా మాట్లాడి సమస్య తెలుసుకుంటున్నాం. తరువాత ఇద్దర్నీ కూర్చోబెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. కౌన్సెలింగ్ అనంతరం దాదాపు 90 శాతం మంది కలిసి ఉండడానికి మొగ్గు చూపుతున్నారు. కొందరే న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు.

## వాగుల్లో కాసుల వేట

బొంరాస్‌పేట: ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వివిధ అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకొని వేసవిలో ఇష్టారీతిన ఇసుక తరలించి సొమ్ము చేసుకున్న వ్యాపారులు వర్షాలు ప్రారంభమయ్యాక కొద్దికాలం మిన్నకుండిపోయారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ, ప్రైవేటు పనులు జోరుగా సాగుతుండడంతో అక్రమ రవాణాకు మళ్లీ తెరలేపారు. అధికారులు కేసులు చేస్తున్నా.. జరిమానాలు విధిస్తున్నా లెక్కచేయడం లేదు.

**వర్షాలతో పుష్కలంగా..**

వర్షాలు సమృద్ధిగా కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో ఇసుక భారీగా మేటలు వేసింది. కాగ్నాతోపాటు చిన్న వాగుల్లోనూ ఇసుక పేరుకుంది. ఆ నిల్వలను తరలించడానికి అక్రమార్కులు ప్రణాళికలు వేసుకొని అమలు చేస్తున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. రాత్రిపూట కాకరవాణి వాగు నుంచి ట్రాక్టర్లలో మైదాన ప్రాంతానికి తెచ్చి నిల్వ చేస్తున్నారు. అదేరాత్రి టిప్పర్లు, లారీల్లో లోడు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ట్రాక్టర్ల యజమానులూ మహంతిపూర్, మద్దిమడుగు, బొంరాస్‌పేట శివారు ప్రాంతంలోని వాగు పరివాహకం నుంచి ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.3500 నుంచి రూ.4వేల వరకు ధర పలుకు



తోంది. వర్షాకాలం కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువగా నిర్మిస్తుండడంతో ఇసుకకు గిరాకీ పెరిగింది.

**రాత్రికి రాత్రే తరలింపు**

గతంలో అనుమతులు తీసుకొని వాటినే మళ్లీ మళ్లీ చూపుతూ.. దోపిడీకి పాల్పడేవారు. ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. పగలు వాగు నుంచి తరలించి నిల్వ చేస్తే అధికారులు పట్టుకుంటున్నారని రూటు మార్చారు. దేవులానాయక్ తండా సమీపంలో రాత్రి వాగు నుంచి తరలించి టిప్పర్లలోకి నింపి రవాణా చేస్తున్నారు. మే నెలలో రెండు, జులై, ఆగస్టులో నాలుగేసి చొప్పున ఇసుక తరలించే వాహనాలను పట్టుకొని పోలీసులు కేసులు నమోదు చేశారు. పెడచెవిన పెట్టిన అక్రమార్కులు మళ్లీ అదే పనిలో నిమగ్నమవుతున్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా..** –పద్మావతి, తహసీల్దార్

ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. ఎవరైనా తరలిస్తే విచారణ చేయిస్తాం. ఎక్కడినుంచైనా అక్రమంగా తరలిస్తే వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగిస్తాం. అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానాలూ విధిస్తున్నాం.

## హద్దులు తేల్చరు.. ఆక్రమణలు ఆగవు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామంలో అటవీ భూమిని ఆక్రమించారంటూ ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అది తమ పూర్వీకుల నుంచి వచ్చిందేనని, అటవీ అధికారులు తమను దూషించారంటూ సాగుదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, అటవీ శాఖ భూముల మధ్య హద్దులు తేలకపోవడంతో పరస్పరం కేసులు నమోదయ్యాయి. జిల్లాలో చాలా అటవీ గ్రామాల్లో ఇదే పరిస్థితి.

**పట్టాలు కొంత. కబ్జా కొండంత**

2005లో అటవీ హక్కుల చట్టం పథకం ద్వారా గిరిజనులు, గిరిజనేతరులకు 424 ఎకరాలకు పట్టాలు అందించారు. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో 166 మందికి 332.14 ఎకరాలు, మంగెళలో 60 మందికి 87.18 ఎకరాలు, తుంగూర్‌లో 13 మందికి 14.12 ఎకరాలకు సంబంధించి అటవీ భూములకు పట్టాలు అందించారు. చర్లపల్లి, తంగూర్, కందెనకుంట, కమ్మునూర్, రంగసాగర్, కండ్లపల్లితో పాటు ప్రతి గ్రామంలో వందల ఎకరాల్లో అటవీ భూమిని అక్రమంగా సాగు చేసుకుంటున్నా వివరాలు తేలడం లేదు. పోడు భూముల వివరాల సేకరణలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సర్వే చేపట్టారు. అప్పట్లో 11 మండలాల్లోని 53 గ్రామాల్లో 9,437 ఎకరాల పోడు భూముల కోసం 4,829 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే సమయంలో మరింత ఆక్రమణకు గురైంది.

**శాఖల మధ్య సమన్వయ లోపం**

జిల్లాలో 59,735 హెక్టార్లలో అటవీ భూములుండగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 12,789 హెక్టార్లలో ఉంది. రెవెన్యూ శాఖలోని లొసుగులే ఆసరాగా కొన్నేళ్లుగా 6,684.16 ఎకరాల్లో అటవీ భూములను ఆక్రమించినట్లు అధికారులు ప్రకటించారు.



ఇందులో అత్యధికంగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 4,120 ఎకరాలుందని రెవెన్యూ శాఖ నిర్వహించిన భూ ప్రక్షాళనలో తేల్చారు. బీర్‌పూర్‌లో 3,662 ఎకరాలు, సారంగాపూర్‌లో 458.35 ఎకరాలు వివాదంలో ఉన్నట్లు భూ ప్రక్షాళనలో చూపారు.

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఏళ్లు గడుస్తున్నా సర్వే చేపట్టడం లేదు. సారంగాపూర్, బీర్‌పూర్, మెట్‌పల్లి తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో అటవీ భూమి ఆక్రమణకు గురవుతోంది.

బీర్‌పూర్ మండలం చర్లపల్లిలో 850 ఎకరాలు, తాళ్లధర్మారంలో 1082 ఎకరాలు, తుంగూర్‌లో 305 ఎకరాలు, కమ్మునూర్‌లో 290.11 ఎకరాలు, నర్సింహులపల్లెలో 140 ఎకరాలు, కండ్లపల్లిలో 40 ఎకరాలు, బీర్‌పూర్‌లో 19, రేకులపల్లెలో 80 ఎకరాలు వివాదంలో ఉన్నట్లు గుర్తించారు. రెండు శాఖల భూములకు హద్దులు నిర్ణయించక పోవడంతో అటవీ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది.

**రెవెన్యూ అధికారులను తరచూ కోరుతున్నాం**

ఆక్రమణకు గురైన అటవీ భూముల హద్దులు తేల్చాలని రెవెన్యూ అధికారులను పదే పదే కోరుతున్నాం. హద్దులు నిర్ణయిస్తే అటవీ శాఖదని తేలితే స్వాధీనం చేసుకుంటాం. ప్రస్తుతం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి, భూములు స్వాధీనం చేసుకుంటున్నాం. హద్దుల ఏర్పాటుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

శ్రీనాథ్, అటవీ శాఖ రేంజి అధికారి

చురకలు



# అవినీతి మస్తు.. అక్రమానికో అంతస్తు

నెల్లూరు :సంతపేట పాత ములుమూడి బస్టాండు సెంటరులో జీ+5 అంతస్తులు నిర్మిస్తున్నారు. చుట్టూ స్థలాన్ని వదల లేదు. విషయం పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ఉద్యోగులకు తెలిసినా స్పందించలేదు. నగరపాలకసంస్థ కార్యాలయానికి కూతవేటు దూరంలోని జీఎన్‌టీ రోడ్డులో పాత భవనంపై మరో రెండు అంతస్తులు అదనంగా నిర్మిస్తున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన అంతస్తులను కూల్చివేయాలి.. సెట్‌బ్యాక్ వదలని వాటికి నోటీసులు ఇవ్వాలి. ఇవేమి జరగడం లేదు.

**ప్రభుత్వం మారినా..** నెల్లూరు నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. అనుమతులు లేని అదనపు నిర్మాణాలే ఆదాయ వనరుగా మార్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. నెల్లూరు నగరపాలకసంస్థలో నిబంధనల ప్రకారం 300 చ.మీ.లోపు స్థలానికి పది మీటర్ల ఎత్తుకు మించి నిర్మాణానికి అనుమతి లేదు. అంతకుమించి కట్టాలంటే డీడీఆర్ బాండ్లు కొనుగోలు చేయాలి. ఇటీవల ప్రభుత్వం బీపీఎస్ తీసుకొస్తామని ప్రకటించడంతో దాన్ని సాకుగా చూపించి ప్లాన్ అప్రూవల్ కోసం వచ్చినప్పుడే అదనపు అంతస్తుల నిర్మాణానికి బేరం కుదుర్చుకుంటున్నారు. అన్ని పత్రాలుండి, నిబంధనల ప్రకారం ఒక అంతస్తుకు రూ.15వేలు వసూలు చేస్తుంటే..



ఇక అనధికార నిర్మాణాలకు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. నగరంలోని జీఎన్‌టీ రోడ్డులో మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు ఉండాలి. కానీ కొన్నిచోట్ల 60 అడుగులు.. మరికొన్ని చోట్ల 80 అడుగులే ఉంది. ఈ రోడ్డు వెంట నిర్మాణం చేపట్టాలంటే భవన దరఖాస్తుదారులు పది అడుగులు స్థలాన్ని సొంత నిధులతో నగరపాలకసంస్థకు రిజిస్టర్ చేయాలి. కానీ ఎక్కడా అమలు కావడం లేదు.

**కింది స్థాయి సిబ్బంది బలి**

అనధికార నిర్మాణాలు చేపట్టినా స్పందించకపోవడంతో ఇటీవల ఇద్దరు ప్రణాళికా కార్యదర్శులను సస్పెండ్ చేశారు. మరికొన్ని చోట్ల అనధికార నిర్మాణాలున్నా వారిపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా అడిగితే నోటీసులిచ్చామని చెబుతున్నారు. రెండోసారి ధ్రువీకరణ నోటీసు, మూడో సారి ఛార్జిషీటు వేయాల్సి ఉన్నా.. వసూళ్లకు పాల్పడటంతో అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏడాది కాలంలో దాదాపు 150 వరకు అక్రమ అదనపు అంతస్తుల నిర్మాణాలు చేశారంటే.. ప్రణాళిక విభాగం అధికారుల తీరు అర్థం చేసుకోవచ్చు.

**నోటీసులు జారీ చేశాం**

అనధికార నిర్మాణాలు చేపడుతున్న భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేశామని, అలసత్వం వహించిన సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని కమిషనర్ నందన్ తెలిపారు.

# కన్నేస్తున్నారు.. కమ్మేస్తున్నారు!

అనకాపల్లి: గత ప్రభుత్వంలో అధికారం అండతో వైకాపా నాయకులు రెచ్చిపోయారు. ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపించినా వదలకుండా పాగా వేశారు. అనకాపల్లిలో శారదా నది ఒడ్డునున్న రూ.కోట్ల విలువ చేసే భూమిని ఆ పార్టీ నేతలు అనుచరులకు నచ్చినట్లు పంచేశారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఇదంతా జరుగుతున్నా అధికారులూ కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన క్షేత్ర సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి కొమ్ముకాస్తూ స్థలాలను ధారాదత్తం చేస్తున్నారు. స్థానిక జడ్పీటీసీ సభ్యురాలి అండదండలతో దందా సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా.. శారదా నది ఒడ్డున కబ్జాలకు అడ్డుకట్ట పడలేదు.

తుమ్మపాల రెవెన్యూ పరిధిలో దొంగ గెడ్డను ఆనుకుని సర్వే నంబరు 582-2, 583-1, 584, 588-4, 590-18, 593-3, 597లో 11 ఎకరాలను జిల్లా పరిషత్తు గతంలో కొనుగోలు చేసింది. ఇందులో 3.4 ఎకరాల భూమిని ముత్రాసుకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలకు కేటాయించారు. ఈ పాఠశాలను భవిష్యత్తులో జడ్పీ పాఠశాలగా ఉన్నతీకరించాలనే ఉద్దేశంతో ఇచ్చారు. గత ప్రభుత్వంలో స్థానిక జడ్పీటీసీ సభ్యురాలి సిఫార్సు మేరకు 11 ఎకరాలను పంచేశారు. ప్రస్తుతం ఈ పాఠశాల ఆధీనంలో 40 సెంట్ల భూమి కూడా లేదు.

శారదా నదిలో కలిసే దొంగ గెడ్డకు ఇరువైపులా జిల్లా పరిషత్తు భూములు కొనుగోలు చేసింది. అనకాపల్లి జిల్లా ఏర్పాటయ్యాక వాటిపై పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదునుగా వైకాపాకు చెందిన కొంతమంది పాగా వేశారు. గెడ్డకు ఇరువైపులా అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్నారు. తాజాగా గెడ్డను ఆనుకుని వినాయకుడి మండపం పేరుతో ఓ షెడ్డు నిర్మించారు. మరో పక్క గెడ్డ ఒడ్డును చదును చేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇటీవల జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అనకాపల్లిలో పర్యటించి జడ్పీ ఆస్తులను పరిశీలించారు. స్థలాల్లో ఆక్రమణలను తొలగించి సరిహద్దులు నిర్ణయించాలని అధికారులను ఆదేశించినా ఇప్పటివరకు అతీగతి లేదు.

**సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం**

ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం నేరం. శారదా నది ఒడ్డున ఆక్రమణలను గుర్తించాం. నిర్మాణాలుంటే వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేస్తాం. అప్పటికీ ఖాళీ చేయకపోతే చట్ట ప్రకారం ముందుకెళ్తాం. సర్వే చేసి జడ్పీ స్థలాలకు సరిహద్దులు నిర్ణయిస్తాం. ఆయిషా, ఆర్డీవో, అనకాపల్లి

# అదిగో రైల్వే జోన్.. ఇదిగో సమస్యలు!




విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ సాకారమైనా ప్రయాణికుల కష్టాలు తీరడం లేదు. రైల్వేస్టేషన్ పరిస్థితి పేరు గొప్ప..ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. పలు రైళ్లు అవుటర్‌లో గంటలకొద్దీ నిలిచిపోతున్నాయి. పదుల సంఖ్యలో ప్రత్యేక రైళ్లు దువ్వాడ మీదుగా వెళ్లిపోతున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్యలు వేధిస్తున్నా పరిష్కారంపై రైల్వే యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడం లేదనే విమర్శలొస్తున్నాయి.

**అవుటర్‌లో నిలిపేస్తున్నారు..:** విశాఖ నుంచి నిత్యం 118 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. లక్ష మంది నిత్యం ఆయా రైళ్లలో ప్రయాణిస్తుంటారని అంచనా. ఏటికేడు ఈ సంఖ్య పెరుగుతోంది. దానికి తగ్గట్టుగా సదుపాయాలు మాత్రం సమకూరడం లేదు. స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీగా లేకపోవడంతో చాలా రైళ్లను అవుటర్‌లో గంటలకొద్దీ నిలపాల్సి వస్తోంది. అనకాపల్లి నుంచి విశాఖ చేరుకోవడానికి సాధారణంగా గంట సమయం పడుతుంది. కాని కొన్ని రైళ్లకు 2గంటలకుపైగా సమయాన్ని కేటాయించడం గమనార్హం. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**విశాఖ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గాలంటే..:** ప్రత్యేక రైళ్లు రావాలన్నా, అవుటర్‌లో గంటకొద్దీ నిలవకుండా ఉండాలన్నా.. టెర్మినల్ స్టేషన్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించడానికి చర్లపల్లి, లింగంపల్లి, కాచిగూడ టెర్మినల్ స్టేషన్లను అభివృద్ధి చేసింది. విశాఖకు అవుటర్‌లో మర్రిపాలెం, ఉత్తర సింహాచలం స్టేషన్లు ఉన్నాయి. వాటిని టెర్మినల్ స్టేషన్లగా మారిస్తే కొన్ని రైళ్లను అక్కడ నిలపొచ్చు..అక్కడి నుంచే అవి ప్రారంభమయ్యేలా చేయవచ్చు. తద్వారా విశాఖ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గి.. మరిన్ని రైళ్లను నడపొచ్చు. గతంలో ఆ తరహా ప్రతిపాదనలు చేసినా తర్వాత పట్టించుకోలేదు.

**18రైళ్లు వెళ్లిపోతున్నాయ్..:** పండగలు, ప్రత్యేక రోజుల్లో తూర్పు కోస్తా రైల్వే దూరప్రాంతాలకు పలు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. వాటిలో 18రైళ్లు విశాఖ రాకుండా దువ్వాడ స్టేషన్ మీదుగా వెళ్లిపోతున్నాయి. విశాఖ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీగా లేకపోవడం, ట్రాక్ ఇవ్వలేకపోవడమే దీనికి కారణమని చెబుతున్నారు. ప్రత్యేక రైళ్లలో అధికశాతం రాత్రి, తెల్లవారుజామున దువ్వాడ స్టేషన్‌కు చేరుకుంటున్నాయి. నగరం నుంచి 25కి.మీ. దూరంలో ఆ స్టేషన్ ఉండటం, ఆయా సమయాల్లో రవాణా సౌకర్యం లేకపోవడంతో నగరవాసులు ప్రత్యేక రైళ్లను వినియోగించుకోలేకపోతున్నారు.

**ఉత్తర సింహాచలం స్టేషన్ ఉందిగా..:** ప్రత్యామ్నాయంగా ఉత్తర సింహాచలం స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ నిర్మించి ప్రత్యేక రైళ్లను నిలిపాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గుంటూరులో ఇదే తరహాలో న్యూ గుంటూరు స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని రైల్వే ప్రయాణికుల సంఘం ప్రతినిధులు గుర్తు చేస్తున్నారు. అయితే ఉత్తర సింహాచలం స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయడం కష్టసాధ్యమని రైల్వే అధికారులు చెబుతున్నారు.

'విశాఖ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు, కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణం పూర్తయిన తర్వాత వెంటనే కొత్త టెర్మినల్ స్టేషన్లపై దృష్టి సారిస్తాం. దీనిపై గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి' అని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

# చిరుప్రాణి.. పెద్ద హాని..!



విశాఖపట్నం : ఇటీవల ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం 103 మంది ప్రయాణికులతో విశాఖ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. కాసేపటికే ఓ పక్షి విమానం ఇంజిన్‌ను ఢీకొని అందులోకి వెళ్లిపోయింది. పైలట్లు అప్రమత్తమై.. విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి అత్యవసర ల్యాండింగ్ చేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే విమానాలకు పక్షుల నుంచి ముప్పు పొంచి ఉంది. పక్షి ఢీకొన్న ప్రతిసారి విమానయాన సంస్థలు సర్వీసులను రద్దు చేస్తున్నాయి. రెక్కలు, ఇంజిన్ దెబ్బతిని రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) గణాంకాల ప్రకారం 2018 నుంచి 2023 అక్టోబరు వరకు దేశవ్యాప్తంగా 88 సార్లు పక్షులు విమానాలను ఢీకొన్నాయి. 2023 తర్వాత ఆయా ఘటనలు కొంత మేర తగ్గాయి.

**నిబంధనలకు తిలోదకాలు..:** విమానాశ్రయాల్లో ప్రమాదాల నిర్వహణకు డీజీసీఏ కొన్ని నిబంధనలు, మార్గదర్శకాలు జారీ చేసింది. ఏరోడ్రోమ్ రిఫరెన్స్ పాయింట్ నుంచి 10 కి.మీ. పరిధిలో వన్యప్రాణులను ఆకర్షించేలా చెత్త పారవేయడం, జంతువధ నిషేధించాలి.

ఐఎన్ఎస్ డేగా ఆధ్వర్యంలో ఉన్న విశాఖ విమానాశ్రయానికి సమీపంలో ఎన్ఏడీ కూడలి, కాకానినగర్, ఎల్లపువానిపాలెం, భగత్‌సింగ్‌నగర్, షీలానగర్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం తదితర ప్రాంతాలు ఉన్నాయి. పరిసరాల్లో పదుల సంఖ్యలో రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారు. మిగిలిపోయిన ఆహార పదార్థాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు తదితరాలను జాతీయ రహదారి, పోర్టు రోడ్డుకు ఇరువైపులా పారబోస్తున్నారు.

విమానాశ్రయం సమీపంలో పెద్ద ఎత్తున కబేళాలను నిర్వహిస్తున్నారు. గతంలో కబేళాలను తరలించినా.. కొద్ది రోజులకు మళ్లీ మకాం మార్చేశారు. విమానాశ్రయం పరిసరాల్లో నీటి వనరులు, చెట్లు ఎక్కువగా ఉండటంతో వివిధ జాతుల పక్షులు ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి.ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం..: విమానాశ్రయం పరిసరాల్లో రెస్టారెంట్లు, దుకాణాల్లోని ఆహార వ్యర్థాలను పారబోస్తున్నారు. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోతోంది. దీనిపై నేవీ, జీవీఎంసీ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అనుసంధానంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశాం.ఎస్.పురుషోత్తం, విమానాశ్రయ డైరెక్టర్

# అప్పన్న ఆలయ ట్రస్టుబోర్డు సాకారమయ్యేనా..!

సింహాచలం : ఉత్తరాంధ్రలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన సింహాచలం దేవస్థానంలో ధర్మకర్తల మండలిలో ప్రాతినిధ్యం వహించడమంటే భగవంతుడి అనుగ్రహంగా భావిస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ధర్మకర్తల మండలి సభ్యుల నియామకంపై ఇప్పటికీ ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూడక తప్పలేదు.

**సుదీర్ఘ విరామం తర్వాత:** వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సింహాచలం దేవస్థానానికి పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2020లో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసింది. అనువంశిక ధర్మకర్తగా ఉన్న పూసపాటి అశోక్ గజపతిరాజును తొలగించి అనూహ్యంగా సంచయిత గజపతిరాజును ఛైర్మన్ చేయడం అప్పట్లో తీవ్ర సంచలనం కలిగించింది. అనంతరం అశోక్ గజపతిరాజు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తిరిగి ఛైర్మన్‌గా వచ్చారు. వైకాపా ప్రభుత్వం రెండుసార్లు ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసి పలువురు సానుభూతిపరులకు సభ్యులుగా అవకాశం కల్పించింది. అయితే ఇందులో నియమ నిబంధనలు అనుసరించలేదన్న ఆరోపణలొచ్చాయి. అప్పటి వైకాపా ఉత్తరాంధ్ర సమన్వయకర్త విజయసాయి రెడ్డి, రాజగురువుగా వ్యవహరించిన పీఠాధిపతి కనుసన్నల్లో ప్రతిపాదించిన వారికే పదవులు దక్కాయి. దీనికి తోడు ప్రత్యేక ఆహ్వానితుల పేరుతో మరికొందరిని నియమించింది. వీరు అప్పట్లో చేసిన హడావుడి ఇప్పటికీ దేవస్థానం ఉద్యోగులు మరిచిపోలేరు.

**పద్ధతి ప్రకారమే నియామకాలు..:** రాష్ట్రంలోని పలు దేవాలయాల ట్రస్టుబోర్డుల నియామకం కోసం కూటమి ప్రభుత్వం చట్టపరమైన పద్ధతులను పాటిస్తోంది. ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి దేవాదాయశాఖ చట్టంలో చెప్పిన నియమాల ప్రకారం సభ్యులను ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. వైకాపా ప్రభుత్వంలో ఈ విధానం పాటించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే సింహాచలం దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకం జరుగుతుందా..? లేదా..? అన్న అంశంపై పలువురు



సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడంతో దేవస్థానం పరిపాలనపై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ట్రస్టుబోర్డు సభ్యుల నియామకం జరిగితే పాలనలో పారదర్శకత ఉంటుందని ఆధ్యాత్మికవేత్తలు పేర్కొంటున్నారు. సమయం మించిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం సత్వరమే దీనిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇప్పటికే రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలైన శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం, తదితర ఆలయాలకు ట్రస్టుబోర్డులు నియమించింది. అశోక్ గజపతిరాజు అనువంశిక ధర్మకర్తగా వ్యవహరిస్తున్న పలు చిన్న దేవాలయాలకు సైతం సభ్యుల నియామకం జరిగింది. కానీ, సింహాచలం ట్రస్టుబోర్డుకు సంబంధించి ఎలాంటి ప్రకటన ఇంకా వెలువడలేదు. ఇప్పటికే సింహాచలం ట్రస్టీలుగా అవకాశం కోసం తెదేపా, జనసేన, భాజపా నుంచి పలువురు ఆశావహులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు నాయకులతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ప్రముఖులు సైతం ఆశావహుల జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది.

# పంచాయతీలకు జవసత్వాలు

నర్సీపట్నం: గ్రామ పంచాయతీల్లో ప్రగతి పరుగులెత్తనుంది. వైకాపా పాలనలో నిధుల్లేక పంచాయతీలన్నీ నిర్వీర్యమయ్యాయి. కూటమి సర్కారు ఆర్థికంగా ఊతమిస్తూ జవసత్వాలు నింపుతోంది. తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. వీటితో గ్రామాలు అభివృద్ధి బాట పట్టనున్నాయి. పెండింగ్ పనులన్నీ పూర్తికానున్నాయి. పల్లెల పురోగతికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.గతంలో పంచాయతీలకు కేటాయించిన అభివృద్ధి నిధులు సైతం దారి మళ్లాయి. గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లేందుకూ సొమ్ముల్లేని పరిస్థితి. వాలంటీర్లతోనే అనధికారంగా అన్నీ నడిపించారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇవన్నీ గాడిన పడుతున్నాయి. పల్లెలో పారిశుద్ధ్యం మెరుగుపడుతోంది.

సర్పంచుల గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం తాజాగా రూ.1.27 కోట్లు కేటాయించింది. ఒక్కో సర్పంచికి నెలకు రూ.3 వేల చొప్పున ఆరు నెలల వేతనం అందనుంది. ఆర్థిక సంఘం నిధులతో ఘన




వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకోనున్నారు. తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు అవసరమైన మొత్తం ఖర్చు చేయనున్నారు.జిల్లాకు కేటాయించిన ఆర్థిక సంఘం నిధులు పది రోజుల కిందట పంచాయతీల ఖాతాలకు జమమయ్యాయి. శత శాతం స్వచ్ఛత దిశగా పల్లెలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో హరిత రాయబారులు, పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరమ్మతుకు గురైన చెత్త సేకరణ రిక్షాలు, హరిత వాహనాలను బాగు చేయిస్తున్నారు. కొత్తవి కొనుగోలుకు ప్రతిపాదిస్తున్నారు.జిల్లాకు 2024-25 సంవత్సరానికి మొదట, రెండో విడత ఆర్థిక సంఘం నిధుల కింద రూ.57.51 కోట్లు విడుదలయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ చెప్పారు. ఇందులో బేసిక్ గ్రాంటు రూ.23 కోట్లు, టైడ్ నిధులు రూ.34.5 కోట్లు కేటాయించారన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో అన్ని విభాగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

# విజయపథం.. విజయమే లక్ష్యం

నక్కపల్లి : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) మెరుగైన ఫలితాలు సాధించేలా సమగ్ర శిక్షా అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా 'విజయపథం' కార్యక్రమాన్ని అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. అనాథ, నిరుపేద, వెనుకబడిన వర్గాల బాలికలు విద్యకు దూరం కారాదనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం కేజీబీవీలను ఏర్పాటు చేసింది.

జిల్లాలోని 20 కేజీబీవీల్లో 5600 మంది విద్యార్థినులు చదువుతున్నారు. మొదట్లో 6 నుంచి 10 తరగతుల వరకు బోధన జరిగేది. తెదేపా ప్రభుత్వ హయాంలో కొన్ని కేజీబీవీల్లో ఇంటరు తరగతులకు శ్రీకారం చుట్టారు. దశలవారీగా అన్నిచోట్లా అమల్లోకి తెచ్చారు. పది, ఇంటరులో సాధిస్తున్న ఫలితాలతో వీటిలో సీట్లకు డిమాండు ఏర్పడుతోంది. ఈసారీ మెరుగైన ఫలితాల కోసం విజయపథానికి శ్రీకారం చుట్టారు.పరీక్షలంటే భయం తొలగించడం, అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరచడం, చదువులో వెనుకబడిన వారిని గుర్తించడం, వారిలో ఒత్తిడి తగ్గించి ఆత్మవిశ్వాసం పెంచడం, పరీక్షల్లో సత్ఫలితాలు రాబట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు వారానికి మూడు రోజులు.. తొమ్మిది, పది తరగతులకు వారంలో ఐదు రోజులు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

తొమ్మిదో తరగతి విద్యార్థినులకు రెగ్యులర్ పాఠాలతోపాటు పదో తరగతికి సంబంధించిన సిలబస్‌లో రోజుకో పిరియడ్ బోధిస్తున్నారు. నేర్చుకున్న దానిపై ప్రతి బుధవారం పరీక్ష నిర్వహిస్తూ పదో తరగతికి సన్నద్ధం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల సమయంలో వంద రోజుల ప్రణాళిక అమలవుతోంది. రెండేళ్లుగా కేజీబీవీల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ ఏడాది జులై నుంచి విజయపథం అమలు చేస్తున్నారు. ప్రతి రోజూ తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలను ఆ రోజు రాత్రి ఉపాధ్యాయినులు దగ్గరుండి చదివిస్తారు. మరుసటి రోజు ఉదయం స్లిప్ టెస్ట్ నిర్వహిస్తారు.**సత్ఫలితాలొస్తున్నాయి** పది, ఇంటరు ఫలితాల్లో ఈ ఏడాది జిల్లా, రాష్ట్ర స్థాయిలో తొలి రెండు స్థానాలు సాధించాం. విజయపథం ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తున్నారు. తద్వారా శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సాగుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసినప్పుడు ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. డాక్టర్ ఆర్.జయప్రకాశ్, ఏపీసీ, సమగ్ర శిక్షా

# విస్తరణం...ప్రమాదాల గండం!

పెద్దదోర్నాల : సీమాంధ్రకు రవాణా పరంగా కర్నూలు - గుంటూరు రోడ్డు కీలకం. 340సీ జాతీయ రహదారిలో భాగంగా ఉన్న ఈ మార్గం నల్లమలలోంచి వెళ్తుంది. అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో ఆ పరిధిలోని 38 కి.మీ.లు విస్తరణకు నోచుకోక సమస్య నెలకొంది. అడుగడుగునా ప్రమాదకర మలుపులు, లోతైన లోయలు ఉండడం... వర్షాల వేళ వాగులు పొంగడం, దారి అంచులు కోతకు గురవుతుండడంతో ఇటుగా ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది.

**ఎంతో ప్రాధాన్యం...**

దసరా, సంక్రాంతి, మహా శివరాత్రి పర్వదినాల్లో శ్రీశైలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు, కార్తిక మాసంలో మల్లన్న దర్శనాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తులు వేలాది వాహనాల్లో ఈ రహదారిలోంచే ప్రయాణిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా గత వైకాపా ప్రభుత్వం అటవీశాఖ నుంచి అనుమతి పొందడంలో విఫలమైంది. దీంతో నంద్యాల జిల్లా నుంచి ఆత్మకూరు వరకు విస్తరణ పూర్తయినా... అక్కడి నుంచి దోర్నాల మండలం కొత్తూరు వరకు పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

చురకలు



## చేనేతపురికి మహర్దశ

ధర్మవరం : చేనేత కేంద్రమైన ధర్మవరంలో మెగా క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. రూ.35కోట్లతో క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఆమోందించనుంది. ఇప్పటికే క్లస్టర్ ఏర్పాటుకు రూపొందించిన డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపింది. చేనేత మగ్గాలు నేస్తున్న 10,200 మందిని చేనేత జౌళిశాఖ అధికారులు గుర్తించి వారి జాబితాను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపారు. క్లస్టర్ ఏర్పాటుకు ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో పది ఎకరాల స్థలాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపారు. ఇప్పటికే అనుమతులు తెచ్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దిల్లీ పర్యటన చేశారు. చేనేతల 20 ఏళ్ల ప్రయ త్నాలు కూటమి ప్రభుత్వంలో సఫలమయ్యాయి.

**కార్మికులకు నైపుణ్య శిక్షణ**

ధర్మవరంలో మెగా క్లస్టర్‌లో రూ.5కోట్లు వెచ్చించి భవన నిర్మాణాలు



చేపట్టనున్నారు. ఇందులో చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వను న్నారు. శిక్షణ పొందిన కార్మికులకు 90 శాతం రాయితీతో వివిధ పరికరాలు ఇవ్వనున్నారు.

**అన్ని ఒకే చోటే**

మెగా క్లస్టర్ ఏర్పాటు చేసే ప్రాంతంలోనే డిజిటల్ స్టుడియో ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల డిజైన్లను చేనేత డిజైనర్లు రూపొందించి వాటిని డిజిటల్ స్టుడియోలో అందుబాటులో ఉంచుతారు. పట్టుచీరపై డిజైన్లు రూపొందించేందకు గాను శిక్షణ ఇవ్వనున్నారు.క్లస్టర్ ఆవరణ లోనే సామూహిక షెడ్లు నిర్మించనున్నారు.

చేనేతలకు అవగాహన కల్పించేందుకు తమిళనాడులోని కంచిలో ఉ న్న మెగా క్లస్టర్ సందర్శనకు ఇటీవల ధర్మవరం చేనేత కార్మికులను చేనేత జౌళిశాఖ అధికారులు తీసుకెళ్లడం విశేషం.

## ఇన్‌ఛార్జులే సమస్తం.. కదలని దస్త్రం

నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వర్ణాంధ్ర విజన్-2047కి పెద్దపీట వేసింది. సంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పది సూత్రాలను నిర్దేశించగా.. వాటిని జిల్లాలో అమలు చేసే అధికారులు కరవయ్యారు. రెగ్యులర్ అధికారులు లేకపోవ డంతో.. విధాన పరమైన అంశాల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతు న్నారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. వేల సంఖ్యలో అర్జీలు వచ్చాయి. వాటిలోనూ ఇప్పటికీ చాలా వరకు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇంతటి కీలకమైన రెవెన్యూశాఖలో జిల్లా రెవెన్యూ అధికారి కొద్దికాలంగా ఇన్‌ఛార్జిగా ఉన్నారు. డీఆర్‌వోగా పనిచేస్తున్న విజయభా స్కర్ బదిలీపై వెళ్లిన తర్వాత ఆ పోస్టుకు రెగ్యులర్ అధికారి లేరు. తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా ఉన్న హుస్సేన్ సాహెబ్‌కు బాధ్యతలు అప్పగించగా.. ఆయన ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. డీఎస్‌వో విజయకుమార్‌కు డీఆర్‌వో బాధ్యతలు అప్పగించారు. దీనివల్ల ఎప్పటిక ప్పుడు ఫైళ్లు క్లియర్ కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హుస్సేన్ సాహెబ్ ఉద్యోగ విరమణతో ఖాళీగా ఉన్న టీజీపీ స్పెషల్ కలెక్టర్ పోస్టును ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి ఆసిఫాకు అప్పగించారు.

**రాష్ట్రంలో అతిపెద్ద ఇరిగేషన్ డివిజన్‌గా ఉన్నా..**

రాష్ట్రంలో అతిపెద్ద ఇరిగేషన్ డివిజన్ అయినా నెల్లూరు సెంట్రల్ డివిజన్‌కు ఎస్ఈ దేశినాయక్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. సోమశిల




ఎస్ఈగా.. అక్కడే పనిచేస్తున్న ఈఈ వెంకటరమణారెడ్డి ఇన్‌ఛార్జిగా ఉన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా ఒంగోలు డీఆర్‌గా పనిచేస్తున్న బాలాంజనేయులు ఉన్నారు. విజిలెన్స్ ఎస్పీగా పనిచేస్తున్న రాజేశ్వరరావు ఉద్యోగ విరమణ తర్వాత.. ఆ పోస్టులో మరొకరిని నియమించలేదు. ఒంగోలు విజిలెన్స్ ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

**పక్క జిల్లాలనుంచి రాక..**

నుడా వీసీగా బాపిరెడ్డి బదిలీ అయిన తర్వాత ఇప్పటివరకు రెగ్యులర్ అధికారిని నియమించలేదు. కొన్ని రోజులు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజను ఇన్‌ఛార్జిగా నియమించగా.. ఆయన బదిలీ తర్వాత జేసీకి అప్పగించారు. నెల్లూరు నగరానికి కీలకమైన కమిషనర్ పోస్టుకు అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న నందన్‌కు ఎఫ్ఏసీ ఇచ్చారు. జడ్పీ సీఈవోగా పనిచేసిన విద్యారమ బదిలీపై శ్రీకాళహస్తికి వెళ్లిన తర్వాత.. నాలుగు నెలలుగా పోస్టు ఖాళీ ఉంది. డిప్యూటీ సీఈవో మోహన్‌రావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో కీలకమైన మైనింగ్ డీడీ పోస్టు కూడా ఇన్‌ఛార్జి పాలనలోనే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి డీడీ శ్రీనివాసరావును విజయవాడకు బదిలీ చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులు బాలాజీనా యక్‌కు ఎఫ్ఏసీ ఇవ్వగా.. ప్రస్తుతం గూడూరు ఏడీ శ్రీనివాసరావుకు అప్పగించారు.

# క్వారీల్లో పేలుళ్లు.. రైతుల గుండెకు గాయాలు



అనంతపురం : బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో కంకర క్వారీలతో పాటు 18 వరకు క్రషర్లు ఉన్నాయి. వీటి నుంచి వెలువడే దుమ్ము, ధూళి కారణంగా చుట్టుపక్కల కిలోమీటరు మేర పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించాలని గతంలోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలి చ్చినా అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డి.హీరేహాళ్ మండలం మలపనగుడి, హిర్దేహాళ్, మదేనహళ్లి, సోమలా పురం గ్రామాల్లోనూ క్రషర్ల నుంచి వచ్చే దుమ్ము వల్ల రైతులు నష్టపోతు న్నారు.కళ్యాణదుర్గం మండలం ముదిగల్లు-తూర్పుకోడిపల్లి గ్రామాల మధ్య కంకర క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ బ్లాస్ట్ చేస్తున్నా రని రైతులు ఆరోపిస్తున్నారు. పేలుళ్ల సమయంలో రాళ్లు పొలాల్లో పడుతుండటంతో దిగుబడి నష్టపోతున్నామని వాపోతున్నారు. రెండు రోజుల కిందట ఓ రైతు సెల్ఫీ వీడియో తీసుకుని అధికారులు చర్యలు తీసుకోకపోతే క్వారీ పైనుంచి దూకేస్తానంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లావ్యాప్తంగా కంకర క్వారీల్లో అనధికార పేలుళ్లు రైతుల గుండెల్లో గాయాలు చేస్తున్నాయి. పేలుళ్ల సమయంలో రాళ్లు ఎగసిపడి పొలాల్లో పడుతున్నాయి. వాటి నుంచి వెలువడే ధూళి పంటలను పాడుచేస్తోంది. లీజుదారుల స్వార్థానికి తాము తీవ్రంగా నష్టపోతున్నామని చుట్టుపక్కల రైతులు మైన్స్, కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు కంకర క్రషర్లలో ప్రమాణాలు పాటించకపోవడం వల్ల దుమ్ము పంటలపై పేరుకుపోతోంది. తద్వారా కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలిగి దిగుబడి, నాణ్యత దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు.

నిబంధనల ప్రకారం కంకర క్వారీల్లో కంప్రెషర్‌తో గరిష్ఠంగా 20 అడుగులు డ్రిల్లింగ్ చేయాలి. లైసెన్సు, అనుభవం ఉన్న వ్యక్తి ఆధ్వర్యంలోనే కంట్రోలర్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని చాలా క్వారీల్లో బోర్‌వెల్‌తో 100 అడుగుల వరకు రంధ్రాలు చేస్తున్నారు. వాటిల్లోకి అధిక మొత్తంలో పేలుడు పదార్థాలను నింపి పేలుస్తున్నారు. దీంతో 200 మీటర్ల వరకు రాళ్లు, దుమ్ము ఎగసిపడు తున్నాయి.

క్రషర్ల నుంచి దుమ్ము బయటకు రాకుండా అమర్చడం వంటివి చేయాలి. చాలామంది ఓపెన్‌గా నిర్వహిస్తున్నారు.

కంకర క్వారీలు, క్రషర్ల చుట్టుపక్కల పంటలు దెబ్బతినే నేపథ్యంలో రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. లీజుదారులు ఆయా రైతుల నుంచి నిరభ్యంతర పత్రం కూడా తీసుకోవాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇవేమి అమలు కావడం లేదు.

**ఎక్కడా ఉల్లంఘనలు లేవు**

ఆదినారాయణ, ఇన్‌ఛార్జి ఏడీ, గనులశాఖ

కంకర క్వారీల్లో కంట్రోల్ బ్లాస్టింగ్ మాత్రమే చేయాలి. ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించాం. ఎక్కడా ఉల్లంఘనలు లేవు. క్రషర్ల నుంచి వెలువడే దుమ్ము ధూళిపై మాకు సంబంధం లేదు. సమస్య ఉంటే కాలుష్య నియంత్రణ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

## దస్త్రాల్లోనే పరిష్కారం.. బాధితులకు దక్కని న్యాయం



పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను (పీజీఆర్ఎస్) కొందరు అధికారులు అపహాస్యం చేస్తున్నారు. ఒక సాధారణ కార్యక్రమంగా నిండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గత వైకాపా పాలనలో అర్జీల స్వీకరణ, పరిష్కారం అత్యంత దయనీయంగా సాగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కొన్ని సంస్కరణలు తెచ్చినా అధికారుల వైఖరి, బాధ్యతారాహిత్యం మూలంగా పీజీఆర్ఎస్‌లో ఏమాత్రం మార్పు లేదంటే అతిశయోక్తికా దు. గడిచిన 15 నెలల్లో ప్రధానమైన ఐదు శాఖల్లో సుమారు 26,075 అర్జీలు దాఖలు అయ్యాయి. వీటిలో 23,504 పరిష్కారం అయినట్లు నమోదు చేశారు. ఇందులో వాస్తవమెంతో అధికారులకే ఎరుక. ప్రస్తుత కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఈనెల 13వ తేదీన బాధ్యతలు స్వీకరించినా.. 15, 16వ తేదీల్లో కలెక్టర్ల సదస్సుకు హాజరయ్యారు. ఈ (22న) కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు తొలిసారిగా హాజరు కానున్నారు. ఈయన హయాంలోనైనా అర్జీల స్వీకరణ, పరిష్కారం ప్రక్రియ గాడిలో పడాలని బాధిత ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఒక్క జిల్లా కేంద్రంలోనే ప్రతి సోమవారం 200 నుంచి 300 వరకు అర్జీలు దాఖలు అవుతున్నాయి.

**1100కు ఫిర్యాదు చేయవచ్చు**

అర్జీదారుడి సమస్య పరిష్కారం కాకపోతే 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. మన ఇబ్బందులు చెప్పుకోవచ్చు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**సూర్యనారాయణరెడ్డి, డీఆర్వో

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని నాణ్యతగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశిస్తున్నారు. ఎక్కడైన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి అర్జీ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

## 'పట్టు' సాధిస్తున్న పరిగి




పరిగి: పరిగిలోని స్వదేశీ మూలవిత్తన క్షేత్రం దేశీయంగా పట్టుగూళ్ల ఉత్పత్తి ద్వారా నాణ్యమైన విత్తన గుడ్లను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. కేంద్ర పట్టుమండలి ఆధ్వర్యంలో 1992లో పరిగిలో స్వదేశీ మూలవిత్తన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో సంవత్సరానికి 1600 పట్టుగుడ్ల పెంపకాన్ని చేపట్టేవారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా మల్బరీ తోటల పెంపకంలో అవరోధాలు ఏర్పడ్డాయి. పదేళ్ల క్రితం పట్టుపురు గుల పెంపకంలో మూల విత్తన కేంద్రం అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2023-24 సంవత్సరంలో పుష్కలంగా వర్షాలు కురవడంతో జయమంగళి నది ప్రవహించి పరిగి చెరువు పూర్తి స్థాయిలో నిండింది. దీంతో క్షేత్రంలో ఉన్న వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు అభివృద్ధి చెందాయి. దంతో పాటు మల్బరీ తోటల విస్తీర్ణం పెరిగింది. ప్రారంభంలో ఎస్36 మల్బరీ వంగడం స్థానే అధిక దిగుబడి నిచ్చే వీ-1, జీ-4 రకం మల్బరీ తోటలను సాగు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో ప్రస్తుతం 3 ఎకరాల్లో మల్బరీ తోటలను సాగు చేస్తున్నారు.

**ఏడాదికి 2,100 గుడ్ల పెంపకం**

పరిగిలోని స్వదేశీ మూల విత్తన క్షేత్రంలో ఏడాదికి 2,100 విత్తన గుడ్లను రేరింగ్ గదుల్లో విడతల వారీగా పెంపకం చేస్తూ కేంద్ర పట్టుమండలి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నారు. ఎకరా మల్బరీ తోట పెంపకం ద్వారా 300 నుంచి 360 పట్టు గుడ్ల పెంపకాన్ని చేపడుతున్నట్లు మూల విత్తన క్షేత్రం సాంకేతిక సహాయకుడు మారుతి తెలిపారు. సంవత్సరంలో 6 విడతల్లో పట్టుపురుగుల పెంపకం ద్వారా నాణ్యమైన బైవోల్టిన్ పట్టుగూళ్లను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

**మైసూరుకు తరలించి..**

క్షేత్రంలో ఉత్పత్తి చేస్తున్న బైవోల్టిన్ పట్టుగూళ్లను కేంద్ర పట్టుమండలి ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం మైసూరులోని కె.ఆర్.నగర్‌లో ఉన్న శిల్క్ సీడ్ ప్రొడక్షన్ సెంటర్‌కు తరలిస్తారు. అక్కడ నూతన పట్టువంగడాలైన సీఎస్ఆర్ 6, సీఎస్ఆర్26, 27 విత్తన రకాల పట్టు గుడ్లను రూపొందించి రైతులకు అందించనున్నట్లు మూలవిత్తన క్షేత్రంలోని సాంకేతిక సహాయకుడు మారుతి తెలిపారు.

## ఊపిరి తీస్తున్నారు

డోన్: డోన్ నియోజకవర్గ పరిధిలో డోలమైట్, సున్నపురా యి, తెల్లసుద్ద, వైట్‌క్లే, రంగురాళ్ల ఖనిజ నిక్షేపాలున్న గనులతోపాటు పల్వరైజర్ (ముక్కలు లేదా పొడి చేసే) పరిశ్రమలు ఉన్నాయి. చిన్నమల్కాపురంలో 60కి పైగా, కోట్లవారిపల్లెలో 70కి పైగా రాళ్లను పొడి చేసే పరిశ్రమలు ఉన్నాయి. డోలమైట్, సున్నపురాయి, తెల్లసుద్ద, రంగురాళ్లను పొడిగా చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ పొడిని కోళ్ల దాణాతోపాటు ఎరువుల పరిశ్రమల్లోనూ వాడతారు. పరిశ్రమల్లో పొడి చేసే సమయంలో దుమ్ము పెద్దఎత్తున ఎగసిపడుతోం ది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇక్కడ పనిచేసే వందలాది మంది కూలీలు తెల్లటి ధూళిలోనే ప్రమాదకరంగా పనిచేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఇళ్లు ఖాళీ చేస్తూ..**

చిన్నమల్కాపురం గ్రామంలోని సుంకులమ్మ కాలనీలో వందకుపైగా ఇళ్లున్నాయి. దీనికి సమీపంలోనే 10కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. అక్కడినుంచి వచ్చే దుమ్ము ఇళ్లలోకి చేరుతోంది. బయట నిలిపిన వాహనాలు, పచ్చని చెట్లు, పశువులు సైతం దుమ్మూధూళితో తెల్లగా మారిపోతున్నాయి. ప్రతిరోజూ నాలుగైదుసార్లు ఇళ్లను శుభ్రం చేసుకోవాల్సిన ఏర్పడింది. దీంతో చాలామంది గృహాలను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు.



**వ్యాధులతో సతమతం**

చిన్నమల్కాపురం, కోట్లవారిపల్లె ప్రాంతాల్లోని వందలాది పరిశ్రమల్లో కార్మికులు పనిచేస్తున్నారు. ఇల్లు గడవాలంటే వీటిల్లో పనిచేయాల్సిందే నని కూలీలు పేర్కొంటున్నారు. జీవనోపాధి కోసం ఏళ్ల కిందటే ఇక్కడికి వచ్చామని, దుమ్మూధూళితో రోగాలు దరిచేరుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కార్మికులతోపాటు స్థానికులు చర్మ, శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. పరిశ్రమల వద్ద చుట్టూ పట్టలు, రేకులు, ప్రత్యేక పైపులు ఏర్పాటు చేసుకుంటే దుమ్ము గాలిలోకి వెళ్లకుండా చేయొచ్చు. ఆ దిశగా పరిశ్రమల నిర్వాహకులు దృష్టి సారించడం లేదు.

**వృద్ధాప్యంతో ఉండిపోయాం: అక్కమ్మ, చిన్నమల్కాపురం**

కొన్నేళ్ల కిందట ఇక్కడే ఇళ్లు నిర్మించుకున్నాం. పరిశ్రమల నుంచి దుమ్ము వస్తోంది. రోగాలబారిన పడుతున్నాం. వయస్సు రీత్యా ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. మా పిల్లలు ఇక్కడ ఉండలేక వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు.

**ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం: కిశోర్‌రెడ్డి, ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి, కర్నూలు**

చిన్నమల్కాపురం, కోట్లవారిపల్లె ప్రాంతాల్లోని పల్వరైజర్ పరిశ్రమల యజమాన్యాలు దుమ్మూధూళి వ్యాపించకుండా సరైన జాగ్రత్తలు పాటించాలి. కాలుష్య సమస్యపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

## నిధులిచ్చి.. వారధిగా నిలిచి

కోవెలకుంట్ల, సంజామల: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో రహదారులు అధ్వానంగా మారాయి. వంతెనలు శిథిలావస్థకు చేరాయి. జనం నరకయాతన అనుభవించేవారు. వాగులు దాటలేక వంతెనల నిర్మా ణం కోసం ఏళ్లుగా ఎదురుచూశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారించి నిధులు ఇవ్వడంతో పనులు పూర్తవుతున్నాయి.

**రూ.12.06 కోట్లు అందించి..**సంజామల మండలంలో సంజామల నుంచి ముదిగేడు వెళ్లే దారిలో రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.12.06 కోట్లతో 6 కి.మీ. వరకు రెండు వరుసల రహదారితోపాటు నాలుగు మైనర్ వంతెనలను మంజూరు చేయడంతో పనులు వేగంగా చేపట్టారు. రహదారి పనులు పూర్తవగా వంతెన పనులు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఈ మండలంలోనే ముదిగేడు నుంచి వసంతాపురం మీదుగా అవుకు వెళ్లే దారిలో వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండేది. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.80 లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు నిర్మాణం మాత్రమే మిగిలి ఉంది.

**తీరనున్న కష్టాలు**

కోవెలకుంట్ల మండలంలోని వల్లంపాడు, లింగాల గ్రామాల మధ్య కప్పలవాగు.. ఏటా వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. కోవెలకుంట్ల నుంచి ఆయా గ్రామాల మీదుగా నంద్యాలకు వెళ్లే మార్గం కావడం.. వాగు పొంగినప్పుడల్లా రాకపోకలు స్తంభించేవి. ఏటా వేలాది మంది ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రూ.1.5 కోట్లతో వంతెన పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంజూరు చేశారు. ఇప్పటికే వంతెన నిర్మాణం పూర్తవగా.. ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

**ఇబ్బందులు తొలగిస్తాం: రెడ్డి గోవిందు, ఆర్అండ్‌బీ డీఈ**

రహదారులు, వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వేగంగా చేశాం. ఇప్పటికే చాలావరకు వంతెన పనులు పూర్తయ్యాయి. వర్షాలు తగ్గగానే మిగిలిపోయిన పనులు వెంటనే పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

## కార్డు అందక.. కష్టం తీరక

కర్నూలు : కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే మిగులుతోంది. రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చుకునేందుకు, కార్డుల విభజన కోసం వేలాదిమంది గత కొన్ని నెలలుగా దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. మరోవైపు రాష్ట్రంలోని ఎంపిక చేసిన జిల్లాల్లో గత నెల నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సెప్టెంబరు 15 నుంచి అందిస్తామని పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకు ఆ ఊసే కానరావడం లేదు.

**అక్రమాలకు చెక్ పెట్టేలా..**

నిత్యావసర సరకుల పంపిణీలో అవకతవకలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రేషన్ కార్డు తీసుకొచ్చింది. కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు పాత వాటి స్థానంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ఆగస్టులో నెలలో శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన జిల్లాల్లో వీటిని పంపిణీ చేస్తోంది.స్మార్ట్ కార్డుపై యజమాని వివరాలతోపాటు చౌకదుకాణం గుర్తింపు నంబరు, బియ్యంకార్డు నంబరు, ఫొటోతోపాటు క్యూఆర్ కోడ్ ఉంటుంది. కార్డు వెనక కుటుంబ సభ్యుల వివరాలు ముద్రిస్తారు. వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. నకిలీ లావాదేవీలకు అవకాశం ఉండదు.

**పూర్తవని పరిశీలన**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్త కార్డులు, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఇతర సేవల కోసం 2,06,959 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో రెవెన్యూ, పౌర సరఫరాల సంస్థ అధికారులు 1,36,430 దరఖాస్తులను పరిశీలించారు. మరో 47,861 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ కారణాలతో మిగతావాటిని తిరస్కరించారు.నంద్యాల జిల్లా పరిధిలో గత నాలుగు నెలల కాలంలో కొత్త కార్డులు, వివిధ సేవలకు సంబంధించి 77,902 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 47,850 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇంకనూ 21 వేలకుపైగా దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

# ఉల్లి రాసుల్లో కన్నీటి పొరలు

కర్నూలు : “ పంట సాగు చేసిన ఏ ఒక్క రైతు నష్టపోకూడదు. వారికి అండగా నిలవాలి.. ఉల్లికి మద్దతు క్వింటా రూ.1,200కు కొనుగోలు చేయాలి’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కనీస ధర లభిస్తుందని అన్నదాతలు ఆశించారు. కానీ ముఖ్యమంత్రి ఆదేశాలు కర్నూలు మార్కెట్లో అమలుకాలేదు. వ్యాపారుల మాటే నెగ్గింది. రైతులకు నష్టమే మిగిలింది. సరకు తెచ్చి రోజులు గడుస్తున్నా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. చేసేది లేక రైతులు విపణిలోనే వదిలేసి వెళ్లిపోతున్నారు.

**నాలుగైదు లాట్లకే ధర**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 3,793 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. క్వింటా ఉల్లి గరిష్ఠ ధర రూ.1,149 పలికింది. మద్దతు ధర క్వింటా రూ.770 ఉండగా.. దానికంటే రూ.31 తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేశారు. కేవలం నాలుగైదు లాట్లకు మాత్రమే గరిష్ఠ ధర పరిమితం చేశారు.

**చాలావరకు కొనుగోలు చేయక..**

మార్కెట్‌కు గురువారం 87 లాట్ల ఉల్లి వస్తే అందులో 43 లాట్లను వ్యాపారులు కొనుగోలు చేయలేదు. ఆ 43 లాట్లకు కనీసం రూ.100 ధర కూడా రాయలేదు. కనిష్ఠ ధర రూ.500కు తగ్గకుండా కొనుగోలు చేయాలని జేసీ ఆదేశించడంతో వ్యాపారులు కొంత సరకుకు రూ.500 రాసి కొనుగోలు చేస్తున్నారే తప్ప మొత్తం సరకును కొనుగోలు చేయలేదు.

**అమ్ముకోలేక వదిలేశారు**

కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన శ్రీనివాసులు సోమవారం



రాత్రి 50 సంచుల ఉల్లిని తీసుకొచ్చారు. ఉల్లి షెడ్డులో ఉన్న సరకు వైపు వ్యాపారులు రాలేదు. మార్కెట్ కమిటీ అధికారులు పట్టించుకోలేదు. సరకు దెబ్బతింటుండటంతో ఏం చేయాలో దిక్కుతోచక ఒక్కో సంచిని రూ.100 చొప్పున పది సంచుల వరకు విక్రయించారు. మిగిలింది వదిలేసి వెళ్లిపోయారు.

**రోజుకు ఒక్కసారే**

కర్నూలు మార్కెట్‌ను జేసీ డా.బి.నవ్యతనిఖీ చేశారు.. ఏరోజు ఉల్లిని ఆరోజు వ్యాపారులు కొనుగోలు చేయాలని ఆదేశించా రు. రోజుకు రెండుసార్లు ఈ.నామ్‌లో టెండరు నిర్వహించి కొనుగోలు చేపట్టేలా చూడాలని అటు వ్యాపారులు.. ఇటు మార్కెట్ కమిటీ అధికారులకు సూచనలు ఇచ్చారు. కానీ ఇది కూడా అమలుకావడం లేదు. రోజుకు ఒక్కసారి మాత్రమే టెండరు నిర్వహిస్తున్నారు.

**పండగ వేళ పస్తులు : రామాంజిని, బోడబండ, ఎమ్మిగనూరు**

అర ఎకరా పొలంలో ఉల్లి సాగు చేయగా 57 ప్యాకెట్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. కోత కోసి గ్రేడింగ్ చేయించి సంచుల్లో నింపేందుకు, మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు, రవాణాకు కలిపి రూ.20 వేలకుపైగా ఖర్చైంది. పంట సాగుకు రూ.30 వేలకుపైగా ఖర్చు చేశా. ఆదివారం రాత్రి కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి తీసుకొచ్చా. సోమవారం నుంచి వరకు ఒక్క వ్యాపారి కూడా సరకు కొనుగోలు చేయలేదు. పండగ పూటా పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అర ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టినా కనీసం రూ.5 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు.

# మమ్మల్ని ఏం‘సేతు’రో

భీమవరం :జులైలో గుజరాత్‌లో మహిసాగర్ నదిపై ఆర్అండ్‌బీ వంతెన కూలింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. మొత్తం 352 ప్రమాదకరం గా ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. జిల్లాలోనూ చాలా ఉన్నాయి. భీమవరం–తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వద్ద ఉండి కెనాల్‌పై వంతెన ఇది. నిత్యం వేలలో వాహనాలు తిరుగుతుంటాయి. ఇది కూలిపోతే భీమవరం–తాడేపల్లిగూడెం పట్టణాల మధ్య రాకపోకలు బంద్. భారీ వాహనాలు తరచు మలుపు తిరిగే సమయంలో వంతెనపై ఇరుక్కుపో వడంతో గంటల కొద్దీ వాహనాలు బారులు తీరడంతో ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

డెల్టాలో పంట, మురుగు కాలువలపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితిలో ఉన్నాయి. అయినా ఏళ్ల తరబడి పాలకులు అలాగే వదిలేశారు. భీమవరం, ఉండి, నరసాపురంలో పలు చోట్ల కీలక ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

ఇటీవల ఉప్పుటేరును ఆనుకుని ఉన్న భీమవరం మండలం దొంగపిండిలో వంతెనపై కొంత హఠాత్తుగా కూలిపోయింది. గ్రామంలోకి ప్రవేశించేందుకు ఉన్న ఒకే ఒక మార్గం ఇది. ఇక్కడ ద్విచక్ర వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా అనుమతించారు. మూడు రోజుల కిందట మొగల్తూరు మండలం జగన్నాథపురం వద్ద జీఅండ్‌వీ కెనాల్‌పై ఉన్న వంతెనపై లారీ వెనక్కి వస్తుండగా శ్లాబ్ కూలి అది తిరగబడింది. దీని పైభాగం గతంలోనే



శిథిలమైంది. అధికారులు మరమ్మతులు చేయించి తేలికపాటి వాహనాలు తిరిగేలా అనుమతి ఇచ్చారు. గడిచిన కొన్నేళ్లలో జిల్లాలో రూ.వందల కోట్లు రహదారుల విస్తరణ అభివృద్ధికి ఖర్చు చేసినా వంతెనల ఊసే పట్టించుకోలేదు. భీమవరం–విజయవాడ ప్రధాన మార్గంలో కాళ్ల మండలం కోపెల్ల వద్ద బొండాడ డ్రెయిన్‌పై ఉన్న శిథిల వంతెన ఇది. రెండు దశాబ్దాలుగా దీన్ని పట్టించుకోవడం లేదు. గతంలో రూ.3 కోట్ల నిధులు మంజూరైనా టెండర్లు పూర్తి కాక అలాగే ఉండిపోయింది.

**ఏమి చేయాలి?..** జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు కూటమి నుంచి నెగ్గినవారే. ప్రభుత్వం కూడా శిథిల వంతెనలపై దృష్టి పెట్టిన నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు చేయించి తీసుకెళ్లాలి. ప్రమాద తీవ్రతను పెద్దలకు వివరించి నిధులు మంజూరు చేయించాలి. డబ్బులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిపించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..** ప్రమాదకరంగా ఉన్న వంతెనల విషయంపై ప్రత్యేక దృష్టి పెడతాం.పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కోపెల్ల వంతెన నిర్మాణానికి నిధులున్నాయి. దొంగపిండి వారధి తాత్కాలిక మరమ్మతులకు రూ.24 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. – శ్రీనివాసరావు, ర.భ.శాఖ ఈఈ

# ఏళ్ల నాటి కల..నెరవేరనున్న వేళ



నిడదవోలు : పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నిడదవోలు రైల్వే పైవంతెన (ఆర్వోబీ) నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీని నిర్మాణానికి 2019లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.201 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది జనవరి 7న అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నిర్మాణ వ్యయంలో రూ.56 కోట్లు రైల్వే, మిగిలిన రూ.145 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నిర్ణయించగా.. రైల్వే పరిధిలో పనులు అప్పట్లోనే సుమారుగా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో జరగాల్సిన పనులు ప్రారంభం కాకపోవడంతో తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో నిలుపుదల చేసింది. తర్వాత కొంతకాలం అదే పరిస్థితి కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం సీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.197 కోట్లు 2023 ఆగస్టులో మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ అనంతరం గత ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. ఇంతలో సాధారణ ఎన్నికలు రావడంతో అంతగా ముందుకు సాగలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, నిడదవోలు నియోజకవర్గం నుంచి అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం సాధించడం, మంత్రి కావడంతో పనులు ఊపందుకున్నాయి. పలు సందర్భాల్లో ఆయన పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రయాణికులకు తప్పని అవస్థలు...**

ఆర్వోబీ నిర్మాణం కారణంగా రాజమహేంద్రవరం–తాడేపల్లిగూడెం వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనుల కారణంగా రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతమంతా బురదమయంగా మారి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు.

**అరవై శాతం నిర్మాణం పూర్తి..**

ప్రస్తుతం ఆర్వోబీ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా నిడదవోలులో రెండు వైపులా, తాడేపల్లిగూడెం వైపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం కాంక్రీట్ స్లాబ్‌లు ఎక్కిస్తున్నారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ మీదుగా నిడదవోలు నుంచి సమిశ్రగూడెం వైపునకు వంతెన నిర్మాణ పనులు చేపట్టారు.

# హడలెత్తిస్తున్న కడలి



అల్లవరం : సఖినేటిపల్లి మండల పరిధిలో 13 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. పల్లిపాలెం, అంతర్వేది, అంతర్వేదికర గ్రామాల్లో తీరం కోతకు గురవుతోంది. కేవశదాసుపాలెం, అంతర్వేది, పల్లిపాలెం గ్రామాల్లోకి నీరు చొచ్చుకువస్తోంది.అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో సముద్రపు అలలు తీరంపై విరుచుకుపడుతున్నాయి. ఓఎన్జీసీ చమురు సంస్థకు రక్షణగా నిర్మించిన రహదారి పూర్తిగా కడలి గర్భంలో కలిసిపోయింది. ఈ ప్రాంతాల్లో తీరం వెంబడి గ్రామాల్లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.ఉప్పలగుప్తం మండలం పరిధిలో వాసాలతిప్ప పరిధిలో మడ అడవులను నరికి అనధికారిక చెరువులను తవ్వేస్తున్నారు.సువిశాల తీరం కోనసీమ సొంతం. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వరుస వాయుగుండాలు, తుపాన్ల ప్రభావం ఈ జిల్లాపై అధికంగా ఉంటుంది. ఒకప్పుడు సహజ సిద్ధంగా తీరానికి రక్షణ కవచంగా ఉండే వనరులు నేడు విధ్వంసం కావడంతో విపత్తులు వచ్చి తీవ్ర నష్టం కలగజేస్తున్నాయి.

**మానవ చర్యల వల్లే:** కోనసీమ తీర ప్రాంతానికి తుపాన్లతో అపార నష్టం వాటిల్లుతోంది. విపత్తులు వచ్చిన సమయంలో అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప, తీర ప్రాంత రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని సమీప ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

**ఇవీ కారణాలు..**

కోనసీమ తీరంలో 19,302 ఎకరాల్లో అటవీ ప్రాంత భూములు ఉన్నాయి. వీటిలో వెయ్యి ఎకరాలు ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా తీరం వెంబడి అక్రమ రొయ్యల చెరువులు, ఇతర నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గాలుల తీవ్రతను తగ్గించే తాటిచెట్లు, సరుగుడు, ఇతర వనాలు నరికివేతకు గురయ్యాయి. మడ అడవులు, మొగలి పొదలు మాయమవుతున్నాయి. తీర ప్రాంత గ్రామాలకు రక్షణగా నిలిచిన ఇసుక తిన్నెలను అక్రమార్కులు తమ కాసుల కక్కుర్తితో కొల్లగొట్టి వ్యాపారం చేస్తున్నారు.

**కనీస చర్యలు చేపడితేనే..**

తీరం వెంబడి గాలుల తీవ్రతను నియంత్రించే సరుగుడు, తాటి వనాలు, మొగలిపొదలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. సామాజిక అటవీ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి. తీరానికి 5 కి.మీ.దూరంలో అన్ని సదుపాయాలతో కూడిన తుపాను రక్షిత భవనాల నిర్మాణం చేపట్టాలి. జిల్లాలో ఉన్న 6వేల ఎకరాల చిత్తడి నేలల్లో ఉన్న ఆక్రమణలు తొలగించి మడచెట్లు పెంచాలి. తీరం వెంబడి సాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలి. అనధికారిక రొయ్యల చెరువుల సాగును తక్షణం నియంత్రించాలి.

తీర ప్రాంతం: 93 కి.మీ.

మండలాలు: 9


మత్స్యకార అనుసంధాన గ్రామాలు: 85

సామాజిక అటవీ ప్రాంతం: 19,302

చిత్తడి నేలలు: 6 వేల ఎకరాలు

రొయ్యల చెరువులు సాగు: 7 వేల ఎకరాలు

# వరుణుడు గర్జిం‘చేను’



ఉండి : ప్రతికూల వాతావరణం జిల్లాలో ఖరీఫ్ వరిసాగును ముంచేస్తోంది. ఈ నెల 14న కురిసిన అధిక వర్షంతో మునిగిన 17,775 ఎకరాల చేలు ఇంకా తేరుకోలేదు. వచ్చే అయిదో తేదీ లోపు ఆ నష్టాన్ని తేల్చే పనిలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. ఇంతలో వినాయక చవితి రోజున ఎడతెరపి లేకుండా జిల్లాలో పాలకొల్లులో అత్యధికంగా 84.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అత్తిలిలో 11.2 మి.మీ. కురిసింది. 17 మండలాల్లో 30 మి.మీ కంటే ఎక్కువ పడింది. దీంతో భీమవరం, కాళ్ల, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు తదితర మండలాల్లోని పల్లపు ప్రాంతాల్లో 500 ఎకరాల్లో చేలు జలదిగ్బంధంలో చిక్కాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడతాయని అధికారులు భావిస్తున్నారు. జూన్, జులైలో వర్షాభావ పరిస్థితులు, ఈ నెలలో అతివృష్టితో నూరుశాతం పూర్తి కాలేదు. నరసాపురం, యలమంచిలి, ఆచంట, మొగల్తూరు, పోడూరు తదితర మండలాల్లో మరో ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉందని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కురిసిన వర్షంతో మునిగిన చేలను గుర్తించి అవి కోలుకోకపోతే పంట నష్టం జాబితాల్లో చేరుస్తామని వివరించారు. **నిపుణుల సూచనలు తప్పనిసరి**

వర్షాలు.. మబ్బులతో కూడిన వాతావరణం వల్ల చేలు ఆకుపచ్చ రంగులోకి మారి ఆకుముడత, పొడతెగుళ్లు సోకే ప్రమాదముంది. ఇటువంటిచోట్ల నిపుణుల సూచనల్లేకుండా ఏవిధమైన రసాయనాలు పిచికారీ చేయొద్దు. పల్లపు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిన చోట్ల దుబ్బులు ఎర్రబడి సల్ఫైడ్ ఇంజూరి తెగులు బారిన పడితుండటాన్ని కాళ్ల, ఉండి వంటి మండలాల్లో గుర్తించాం. ఇటువంటిచోట్ల కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలి. తాటాకు తెగులు కనిపిస్తే హెక్సాకొనజోల్ 2 ఎంఎల్/ప్రొపికొనజోల్ ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. – ఎన్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి

# క్రీడలు ‘కల’శాల

కర్నూలు : జూనియర్, డిగ్రీ కళాశాలల్లో క్రీడా సౌకర్యాలు కరవయ్యాయి. వ్యాయామ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అంతర్ కళాశాలల పోటీలు మాత్రమే మొక్కుబడిగా జరుగుతున్నాయి. మిగతా పోటీలు ఎంపికలకే పరిమితం అవుతుండటం క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. మరోవైపు ప్రభుత్వ కళాశాలల్లో మైదానాలు ఉన్నా ఉపయోగం లేకుండాపోయింది. అరకొరగా ఉన్న ఆట పరికరాలు సైతం తుప్పు పట్టిపోతున్నాయి.

**కోటా పెంచినా.. పోటీల్లేవు**

ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటాను ప్రభుత్వం 3 శాతానికి పెంచింది. అన్ని క్రీడలకు అనుబంధ పోటీల పత్రాలుండాలి. లేకుంటే క్రీడా కోటా కోల్పోవాల్సి వస్తుందని క్రీడాకారులు వాపోతున్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు లేకపోవడంతో.. పాఠశాల స్థాయిలో రాణించిన క్రీడాకారులు ప్రైవేటుగా శిక్షణ పొంది ఎంపిక పోటీల్లో పాల్గొంటున్నారు. అలా.. లాన్‌టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, క్రికెట్ వంటి క్రీడల్లో ఆడుతున్నారు.

**ఆర్‌యూలో ‘ఆట’కెక్కించారు**

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 80 దాకా డిగ్రీ కళాశాలలు



ఉన్నాయి. వీటిలో పది ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. అన్ని కళాశాలల్లో కలిపి 20–30 మంది వ్యాయామ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కింద పలువురిని నియమించారు. దీంతో క్రీడలు నామమాత్రమయ్యాయి. వార్షిక క్రీడా పోటీలకు 15 నుంచి 20 కళాశాలల విద్యార్థులు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ప్రతిభావంతులను ఆర్‌యూ జట్టుకు ఎంపిక చేస్తున్నారు. సరైన శిక్షణ, ప్రోత్సాహం లేకపోవడంతో ఆశించిన మేర పతకాలు రావడం లేదని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలో..**

కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలో కేవీఆర్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మాత్రమే వ్యాయామ అధ్యాపకుడు ఉన్నారు.

**44 మందికి గాను ఉన్నది నలుగురే**


కర్నూలు జిల్లాలో 44 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో నలుగురు వ్యాయామ అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. కర్నూలు కేవీఆర్ జూనియర్, నందికొట్కూరు, ఆదోని, కర్నూలు టౌన్ జూనియర్ కళాశాలలో మాత్రమే వ్యాయామ అధ్యాపకులు ఉన్నారు. దీంతో జూనియర్ కళాశాల స్థాయిలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వలేని పరిస్థితి. పాఠశాల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్‌లో సత్తా చాటిన క్రీడాకారులే జూనియర్ కళాశాలల తరఫున ఆడుతున్నారు. కొత్త క్రీడాకారుల సంఖ్య నామమాత్రమే.

# కుందూలో కబ్జాల విందు

నంద్యాల : కుందూ నది యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతోంది. నంద్యాల నుంచి కోవెలకుంట్ల వరకు కబ్జాల పర్వం రోజురోజుకు పెరిగిపోతోంది. నీటి పారుదల శాఖ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకించి జిల్లా కేంద్రం నంద్యాలతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. నంద్యాల పట్టణంలో ఆర్టీసీ బస్టాండు వెనుక నుంచి బ్రాహ్మణపల్లె గ్రామం వరకు 9 కి.మీల పొడవునా కుందూ నది వెంబడి పలువురు కబ్జాలకు పాల్పడుతున్నారు. నదికి ఇరువైపులా ఉన్న మట్టి కట్టలను ధ్వంసం చేసి ఆక్రమించేస్తున్నారు. గతంలో కుందూ నది ఆధునికీకరణ కోసం ఏర్పాటుచేసిన సర్వే రాళ్లను సైతం పెకలించేస్తున్నారు. వందలాది ఎకరాల భూమి ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ అధికారులు దృష్టి సారించడం లేదు.

**బోర్లు, మోటార్లు ఏర్పాటుచేసి...**

ఆక్రమించుకున్న భూముల్లో పలువురు బోర్లు వేయడంతోపాటు ఇంజిన్ మోటారు ఏర్పాటుచేసుకుని సాగు చేసుకుంటున్నారు. మట్టి గట్లను తవ్వి చదును చేసి వరి, జొన్న పంటలు వేశారు. కర్నూలు బైపాస్ సమీపంలో ఆక్రమించిన పోరంబోకు స్థలంలో ఏకంగా మునగ తోటలను సాగు చేస్తున్నారు. కొందరు ప్రథమ నంది ఆలయం వెనుక



వైపు గట్లను ధ్వంసం చేసి తమ పొలాల్లో కలిపేసుకోవడం గమనార్హం. దీంతో ఏటా కుందూకు వరద వచ్చిన సమయంలో సమీప ప్రాంతాల్లోని పొలాలను ముంచెత్తుతోంది.

**27 కి.మీ. పొడవునా..**

నంద్యాల పట్టణం నుంచి గోస్పాడు మండలం తేళ్లపురి వరకు సుమారు 27 కి.మీ. పొడవునా కుందూ నది వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైంది. నంద్యాల, చాపిరేవుల, గుంతనాల, మిట్నాల, బ్రాహ్మణపల్లె, తేళ్లపురి, ఎస్.కూలూరు తదితర గ్రామాల్లో ఏకంగా బోర్లు వేసి విద్యుత్తు మోటార్లు అమర్చుకున్నారు. ప్రభుత్వ భూమికి విద్యుత్తు సదుపాయం ఎలా ఇచ్చారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆక్రమించిన కొన్ని భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు సైతం ఉండటం గమనార్హం. మరికొన్ని భూములకు పట్టాలు పుట్టించారు. వీటిని కొందరు విక్రయించి సొమ్ము చేసుకోగా.. మరికొందరు ‘మార్టిగేజ్’ చేసి రుణాలు పొందారు. **100 ఎకరాల వరకు**

నంద్యాల, పాణ్యం, కోవెలకుంట్ల నియోజకవర్గాల పరిధిలో కుందూ నది వెంబడి 100 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైంది. ఈ భూమి విలువ ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంది. నంద్యాలలో ఎకరా భూమి విలువ కనీసం రూ.2 కోట్ల వరకు ఉంది. కోవెలకుంట్ల, ఇతర గ్రామాల పరిధిలో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలు పలుకుతోంది. ఆక్రమణలకు గురైన భూమి విలువ రూ.50 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఇటీవల నంద్యాల బైపాస్ రహదారిలో కుందూ ఒడ్డున సుమారు 10 ఎకరాలను అక్రమార్కులు కబ్జా చేసి దర్జాగా సాగు చేస్తున్నారు. అక్రమార్కుల వెనక కొందరు నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి.

## పెరిగిన రద్దీ.. అసౌకర్యాలతో కుస్తీ!

అనంతపురం : ఆర్టీసీ బస్సుల్లో స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. దీంతో రద్దీ పెరిగింది. అందుకు అనుగుణంగా సౌకర్యాలు సమకూరలేదు. పథకం అమలుకు ముందు కనీస సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు చెప్పినా క్షేత్రస్థాయిలో పలుచోట్ల కార్యరూపం దాల్చలేదు. అనంతపురం, హిందూపురం బస్టాండ్లలో పారిశుద్ధ్య చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. తాగునీరు అందుబాటులో ఉండటం లేదు. తాడిపత్రి బస్టాండులో ఫ్యాన్లు తిరగడం లేదని ప్రయాణికులు వాపోయారు.

**ఉచితమైనా.. వసూళ్లు**

అనంత ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సాధారణ రోజుల్లోనే 60,500 మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత ప్రయాణంతో మహిళల సంఖ్య పెరిగింది. మూత్రశాలను ఉచితంగా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉన్నా రూ.10 వరకు వసూలు చేస్తున్నారు. తాడిపత్రిలో మహిళలకు ఉచితంగా వినియోగించే మరుగుదొడ్లు రెండే ఉన్నాయి. హిందూపురం బస్టాండులో ప్రయాణికులు మూత్రవిసర్జన చేయాలన్నా రూ.5 చెల్లించుకోవాలి. ప్రస్తుతం ఉన్న 8 మరుగుదొడ్లు సరిపోడటం లేదు. స్వచ్ఛభారత్ కింద బస్టాండు ఆవరణలో స్త్రీ, పురుషుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలల నిర్వహణ చేయలేక మూసివేశారు. దీనిపై డిపో మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మూత్రశాలల నిర్వహణకు



నిధులు లేవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బస్టాండును పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.


**తగిన చర్యలు తీసుకుంటాం..**రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాం. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి శుభ్రం చేయిస్తున్నాం. ప్రయాణ ప్రాంగణాల్లో అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.శ్రీలక్ష్మి, జిల్లా ప్రజారవాణా అధికారిణి, అనంతపురం

**అనంత జిల్లాలో..**

ఆర్టీసీ డిపోలు: 7
మొత్తం బస్సులు: 521
రోజూ ప్రయాణించేవారు: 1.90 లక్షల నుంచి 2 లక్షలు
రోజువారీ ఆదాయం: సుమారు రూ.70లక్షలు

## అడ్డేదెవరు.. ఆపేదెవరు!

అనకాపల్లి : వందల ఎకరాలకు సాగునీటి భరోసా అందిస్తున్న మాకవరపాలెంలోని పాపయ్యపాలెం జలాశయం అక్రమార్కుల కన్నుపడి బక్కచిక్కిపోతోంది. వీటిని సంరక్షించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాపయ్యపాలెం రిజర్వాయర్ సుమారు 90 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని నుంచి పాపయ్యపాలెం, బుచ్చయ్యపాలెం, ముసిడిపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాలకు ఏటా నీరు అందుతుంది. గత తెదేపా హయాంలో రిజర్వాయర్ పరిధిలోని ఆక్రమణలు తొలగించారు. దీంతోపాటు రూ.70 లక్షలకు పైగా ఖర్చుచేసి.. పంటకాలువలు, మదుములు అభివృద్ధి చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజర్వాయర్ భూములపై ఆ పార్టీ నాయకుల కన్నుపడింది. మూడేళ్ల క్రితం కొంతమంది 15 ఎకరాలకు పైగా చదునుచేసి ఆక్రమించుకుని సరుగుడు తోట వేశారు. దీనిపై గతంలో ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఇదే అవకాశంగా భావించి మరికొంతమంది ఆక్రమణలకు బరితెగించారు. ఒకరితో ఒకరు పోటీపడి ట్రాక్టర్లతో దున్ని.. సరుగుడు, అరటి తోటలు సాగు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఈ జలాశయం ఆక్రమణలను పట్టించుకోవడం లేదు. దీంతో అన్ని పార్టీల నేతలూ కుమ్మక్కయి మరో 16 ఎకరాలు ఆక్రమించి యంత్రాలతో చదును చేశారు. ఈ విషయాన్ని జలవనరులు, రెవెన్యూ అధికారుల దృష్టికి స్థానిక రైతులు తీసుకెళ్లినా అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి నీరు చేరుతోంది. జలాశయం నిండితే తాము ఆక్రమించిన భూములు నీటమునుగుతాయనే ఉద్దేశంతో అక్రమార్కులు కావాలనే అనధికారిక



గా రిజర్వాయర్ గేట్లు ఎత్తేస్తున్నారు. దీంతో ఎంత వర్షాలు పడినా రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండటం లేదు. దీంతో ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేకుండా పోతోంది. తాజాగా ఇంకొకరు ఆక్రమణలకు రంగం సిద్ధం చేసుకున్నారు. తెదేపా మండల మహిళ అధ్యక్షురాలు రమణమ్మ ఉప తహసీల్దారుకు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ అధికారులు వెళ్లి ఆక్రమణలను అడ్డుకున్నారు. కానీ పాత ఆక్రమణలవైపు కన్నెత్తి కూడా చూడలేదు.

త్వరలో హద్దులు నిర్ణయిస్తాం

రిజర్వాయర్ ఆక్రమణలపై ఇటీవల ఫిర్యాదులు అందాయి. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. ఆర్ఐ, ఏఈ, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓ లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశాం. త్వరలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. వెంకటరమణ, తహసీల్దారు, మాకవరపాలెం

## పుడుతోంది.. కుడుతోంది!



గుత్తి : పురపాలికల్లో 'దోమ పుట్టరాదు.. కుట్టరాదు' అన్న నినాదం కాగితాలకే పరిమితమవుతోంది. గత నెల రోజులుగా పడుతున్న వర్షాలకు వాతావరణంలో మార్పులొచ్చాయి. అన్ని ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో దోమల ఉద్ధృతి పెరిగింది. ఫలితంగా సీజనల్‌వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వాటికి సంబంధించిన ఫాగింగ్ యంత్రాలకు మూలకు చేరాయి. దీంతో రెండు పురపాలికల్లోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా, టైఫాయిడ్, ఇతరత్రా విషజ్వరాలు బాధితుల రోజురోజుకీ పెరిగిపోతున్నారు.

**రెండు చోట్ల ఇదీ పరిస్థితి**

గుత్తితోపాటు తాడిపత్రి పురపాలికల్లో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న ఫాంగింగ్ యంత్రాలను మూలనపెడుతున్నారు. ఒక్కో యంత్రాన్ని రూ.2లక్షలు వ్యయం చేసి కోనుగోలు చేశారు. పదేళ్ల కిందట వరకు గుత్తి,చెట్నేపల్లి మేజర్ పంచాయతీల్లో ఉన్న యంత్రాలు తుప్పుపట్టి పాడయ్యాయి. వాటిని వినియోగంలోకి తేకుండా వదిలేయడంతో ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఐదేళ్ల కిందట గుత్తి పురపాలిక అధికారులు రెండు ఫాగింగ్ యంత్రాలు కొన్నారు. అవి కూడా వినియోగించకుండానే మూలకు చేరాయి. తరువాత కొత్తగా మూడింటిని కొన్నారు. ప్రస్తుతం అవి స్టోర్ గదిలో వృథాగా దర్శనమిస్తున్నాయి.తాడిపత్రి పురపాలికలోనూ ఒకటి పెద్దది, మరో రెండు చిన్న యంత్రాలు ఉన్నాయి. అవి వినియోగంలోలేక తప్పుపడుతున్నాయి. ఆరు నెలలుగా దోమల తీవ్రత ఎక్కువగా ఉన్నా ఫాగింగ్ చర్యలు లేవని జనం వాపోతున్నారు. అప్పుడప్పుడు పెద్ద యంత్రంతో ఫాగింగ్ చేస్తున్నా సత్ఫలితాలు ఉండటం లేదు. ప్రస్తుతం దోమల వృద్ధి ఎక్కువగా ఉంది. ప్రధానంగా నందలపాడు, జయనగర్ కాలనీ, అంబేద్కర్‌నగర్, టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్ పలు కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది.

**సమస్యను పరిష్కరిస్తాం**

గుత్తి పురపాలికల్లో ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తెస్తాం. ప్రతి వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. మురుగుకాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయడంతోపాటు దోమల లార్వాను కట్టడికి చర్యలు తీసుకుంటాం.తాడిపత్రిలో కొన్ని నెలలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. అయినా సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి కాలనీల్లో ఫాగింగ్ చర్యలు చేపడతాం.మహబూబ్‌బాషా, రాంప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, డీఈ, గుత్తి, తాడిపత్రి

## పేదల కాలనీల్లో అవినీతి మేడలు!



అనంతపురం : కంబదూరులో 'పేదలందరికీ ఇళ్లు' పథకం కాలనీలోని 232709ఎన్‌పీ19582941 ఐడీలో కేవలం బేస్‌మెంట్ పూర్తయిన ఇంటికి రూఫ్‌లెవెల్ పూర్తయినట్లు బిల్లులు మంజూరు చేశారు. అదే కాలనీలో 232709ఎన్‌పీ16999896లోనూ పునాది పూర్తయిన నిర్మాణానికి బిల్లు కట్టబెట్టారు. ఒక్క కంబదూరు లేఅవుట్‌లోనే 52 ఇళ్లకు అక్రమంగా బిల్లులు మంజూరు చేశారు. కళ్యాణదుర్గం పట్టణ పరిధిలో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల పేరుతో నిధులు దోచేశారు. పునాదులు కూడా పడని ఇళ్లకు బిల్లులు మంజూరు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 120 ఇళ్లకు సంబంధించి రూ.లక్షల్లో నొక్కేశారు. వైకాపా నాయకుల అండతో జియో ట్యాగింగ్‌ను సైతం పక్కదారి పట్టించారు. ఒక్కో ఇంటి ముందు ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులను వేర్వేరుగా నిల్చోబెట్టి ఫొటోలు తీసి.. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. పేదవాడి సొంతింటి కల సాకారం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. గృహ నిర్మాణశాఖలోని కొందరు అవినీతి అధికారుల తీరుతో ప్రభుత్వ సాయం పక్కదారి పడుతోంది. గత వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన పలువురు అధికారులు జగనన్న కాలనీల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడ్డారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో నిర్మాణాలు పూర్తికాకుండానే బిల్లులు మంజూరు చేశారు. కంబదూరులో 241 ఇళ్లు మంజూరు చేశారు. అప్పటి ఏఈ వైకాపా నాయకులతో అంటకాగుతూ పార్టీ సానుభూతిపరులకు బిల్లులు కట్టబెట్టారు. నిర్మాణాలు మొదలుపెట్టని వారికి సైతం రూ.70 వేలు చొప్పున జమ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కంబదూరు ఏఈని అనంతపురం గ్రామీణానికి బదిలీ చేశారు. ఆయన్ను మళ్లీ అదే స్థానానికి బదిలీ చేయడం గమనార్హం. ప్రస్తుతం అవినీతి లెక్కలన్నింటినీ సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు.


**ఉన్నతాధికారి సహకారంతోనే..**

గత ప్రభుత్వంలో కళ్యాణదుర్గం డివిజన్‌లో పనిచేసిన ఓ అధికారి అక్రమాలకు సహకరించారనే ఆరోపణలు వస్తున్నాయి. కంబదూరులో ఓ ఏఈ, కళ్యాణదుర్గంలో ఇద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, మరో ఏఈ సాగించిన అవినీతి దందాను చూసీచూడనట్లుగా వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. అక్రమంగా బిల్లుల మంజూరుకు ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. సదరు అధికారి కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నత పోస్టులో కూర్చున్నారు.

**ముందస్తు చెల్లింపులు నిజమే..**

కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాంతాల్లో కొందరు లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించిన మాట వాస్తవమే. తర్వాత ఏఈలు లబ్ధిదారులను పిలిపించి నిర్మాణాలు పూర్తిచేయాలని చెప్పారు. ఇప్పుడు చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. ముందస్తుగా బిల్లులు ఎందుకు చెల్లించారనేది తెలియదు.
విజయ్‌భాస్కర్, ఇన్‌ఛార్జి డీఈ, కళ్యాణదుర్గం

## పంటకు రక్ష.. సోలార్ కంచె



ముదిగుబ్బ : రైతులు పంటలు సాగు చేయడం ఒక ఎత్తైతే.. వాటిని కాపాడుకోవడం మరోఎత్తు. విత్తనం విత్తింది మొదలు.. కోత కోసే వరకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నా కొన్నేళ్లుగా వన్యప్రాణుల బెడద పెరిగింది. ముదిగుబ్బ మండలంలోని అటవీ ప్రాంతంలో ఎక్కువగా మొక్కజొన్న, వేరుసెనగ ఇతర ఉద్యాన పంటలు సాగు చేశారు. పంటలను పందులు, జింకలు, కోతులు పాడు చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు కాపలా ఉంటూ రైతులు శ్రమిస్తున్నారు. పొలాలు చుట్టూ ఇనుప కంచె, మైక్‌సెట్లు ఏర్పాటు చేయడం, చీరలు కట్టడం, ప్లేట్లు, బీరుసీసాలు వేలాడదీయడం, తప్పెట్లు, డబ్బాలు కొట్టడం ఇలా అనేక పద్ధతులు అనుసరించారు. వాటి నుంచి వెలువడే శబ్దాలకు అలువాటు పడిన జంతువులు లెక్క చేయకుండా మూకుమ్మడిగా వచ్చి పంటలను నాశనం చేస్తుండటంతో రైతు కష్టం వృథాగా మారుతోంది. ముదిగుబ్బలోని కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి ప్రాణహానిలేని సోలార్ ఫెన్సింగ్ వైపు ఆసక్తి చూపుతున్నారు. దాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పంటకు రక్షణగా ఉందని రైతులు చెబుతున్నారు.

**ప్రాణహాని లేకుండా..**

సోలార్ కంచెతో పంటకు రక్షణతోపాటు వన్యప్రాణులకు ఎటువంటి హాని ఉండదు. ఇది ఎలా పని చేస్తుందంటే..

పొలంలో ఒక స్తంభానికి 12 ఓల్టులు లేదా 15 ఓల్టులు ఉత్పత్తి సామర్థ్యమున్న సోలార్ ప్యానెల్, బ్యాటరీ, అర్తింగ్ ఏర్పాటు చేసుకుంటారు.పొలం చుట్టూ మూడు వరుసలుగా తీగలు చుట్టాలి. ఇన్సులేటర్ ఉపయోగిస్తే భూమికి విద్యుత్తు సరఫరా కాదు.

సౌర పలక ద్వారా వచ్చే విద్యుత్తు బ్యాటరీలో నిల్వ ఉండటంతో రాత్రివేళల్లోనూ పని చేస్తుంది.జంతువులు తీగకు తగిలినప్పుడు షాక్ కొడుతుంది. విద్యుత్తు నిరంతరం సరఫరా కాకుండా సెకను సెకనుకు మధ్య ఆన్ అండ్ ఆఫ్ అవుతుండటంతో ప్రాణహాని ఉండదు. సెకనుకి ఒక పల్స్ విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. పొలం చుట్టూ తీగలు ఏర్పాటు చేసే క్రమంలో 10 అడుగులకు ఒక కర్ర లేదా సిమెంటు స్తంభాలు నాటి తీగలు ఒకదానికొకటి తగలకుండా టైట్‌గా ఏర్పాటు చేసుకోవాలి. పొలం దగ్గర డేంజర్ అని బోర్డు ఏర్పాటు చేసుకోవాలి. సోలార్ ప్యానెల్, బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. సుమారు ఐదు ఎకరాల వరకు పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవచ్చు.

## వేగంగా పనులు.. తీరనున్న కష్టాలు

పెనుకొండ : గత ఐదేళ్ల వైకాపా పాలనలో కియా ఇండియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమలకు అవసరమైన ఉపరితల వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కియా ఉపరితల వంతెన నిర్మాణానికి రూ.98 కోట్లతో ఇటీవల పనులు ప్రారంభించారు. శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 18నెలల వ్యవధిలోనే పూర్తి చేసేవిధంగా అధికారులు చర్యలు చేపడతున్నారు.

**జాతీయ రహదారి, రైల్వే డబుల్ లైన్..**

కియా ఇండియా పరిశ్రమకు కారు విడి భాగాలు సరఫరా చేసే పలు అనుబంధ పరిశ్రమలకు మధ్య 44వ జాతీయ రహదారి, రైల్వే డబుల్‌లైన్ ఉన్నాయి. దుద్దేబండ కూడలి మీదుగా గొల్లపల్లి రహదారి పక్కన ఉన్న అనుంబధ పరిశ్రమల నుంచి, పాలసముద్రం వద్ద ఉన్న కియా సైట్–బీలోని 18 అనుబంధ పరిశ్రమల నుంచి కార్ల విడిభాగాలు



కంటైనర్లతో సరఫరా చేస్తుంటారు. ప్రతిరోజు వందలాది కంటైనర్లు కారు విడిభాగాలను కియా ఇండియాకు చేరవేయడం కారణంగా 44వజాతీయ రహదారి పై నిత్యం ట్రాఫిక్ అంతరాయం తలెత్తడంతో పాటు పలు సందర్భాల్లో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

**పరిశ్రమ ప్రారంభంలోనే శ్రీకారం**

ప్రమాదాలు జరగకుండా పరిశ్రమ ప్రారంభంలోనే ఉపరితల వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో కేవలం వంతెన నిర్మాణానికి అవసరమైన దాదాపు 35ఎకరాల భూసేకరణ మాత్రమే చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణం పూర్తయితే కియా పరిశ్రమకు సంబంధించిన వందలాది వాహనాలు జాతీయ రహదారి మీదకు రాకుండానే పరిశ్రమకు చేరుకునే విధంగా వంతెన రూపుదిద్దుకుంటోంది.

## మంత్రి చెప్పినా పరిస్థితి మామూలే..

కొమ్మాది : మంత్రి నారా లోకేశ్ ఆదేశించి ఏడాది కావస్తున్నా చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడామైదానం రూపురేఖలు మారలేదు. స్వయంగా ఆయన గత ఏడాది ఆగస్టులో చెరువును తలపిస్తున్న మైదానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో తూతూమంత్రంగా చర్యలు చేపట్టి మమా అనిపించారు. ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించేందుకు ఈ నెల 29న మంత్రి మళ్లీ పాఠశాలకు రానునున్నారు. ప్రస్తుత వర్షాలకు మైదానమంతా బురదమయంగా మారింది. ఈ దుస్థితిని చూసి మంత్రి ఎలా స్పందిస్తారోనని జిల్లా యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది.

**నాడు ఇలా..:** గత వైకాపా హయాంలో నాడు–నేడు కింద రూ.5 లక్షలు వెచ్చించి మైదానంలో వర్షపునీరు నిలిచిపోకుండా నాలుగువైపులా ఇంకుడు గుంతల మాదిరి తవ్వి పైపుల ద్వారా వర్షపునీటిని మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. అప్పట్లో సాంకేతికంగా సరైన



పద్ధతిలో పనులు చేపట్టకపోవడంతో పరిస్థితి యథాస్థితికి చేరింది.

**అంచనాలు రూపొందించినా:** గతేడాది మంత్రి లోకేశ్ పరిశీలించిన తర్వాత క్రీడామైదానం అభివృద్ధికి సమగ్ర శిక్షా ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. మైదానం చుట్టూ కాలువలు ఏర్పాటు చేసి వర్షపునీరు ప్రధాన గెడ్డలోకి మళ్లించడం, మైదానం చదును, తాగునీటి ట్యాంక్ నిర్మాణం తదితర పనులపై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో ఆ పనులు కార్యరూపం దాల్చలేదు.

**అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం..:** విద్యార్థులు, ఉపాధ్యాయులు సాఫీగా తరగతుల గదులకు రాకపోకలు సాగించేలా మైదానాన్ని తీర్చిదిద్దుతాం. ప్రధానంగా అక్కడి నుంచి నీటిని మళ్లించేలా చర్యలు తీసుకుంటాం. అంతేగాక విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం పొందేందుకు మైదానం అభివృద్ధి చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తాం. అందుకు తగ్గ నిధులు కేటాయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.
డాక్టర్ జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్ర శిక్షా

## ఆంక్షలు పట్టక... ఆక్రమణలు గుట్టుగా!


మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం ప్రాంతంలో భూఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూశాఖాధికారుల ఆంక్షలు, హెచ్చరికలు సైతం బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వ, బంజరు, అసైన్‌మెంట్, వాగుపోరంబోకు, ఇనాం, ప్రైవేటు, పట్టా భూములను సైతం ఆక్రమించుకుని వందల ఎకరాలు కొల్లగొడుతున్నారు. అక్రమార్కులు నేతలు, రెవెన్యూశాఖ అధికారులతో చేతులు కలిపి వారికి ఎంతోకొంత ముట్టచెప్పి తాజాగా వాగుపోరంబోకు భూములను ఆక్రమించేశారు. ఆక్రమిత 50 ఎకరాల్లో వరి సాగుకు ఇటీవల భూమిని సైతం దుక్కి సిద్ధం చేశారు. ఇక్కడ పంటలు సాగు చేసుకోవడానికి ఓ అధికారి అక్రమార్కుల నుంచి భారీగా డబ్బులు వసూళ్లు చేసినట్లు ఆరోపిణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణదారులు ప్రస్తుతం ఆక్రమించిన 50 ఎకరాల భూమి విలువ రూ.5 కోట్లపైనే ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు కె.చిరంజీవి మాట్లాడుతూ నోటీసులు జారీ చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మార్కాపురం మండలం బొందలపాడు గ్రామంలోని సర్వే సంఖ్య 569లో 91.49 ఎకరాల వాగుపోరంబోకు భూమి ఉంది. ఇందులో సారవంతమైన 50 ఎకరాల్లోని భూములను ఆక్రమించుకుని ఎవరికి ఇష్టమొచ్చినట్లు వాళ్లు పంటలు సాగు చేసుకుంటూ కంచెలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ వాగుపోరంబోకు భూమిని ఎవరైనా ఆక్రమించినా, పంటలు సాగు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని గతేడాది రెవెన్యూశాఖాధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమార్కులు ఆంక్షలు, హెచ్చరికలు బేఖాతరు చేస్తూ 50 ఎకరాల వరకు ఆక్రమించేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

చురకలు



## 29 ఏళ్ల రష్మిక ఫిట్నెస్ సీక్రెట్ అదేనా?

ఒకప్పుడు సినిమాలలో హీరోలు కానీ హీరోయిన్లు కానీ చాలా బొద్దుగా కనిపించేవారు. ముఖ్యంగా హీరోయిన్స్ బొద్దుగా ఉంటేనే అందంగా ఉంటారు అని దర్శక నిర్మాతలు కూడా వారికి సలహాలు ఇచ్చేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ ఇటు అభిమానులలో కూడా అభిరుచులు పూర్తిగా మారిపోతున్నాయి.. అందులో భాగంగానే ఇప్పుడు జీరో ఫిగర్ మెయింటైన్ చేసే హీరోయిన్స్ కే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అటు శారీరకంగా ఇటు మానసికంగా ఫిట్ గా ఉండాలని కోరుకుంటున్నారు కూడా.. అందులో భాగంగానే సెలబ్రిటీలు కూడా ఫిట్నెస్ గా ఉండడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అటు ఆహారం విషయంలోనే కాదు ఇటు ఆరోగ్యం విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళుతున్నారు. అందుకేనేమో 60 సంవత్సరాల వయసు వచ్చినా సరే ఇంకా 16 ఏళ్ల పడుచు పిల్లలా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు హీరోయిన్స్. ఇదిలా ఉండగా నేషనల్ క్రష్ గా గుర్తింపు తెచ్చుకున్న రష్మిక మందన్న తన ఫిట్నెస్ సీక్రెట్ గురించి బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఈమె వయసు 29 సంవత్సరాలు.. ఈమెను చూస్తే ఇంకా 16 ఏమో అనకమానరు అని అభిమానులు కూడా కామెంట్లు చేస్తూ ఉంటారు. మరి రష్మిక మందన్న ఇంత




యంగ్ గా కనిపించడానికి ఏం చేస్తుంది? ఆమె ఫిట్నెస్ సీక్రెట్ ఏంటి? ఇలా పలు విషయాలు ఆమె స్వయంగా తెలియజేయడం గమనార్హం. మరి రష్మిక ఫిట్నెస్ సీక్రెట్ ఏంటో మనం కూడా ఒకసారి తెలుసుకుందాం. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక ఎట్టకేలకు తన ఫిట్నెస్ రహస్యాలను బయటపెట్టింది. ఆమె మాట్లాడుతూ.." నేను ప్రతిరోజు ఉదయం లేవగానే లీటర్ నీళ్లు తాగుతాను. ఆపిల్ సైడర్ వెనిగర్ తీసుకుంటాను. నేను పూర్తిగా శాకాహారిగా మారిపోయిన తర్వాత మాంసాహారం తీసుకోవడం మానేశాను. అలాగే ఎక్కువగా వరి అన్నం కూడా తినను. టమాటో, బంగాళదుంప వంటి వాటికి దూరంగా ఉంటాను. వీటిని తినడం వల్ల నాకు అలర్జీ వస్తుంది. ఇక నిత్యం సాయంత్రం వేళ వ్యాయామం చేస్తాను" అంటూ రష్మిక తెలిపింది. మొత్తానికైతే రష్మిక ఫాలోవర్స్ ఈమె చెప్పిన ఫిట్నెస్ సీక్రెట్ తెలుసుకొని మేము కూడా ఇదే ఫాలో అవుతాం అంటూ కామెంట్స్ చేస్తూ ఉండడం గమనార్హం. రష్మిక మందన్న విషయానికి వస్తే.. గత మూడేళ్లలో వరుసగా వరుస బ్లాక్ బాస్టర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తోంది ఇప్పటికే పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, కుబేర అంటూ వరుస చిత్రాలతో సక్సెస్ జోరు మీద ఉంది ఈ ముద్దుగుమ్మ.. అందులో భాగంగానే మరొకవైపు విజయ్ దేవరకొండ హీరోగా చేస్తున్న ఒక సినిమాలో హీరోయిన్గా అవకాశం దక్కించుకుంది. అంతేకాదు అల్లు అర్జున్ 22వ మూవీలో కూడా అవకాశం అందుకుంది రష్మిక.. ఈ చిత్రాలతో పాటు థామా, కాంచన 4 వంటి హారర్ సినిమాలలో కూడా భాగమయ్యింది. అంతేకాదండోయ్ ది గర్ల్ ఫ్రెండ్, రెయిన్బో అంటే చిత్రాలలో కూడా ఈ ముద్దుగుమ్మ నటిస్తోంది.

## దీపిక ఇక డేట్ అయిపోయిన హీరోలకే సూటబుల్

దీపిక పదుకొనే బ్యాక్ టు బ్యాక్ బిగ్ బ్లోని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ప్రభాస్ సరసన వరుసగా రెండు పాన్ ఇండియా సినిమాల్లో అవకాశం వస్తే, ఆ రెండిటినీ తన అవివేకంతో కోల్పోయిందని చాలా మంది క్రిటిసైజ్ చేస్తున్నారు. ప్రెజెంట్ ఇండస్ట్రీలో ట్రెండింగ్ డైరెక్టర్లుగా పాపులరైన సందీప్ రెడ్డి వంగా, నాగ్ అశ్విన్ లతో కలిసి పని చేసే అవకాశాన్ని కాలరాసుకుంది. ఆ రెండు క్రేజీ ప్రాజెక్టుల నుంచి వైదొలగడమే గాక, తాను తన 18 ఏళ్ల కెరీర్ లో ఒకే హీరోతో ఆరు సార్లు కలిసి పని చేసాను! అంటూ చాలా అమాయకంగా షారూఖ్ పేరును సూచించింది. ఖాన్ నటిస్తున్న కింగ్ సెట్స్ లో చేరినట్టు కూడా వెల్లడించింది. ఓం శాంతి ఓంలో నటించినప్పుడు షారూఖ్ నేర్పించిన విద్య గురించి కూడా చాలా ఘనంగా చెప్పుకొచ్చింది. తన వ్యక్తిగత సౌకర్యానికి భంగం కలిగే విధంగా షూటింగులకు హాజరు కాలేనని తెగేసి చెప్పింది. అయితే దీనిపై చాలామంది కొంటె నెటిజనులు టైమింగ్ లీ పంచ్ లు వేస్తున్నారు. కింగ్ ఖాన్ వయసు కొన్ని దినాలు గడిస్తే 60కి



చేరుకుంటుంది. షష్టిపూర్తికి చేరువవుతారు. ఆయన ఓల్డ్ స్కూల్ ని దీపిక ఫాలో అవుతోందని కొందరు సెటైర్లు వేస్తున్నారు. జమానా కాలంలో ఫార్ములాను ఇప్పటి జెన్ జెడ్ ట్రెండ్ కి అప్లయ్ చేయాలనుకుంటే నష్టపోయేది దీపిక మాత్రమేనని కూడా సూచిస్తున్నారు. 60 ప్లస్ ఖాన్ లతో అవకాశాల కోసం 40 ప్లస్ యువహీరోలతో అవకాశాల్ని కాదనుకోవడం సరికాదని సూచిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ రెండు సినిమాల్లో 45 వయసు యువకుడైన ప్రభాస్ తో నటించే అవకాశం వస్తే, కాలదన్నుకోవడం అవివేకమని, రెండు సినిమాల రూపంలో ఏకంగా రూ.40 కోట్లు నష్టపోయిందని కూడా విశ్లేషిస్తున్నారు. ఈ నష్టం ఇక్కడితో ఆగిపోదు.. రెండు భారీ చిత్రాల నుంచి తొలగించారనే అపప్రద కారణంగా, ఇతర పెద్ద బ్యానర్లు కూడా అవకాశాలిచ్చేందుకు వెనకాడితే ఆ నష్టం 100 కోట్లు! అని కూడా విశ్లేషిస్తున్నారు. ప్రభాస్ మరోసారి దీపికను పిలిచి అవకాశం ఇవ్వగలడా? అనేది ఒక పెద్ద చిక్కు ప్రశ్న. ఎవరైనా నటి కన్ఫామ్ గా హిట్లు కొట్టే దర్శకులతో ట్రెండ్ లో ఉన్న హీరోతో క్రేజీ సినిమాల్లో నటించినప్పుడే బ్రాండ్ అండార్స్ మెంట్లలోను దూసుకుపోగలదు. ఆ రకంగా వాటికి కూడా గండి పడినట్టేనని కూడా అంచనా వేస్తున్నారు. అసలే కెరీర్ బ్యాడ్ ఫేజ్ లో ఉన్న ఈ సమయంలో దీపిక ఇలాంటి తప్పు చేయకూడదని కూడా సూచిస్తున్నారు.




## జాన్వీ కపూర్ ఇవి డ్యాన్సులా కసరత్తులా?



నేటితరం ఫ్యాషనిస్టాగా ఓ వెలుగు వెలుగుతున్న జాన్వీ కపూర్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటించిన పరమ్ సుందరి విడుదలైన నెలరోజులకే సన్నీ సంస్కారీ కి చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో వరుణ్ ధావన్ సరసన జాన్వీ, సన్యా మల్హోత్రా నటించారు. ప్రస్తుతం చిత్రబృందం రిలీజ్ ప్రమోషన్స్ లో బిజీ బిజీగా ఉంది. జాన్వీ కూడా ప్రమోషన్స్ లో స్పీడ్ గా పాల్గొంటోంది. అదే సమయంలో జాన్వీకపూర్ డ్యాన్స్ మూడ్ లో ఉన్న కొన్ని వీడియోలను తన సోషల్ మీడియాల్లో షేర్ చేయగా అవి వైరల్ గా మారుతున్నాయి. తాజాగా జాన్వీ షేర్ చేసిన ఓ డ్యాన్సింగ్ వీడియోలో స్పెషల్ డిజైనర్ లుక్ తో ఆకర్షించింది. ముఖ్యంగా జాన్వీకపూర్ హైఎనర్జీతో అద్భుతమైన డ్యాన్సులతో ఆకట్టుకుంటోంది. జాన్వీ ఇన్ స్టాలో షేర్ చేసిన వీడియోలో షార్ట్ - స్ట్రాప్ లెస్ టాప్ ధరించి ఎంతో అందంగా కనిపిస్తోంది. వేరొక వీడియోని పరిశీలిస్తే.. ఒక ఎల్లో క్యాబ్ ని ఆనుకుని జాన్వీ మేని విరుపుల స్టెప్పులు ఆకట్టుకున్నాయి. అలాగే స్టూడియోలో డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తూ కూడా కనిపించింది. అయితే చాలా వరకూ బ్రేక్ డ్యాన్స్ లు ప్రాక్టీస్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. శరీరాన్ని కావాల్సిన విధంగా మలుస్తూ జాన్వీ చాలా హార్డ్ గానే డ్యాన్సులను ప్రాక్టీస్ చేస్తోంది. అయితే ఈ డ్యాన్సుల శైలి పరిశీలించాక.. ఇవి డ్యాన్సులా కసరత్తులా? అంటూ అభిమానులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. జాన్వీ కపూర్ ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్ది చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిపిందే. ఈ సినిమా సంక్రాంతి బరిలో విడుదల కావాల్సి ఉంది.

## ఇడ్లీ కొట్టు.. ధనుష్ వల్ల మాత్రమే సాధ్యం..!




స్టార్ ఇమేజ్ ఉన్నా కూడా ధనుష్ చేసే సినిమాలు విచిత్రంగా ఉంటాయి. ఎలాంటి కథకు అయినా సరిపోయేలా తన ఇమేజ్ ని సెట్ చేసుకున్నాడు. అటు కమర్షియల్ సినిమా అయినా సరే ఇటు ఎమోషనల్ సెన్సిటివ్ సినిమా అయినా సరే ధనుష్ తనను తాను మార్చుకునే విధానం ఇంప్రెస్ చేస్తుంది. ఇక అతని డైరెక్షన్ లో వచ్చే సినిమాలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. రెండేళ్ల క్రితం రాయన్, జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమా డైరెక్ట్ చేసిన ధనుష్ లేటెస్ట్ గా ఇడ్లీ కొట్టు సినిమా తీశాడు. ఆ సినిమా అక్టోబర్ 1న రిలీజ్ కాబోతుంది.

**ఇడ్లీ కొట్టు ట్రైలర్..** ఇడ్లీ కొట్టు ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ చూస్తే సినిమా దాదాపు అర్ధమవుతుంది. ఒక పెద్ద రెస్టారెంట్ లో చెఫ్ గా పనిచేసే హీరో.. ఆ హోటల్ లాభాలకు కారణం అవుతాడు.

ఆ హోటల్ యజమాని అతన్ని పొగిడినా అతని కొడుకు మాత్రం అతన్ని పనోడని అవమానిస్తాడు. ఆ టైం లో తన ఊరిలో తండ్రి పెట్టిన ఇడ్లీ కొట్టు గుర్తుకొస్తుంది. ఇంటికి వెళ్లి దాన్ని మళ్లీ ఓపెన్ చేసి సక్సెస్ అవుతాడు. ఐతే హీరో పనిచేసే రెస్టారెంట్ ఓనర్ కొడుకు హీరోని డిస్టర్బ్ చేస్తుంటాడు. హీరోని టార్గెట్ చేసిన అతనికి హీరో ఎలా ఆన్సర్ ఇచ్చాడు అన్నది సినిమా కథ. ట్రైలర్ చూస్తేనే ఇదొక మంచి ఎమోషనల్ మూవీగా అనిపిస్తుంది. ధనుష్ పర్ఫెక్ట్ గా అన్ని కుదిరేలా చేసుకున్నాడు. అరుణ్ విజయ్, నిత్యా మీనన్, సత్యరాజ్ పాత్రలు సినిమాలో బలంగా మారనున్నాయి.

**రాయన్ తో కాన్ఫిడెన్స్..** ధనుష్ ఆల్రెడీ కుబేరతో ఈ ఇయర్ సక్సెస్ అందుకున్నాడు. ఈసారి ఇడ్లీ కొట్టు అని మరో ఎమోషనల్ స్టోరీతో వస్తున్నాడు. ఈ సినిమాను డాన్ పిక్చర్స్, వండర్ బార్ ఫిలింస్ కలిసి నిర్మిస్తున్నారు. ధనుష్, ఆకాష్ భాస్కరన్ కలిసి నిర్మిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 1న వస్తున్న ఇడ్లీ కొట్టు ఏమేరకు ప్రేక్షకులను మెప్పిస్తుందో చూడాలి. ధనుష్ నుంచి వస్తున్న మరో మంచి మూవీగా ఇడ్లీ కొట్టు అనిపిస్తుంది. ఎందుకంటే ఆడియన్స్ పల్స్ బాగా తెలిసిన ధనుష్ ఎలాంటి సినిమా తీస్తే వాళ్లు ఇంప్రెస్ అవుతారన్నది బాగా తెలుసుకున్నాడు. హీరోగా చేస్తూ డైరెక్షన్ చేయడం చాలా రిస్క్. అయినా కూడా అందులో కూడా సక్సెస్ అవుతున్నాడు. రాయన్ సినిమా అతనికి మంచి కాన్ఫిడెన్స్ ఇచ్చింది. జాబిలమ్మ నీకు అంత కోపమా యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా వచ్చింది. ఐతే ఇడ్లీ కొట్టు మాత్రం ధనుష్ చాలా ఇష్టపడి చేసిన సినిమాగా అనిపిస్తుంది.

దసరా బరిలో సెప్టెంబర్ 25న ఓజీ సినిమా రిలీజ్ అవుతుంది. ఆ నెక్స్ట్ అక్టోబర్ 2న కాంతారా ప్రీక్వెల్ సినిమా వస్తుంది. ఈ రెండు సినిమాల మధ్య ఎమోషనల్ రైడ్ గా ఇడ్లీ కొట్టు వస్తుంది. మరి ఈ రెండిటి మధ్య పోటీలో ఇడ్లీ కొట్టు ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి.

## వైట్ డ్రెస్ లో అందాలతో అదరహో అనిపిస్తున్న సోనమ్ కపూర్!

ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్ తాజాగా లండన్ లో మెరిసింది. ఫ్యాషన్ వీక్ లో భాగంగా తన అందాలతో అక్కడి వారిని మంత్ర ముగ్ధులను చేసింది. తాజాగా ఫ్యాషన్ వీక్ లో భాగంగా వైట్ కలర్ డ్రెస్ ధరించి స్లీవ్ లెస్ టాప్ ఎద అందాలతో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది. వైట్ కలర్ డ్రెస్ పై అందంగా.. పక్షి ఆకారంలో స్టోన్స్ తో పొదిగిన బ్లూ కలర్ ఎంబ్రాయిడరీ తో చేసిన డిజైన్ డ్రెస్ కే సరికొత్త అందాన్ని తీసుకొచ్చారు. తాజాగా సోనమ్ కపూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అమ్మడి అందాలకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా ఎద అందాలను ఎక్స్పోజ్ చేస్తూ సోనమ్ కపూర్ ఇచ్చిన ఫోజులు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తున్నాయి. ఈమె ఫోటోలు చూసిన నెటిజన్స్ కొంతమంది ఫైర్ ఎమోజీలను పెడుతుంటే.. మరికొంతమంది లవ్ సింబల్స్ షేర్ చేస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా సోనమ్ కపూర్



లండన్ లో తన అందాలతో అందరి దృష్టిని ఆకర్షించింది అని చెప్పడంలో సందేహం లేదు. సోనమ్ కపూర్ విషయానికి వస్తే.. 1985 జూన్ 9వ తేదీన ముంబై మహారాష్ట్రలో జన్మించింది. ఈమె తండ్రి ఎవరో కాదు ప్రముఖ నటుడు, నిర్మాత అనిల్ కపూర్ కూతురు. ఈయన దాదాపు 100కు పైగా చిత్రాలను నిర్మించిన విషయం తెలిసిందే. ఈమె సింగపూర్ లోని యునైటెడ్ వరల్డ్ కాలేజ్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియాలో థియేటర్ ఆర్ట్స్ చదువుకుంది. 2005లో సంజయ్ లీల భన్సాలీ దగ్గర సహాయ దర్శకురాలిగా చేరిన ఈమె.. బ్లాక్ సినిమా కోసం అసిస్టెంట్ డైరెక్టర్గా పనిచేసింది. ఆ తర్వాత సంజయ్ దర్శకత్వం వహించిన సావరియా అనే సినిమాతో 2007లో హీరోయిన్గా అరంగేట్రం చేసింది. ఇందులో ఈమె నటనకు గాను ఉత్తమ నూతన నటి విభాగంలో ఫిలింఫేర్ పురస్కారం కూడా లభించింది. మూడు సంవత్సరాల తర్వాత 2010లో ఐ హేట్ లవ్ స్టోరీస్ సినిమాతో మొదటి కమర్షియల్ సక్సెస్ అందుకున్న ఈమె.. వరుసగా ఫ్లాప్ ల తర్వాత 2013లో వచ్చిన రాంఝనా సినిమా సక్సెస్ అవడంతో మళ్లీ ఈమె కెరియర్ గాడిన పడింది అని చెప్పవచ్చు. అలా వరుస సినిమాలలో చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. వివిధ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ ఉంటుంది. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వాటికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించే ఈమె ఎన్నో బ్రాండ్లకు, ఉత్పత్తులకు అంబాసిడర్ గా కూడా వ్యవహరిస్తోంది. సోనం కపూర్ వ్యక్తిగత జీవిత విషయానికొస్తే.. 2018లో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త ఆనంద్ ఆహుజాను వివాహం చేసుకుంది. 2022 ఆగస్టు 20న మగ బిడ్డకు జన్మనిచ్చింది ఈ ముద్దుగుమ్మ.

## క్లాసీ అందాలతో గుండె గిల్లుతున్న బ్యూటీ

క్లాసీ అందంతో మతులు చెడగొట్టడంలో ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి తర్వాతే. జెన్ జెడ్ స్టార్ గా కెరీర్ బండిని విజయవంతంగా ప్రారంభించిన కృతి కొన్ని వరుస ఫ్లాపులతో డీలా పడింది. అయినా ఇప్పటికీ అవకాశాలకు కొదవేమీ లేదు. టాలీవుడ్ లో స్పీడ్ తగ్గినా కానీ, కోలీవుడ్ లో మ్యానేజ్ చేస్తోంది. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్, ఎస్.జె.సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రంలో కృతి శెట్టి కీలక పాత్రను పోషిస్తోంది. మరోవైపు సోషల్ మీడియాల్లో తన అభిమానులకు అవిశ్రాంతంగా అన్ లిమిటెడ్ ట్రీటిస్తోంది. కృతి శెట్టి వరుస ఫోటోషూట్లు యువతరంలో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా కృతి బ్లాక్ కలర్ పోల్కా డ్రెస్ లో అద్భుతంగా మెరిసిపోతున్న ఫోజ్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. తన 21వ పుట్టినరోజు సందర్భంగా ఇది స్పెషల్ ఫోటోషూట్. బ్లాక్ అండ్ వైట్ పోల్కా డాట్ హాల్టర్ నెక్ మినీ



డ్రెస్‌లో కృతి ఎంతో అందంగా కనిపిస్తోంది. ఫెయిర్ లుక్, సింపుల్ చిరునవ్వుతో కుర్రకారు గుండెల్ని గిల్లుతున్న ఈ బ్యూటీ పాల నురుగు దేహశిరులను అందంగా ఎలివేట్ చేసేందుకు తపిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ప్రదీప్ రంగనాథన్, ఎస్.జె సూర్య కీలక పాత్రలు పోషిస్తున్న తాజా చిత్రం ఎల్.ఐ.కె లో కృతి కథానాయికగా నటిస్తోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన స్పెషల్ బర్త్ డే ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కెరీర్ ఆరంభమే కొన్ని పెద్ద ప్రాజెక్టుల్లో అవకాశం అందుకున్న కృతి సరైన బ్లాక్ బస్టర్ అందుకోవడంలో తడబడింది. అది ఈ భామ కెరీర్ జోష్ ని తగ్గించిందని చెప్పాలి. ఓటీటీలు ఏలుతున్న ఈ రోజుల్లో కృతి శెట్టి తదుపరి కొన్ని స్పెషల్ ప్రాజెక్టులతో దూసుకు రానుందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536